www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 15-7-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 129 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.10:39 తదుపరి షష్ఠి, నక్షత్రం:శతభిషం ఉ.6:26, పూర్వాభాద్ర తె.5:46 వరకు, వర్జ్యం:మ.12:39-2:12, దుర్ముహూర్తం: ఉ.8:28-9:19, రా.10:26-11:08, అమృతఘడియలు: రా.9:59-11:32, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:52, సూర్యాస్తమయం: 6:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 15-7-2025
Guntur |Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
గుంటూరు సిటీ

## మింటిలోకి రేపంటి రూపం!

నిన్నటి తరం అగ్రనటి బి.సరోజాదేవి కన్నుమూత

13 ఏళ్ల వయసులోనే చిత్రసీమలోకి..

నాలుగు భాషల్లో 200 చిత్రాల్లో అభినయం

'చిటపట చినుకులు' పాటతో అభిమానుల హృదయాల్లో శాశ్వతంగా..


9



# ఢిల్లీకి 'బనకచర్ల'!

## రేపు చంద్రబాబు, రేవంత్‌తో కేంద్ర జలశక్తి మంత్రి భేటీ








గోదావరి-బనకచర్ల అనుసంధానమే ప్రధానాంశం

ఎజెండాతో రావాలని ఇద్దరు సీఎంలకూ సూచన

సీఎస్‌లకు సమాచారం

ట్రైబ్యునళ్ల తీర్పులు, వాప్కోస్ నివేదిక కేంద్రం ముందు ఉంచేందుకు రాష్ట్రం సన్నద్ధం

200 టీఎంసీలు వాడటం వల్ల తెలంగాణకు నష్టం లేదని పునరుద్ఘాటన

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల హక్కులపై నెలకొన్న వివాదాలు, సమస్యల పరిష్కారానికి కేంద్రం సమాయత్తమైంది. తమ తమ ఎజెండాలతో ఢిల్లీ రావాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలను కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ కోరారు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు జలశక్తి భవన్‌లో వారిద్దరితో ఆయన సమావేశం కానున్నారు. ఈ మేరకు ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు విజయానంద్, రామకృష్ణారావులకు జలశక్తిశాఖ నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు మంగళవారం ఢిల్లీ వెళ్తున్నారు. రాత్రికి అక్కడే బసచేసి బుధవారం రేవంత్‌రెడ్డితో కలసి సీఆర్ పాటిల్‌ను కలుస్తారు. ఈ భేటీలో పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకమే ప్రధానాంశం కానుంది. గోదావరి నుంచి కడలిపాలయ్యే వరద జలాల్లో 200 టీఎంసీలను రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు ఎత్తిపోసి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు తరలిస్తామని ఏపీ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర జల సంఘానికి ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను కూడా అందజేసింది. తెలంగాణ ప్రభుత్వం, అక్కడి పార్టీలు ఈ ప్రాజెక్టును

మిగతా 13వ పేజీలో...

## నేడు ఢిల్లీకి చంద్రబాబు

### అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11.45కి ఢిల్లీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ అవుతారు. అనంతరం 1-జన్‌పథ్‌లో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్‌తో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీ మెట్రో ఎండీ వికాస్ కుమార్‌తో భేటీ అవుతారు. రాష్ట్రంలో నిర్మించతలపెట్టిన మెట్రో రైలు ప్రాజెక్టులపై ఈ సమావేశంలో

మిగతా 13వ పేజీలో...


## 'రామాయపట్నం' అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ ఉక్కు

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు

లింగసముద్రంలో ఐరన్ ఓర్ కేటాయింపునకు ఎన్‌వోసీ

కందుకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రఖ్యాత జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఇక్కడ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయనుంది. దీని కోసం రామాయపట్నం పరిసరాల్లో భూ కేటాయింపులు చేయాలని గత ప్రభుత్వంలోనే దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం ఆ దిశగా చకచకా అడుగులు పడుతున్నాయి. ఉక్కు రంగంలో జేఎస్‌డబ్ల్యూకు మంచి పేరు ఉండడంతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసి.. అవసరమైన అనుమతుల మంజూరుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. పోర్టు సమీపంలో భూ కేటాయింపునకు అంగీకరించడంతోపాటు లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఇనుప ఖనిజ నిక్షేపాలున్న కొండలు, ఇతర ప్రభుత్వ భూములు కూడా ఆ సంస్థకు కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు లింగసముద్రం మండలంలో ఐరన్ ఓర్ నిక్షేపాలున్న పలు గ్రామాల పరిధిలోని

మిగతా 12వ పేజీలో...



## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

దత్తాత్రేయ స్థానంలో హరియాణాకు అసీం ఘోష్

లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా

నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు (74) గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. మరోవైపు హరియాణా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. ఆయనకు పొడిగింపు లభించలేదు. ఆయన స్థానంలో పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అసీమ్ కుమార్ ఘోష్‌ను నియమించారు. ఈ నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆమోదముద్ర వేశారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వీరి నియామకాలు అమల్లోకి వస్తాయి. దత్తాత్రేయను తొలుత 2019 సెప్టెంబరు 19న హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు. అనంతరం 2021 జూలై 7న హరియాణాకు బదిలీ అయ్యారు. గవర్నర్‌గా ఆయన ఐదేళ్ల పదవీకాలం గత ఏడాది సెప్టెంబరు 10నే ముగిసినప్పటికీ 9 నెలలుగా పదవిలో కొనసాగుతున్నారు. ఎన్‌డీఏలో టీడీపీ మళ్లీ చేరి 15 నెలలైన తర్వాత తెలుగుదేశం నేతకు గవర్నర్ పదవి ఇవ్వడం గమనార్హం. ప్రస్తుతం గోవా గవర్నర్‌గా

మిగతా 13వ పేజీలో...

### తెలుగువారి గౌరవం ఇనుమడింపజేస్తా

అవకాశాల కోసం పరుగెత్తలేదు..

ఇస్తే న్యాయం చేస్తున్నా: అశోక్ గజపతిరాజు

13

మోదీ, చంద్రబాబుకు మాజీ మంత్రి ధన్యవాదాలు

## 691 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులు

కూటమి ప్రభుత్వంలో తొలి నోటిఫికేషన్

కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలు రెన్యువల్

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ మొదటి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే మెగా డీఎస్సీ వచ్చినా ఏపీపీఎస్సీ ద్వారా ఇదే తొలి నోటిఫికేషన్. అటవీ శాఖలో 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్‌ను జారీచేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈనెల 16 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్పోర్ట్స్ కోటా ఖాళీలు, ఎస్సీ గ్రూపుల వారీగా ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచుతామన్నారు.

## భారత్‌నెట్-2లో చేరండి

### ఫైబర్‌నెట్‌ను గాడిలో పెట్టండి

వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసింది

రాజకీయ అవసరాలకు వాడుకుంది

లేని పోస్టులు సృష్టించారు

కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారు

కనెక్షన్లు సగానికి తగ్గి ఖర్చు పెరిగింది

కనెక్షన్లు పెంచడంపై దృష్టి పెట్టండి

కేబుల్ ఆపరేటర్లకు సెట్‌టాప్ బాక్సులు ఇవ్వండి

ఏపీ ఫైబర్‌నెట్ సమీక్షలో సీఎం ఆదేశాలు

2019 నాటికి 8.7 లక్షల కనెక్షన్లు ఉన్నాయి

ప్రస్తుతం 4.5 లక్షలకు తగ్గిపోయాయి

ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు



ఏపీ ఫైబర్‌నెట్ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, అధికారులు

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఏపీ ఫైబర్‌నెట్‌ను తిరిగి గాడిలో పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యువతకు ఉపయోగపడాల్సిన వ్యవస్థను గత ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం వాడుకుందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో ఫైబర్‌నెట్ లక్ష్యం దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో 8.70 లక్షల కనెక్షన్‌లు ఉండగా.. వైసీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ సంఖ్య నాలుగున్నర లక్షలకు పడిపోయిందని, ఖర్చుపెరిగిపోయిందని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఏపీ ఫైబర్‌నెట్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. సంస్థ ముందున్న సవాళ్లు, ఆర్థిక సమస్యలు, ఫైబర్‌నెట్‌ను పూర్తిస్థాయిలో గాడిలో పెట్టేందుకు

మిగతా 13వ పేజీలో...



## నాణ్యమైన మద్యమే అమ్మాలి

అంతర్జాతీయ, జాతీయస్థాయి నాణ్యత ఉండాలి.. నాటుసారా కనపడొద్దు

అనుమానాస్పద బ్రాండ్లు అమ్మనీయొద్దు.. ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు

గత ప్రభుత్వంలో జే బ్రాండ్లతో అనారోగ్యం.. ఆన్‌లైన్ పేమెంట్లను ప్రోత్సహించాలి

ఎక్సైజ్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష.. పొరుగురాష్ట్రాల కంటే ఏపీలోనే మద్యం ధరలు తక్కువ.. వినియోగదారులపై నెలకు 116 కోట్ల భారం తగ్గింది

## హెచ్చరించాకే జరిమానాలు

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు.. సిగ్నల్ జంప్ చేస్తే ఫొటోలు పంపండి

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన.. టెక్నాలజీతో నేరగాళ్ల భరతం పట్టండి

అన్ని శాఖలకూ ఆర్టీజీఎస్ డేటానే ప్రామాణికం.. డ్రోన్ సిటీ అభివృద్ధిపై దృష్టి

రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి నిర్దేశం

14

## ఇక వరుసగా అల్పపీడనాలు!

రాష్ట్రంలో 17 నుంచి పెరగనున్న వానలు

18 నుంచి 20 వరకూ కోస్తా, సీమల్లో భారీవర్షాలు

పశ్చిమ బెంగాల్ సమీపంలో వాయుగుండం

12



13

కార్తికేయ

## పిడిగుద్దులకు విద్యార్థి మృతి

దాడి చేసింది తొమ్మిదో తరగతి చదివే సహ విద్యార్థే

పాఠశాల ముగిశాక కోటలోకి రా అంటూ సవాల్

అలాగే వెళ్లడంతో దారుణం

విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో ఘటన

## భావ ప్రకటన.. స్వీయ నియంత్రణ



సోషల్ మీడియా కంటెంట్‌పై కట్టడి ఉండాలి.. సెన్సార్ పద్ధతి సరికాదు

అలాంటి పోస్టులకు పౌరులు వారంతట వారే దూరంగా ఉండాలి

కొన్ని జాగ్రత్తలతో భావప్రకటన స్వేచ్ఛ

మార్గదర్శకాలిచ్చే అంశం ఆలోచిస్తున్నాం: సుప్రీంకోర్టు

### జీవిత భాగస్వామితో సంభాషణల రికార్డుల్ని సాక్ష్యంగా తీసుకోవచ్చు!

వివాహసంబంధ కేసుల్లో దీనికి ఓకే

పరస్పర నిఘా అంటేనే.. ఆ భార్యాభర్తల మధ్య బంధం లేదని..

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

పంజాబ్-హరియాణా హైకోర్టు తీర్పు కొట్టివేత

11

### నిమిషను రక్షించడానికి.. 'బ్లడ్ మనీ'యే దారి

సుప్రీంకోర్టుకు 'సేవ్ నిమిష కౌన్సిల్' నివేదన

ఇందులో ప్రభుత్వం చేయగలిగింది తక్కువే!

అయినా సాధ్యమైనదంతా చేస్తున్నాం: కేంద్రం

రేపే యెమెన్‌లో నర్సు నిమిష ప్రియకు ఉరి



14

### జస్టిస్ బట్టు దేవానంద్ మళ్లీ ఏపీకి

మద్రాస్ హైకోర్టు నుంచి బదిలీ

రాష్ట్రపతి ఆమోదం..

కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్



11

### చీఫ్ జస్టిస్ గవాయ్‌కి అస్వస్థత ఢిల్లీ ఆసుపత్రిలో చేరిక

హైదరాబాద్ పర్యటన తర్వాత తీవ్ర ఇన్ఫెక్షన్

## నేరగాళ్ల భరతం పట్టే 'క్రైమ్ స్పాట్స్'



ఆధారాల సేకరణకు ప్రత్యేక వాహనాలు

అధునాతన కిట్, ఫోరెన్సిక్ నిపుణులతో ప్రత్యేక కార్లు

శిక్షల శాతం పెంచేలా పోలీసుల కసరత్తు

సీఎం చేతుల మీదుగా 109 వాహనాల పంపిణీకి సిద్ధం



క్రైమ్ స్పాట్స్ వాహనం

### ఏపీలో పెరగనున్న ఐపీఎస్‌లు

అదనపు కేటాయింపులు, కన్వర్ట్ కోసం ప్రయత్నాలు

నేడు కేంద్ర హోం శాఖ, డీవోపీటీకి డీజీపీ వినతి

14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): "నేరం చేస్తే జైలుకు వెళ్లాల్సిందే. శిక్షల శాతం పెరిగి తీరాల్సిందే. అప్పుడే ప్రజల ధన, మాన, ప్రాణాలకు భరోసా ఉంటుంది. ఆధారాలు లేవంటూ కోర్టుల్లో కేసులు కొట్టేస్తే నిందితులకు భయం ఉండదు. మళ్లీ నేరాలకు పాల్పడితే శాంతి భద్రతలు అదుపు తప్పుతాయి. దీనికి ఎలాగైనా చెక్ పెట్టాలి. ఆధారాల సేకరణ నుంచి ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా వ్యవహరించి 65శాతానికి పైగా శిక్షలు పడేలా చేయాలి" ఇదీ ఏపీ పోలీసు శాఖ తీసుకున్న

మిగతా 12వ పేజీలో...

# QIS COLLEGE OF ENGINEERING & TECHNOLOGY (AUTONOMOUS)

QIS Educational Institutions — Celebrating 27 Years Academic Excellence — Nidamanuri Educational Society

Accredited with Grade A+ NAAC | NBA Tier-I Accredited UG | AICTE IDEA Lab | nirf National Institutional Ranking Framework for Innovation 2023 | Institution's Innovation Council (Ministry of HRD Initiative)

Most Reputed **Autonomous** Engineering College in the State of Andhra Pradesh / Nation

National Instruments | Dassault Systemes | ARC Applied Robot Control

CENTRE OF EXCELLENCE WITH Tech Mahindra

Rs.25000/- Stipend for month during internship for EULER selected students

## QIS COLLEGE OF ENGINEERING & TECHNOLOGY

### B.Tech

- Computer Science and Engineering
- Computer Science and Engineering (Data Science)
- Computer Science and Engineering (Artificial Intelligence and Data Science)
- Computer Science and Engineering (Artificial Intelligence and Machine Learning)
- Computer Science and Engineaering (IOT and Cyber Security with Block chain Technology)
- Computer Science and Information Technology
- Information Technology
- Artificial Intelligence
- Electronics and Communication Engineering
- Electrical and Electronics Engineering
- Civil Engineering
- Mechanical Engineering

### M.Tech

- Computer Science and Engineering
- Computer Science and Engineering (Artificial Intelligence and Machine Learning)
- VLSI and Embedded Systems
- Transportation Engineering
- Structural Engineering
- Power Electronics and Power Systems
- Thermal Engineering

JNTUK recognised research centers in CSE, ECE, EEE, Mech, Physics, Chemistry.

BCA
MCA
MBA
NEW MBA (HOSPITAL AND HEALTH CARE MANAGEMENT)

COUNSELLING CODE **QISE**

## QIS COLLEGE OF PHARMACY

ESTD : 2006

B.Pharm - 100
Pharm.D. - 30
Pharm.D PB - 10

COUNSELLING CODE **QISP**

M.PHARM :

| | |
|---|---|
| Pharmaceutics | 15 |
| Pharmaceutical Analysis | 15 |
| Pharmacology | 15 |

## Placement Summary

- **928+** PLACEMENT OFFERS Still Continuing...
- **10 LPA** Highest Salary Package Offered
- **42+** Top Companies Visited
- **5.2 LPA** Average Package Offered





**Dr. N.S.KALYAN CHAKRAVARTHY**
B.E., M.Tech.(CSE), Ph.D
Honourable Founder & Executive Chairman
QIS Educational Institutions - SNES
Cell : 99499 99977

- QUALITY EDUCATION
- AICTE IDEA LAB
- BEST CAMPUS LIFE
- TOP NOTCH PLACEMENTS
- INCUBATION & ENTREPRENEUR CENTERS
- BEST SKILLING, RESEARCH & PROJECT CENTERS
- SPORTS, NCC & BEYOND

*Awarded as unique engineering college for innovation and research in A.P.*

*Received award of excellence 2023 from ministry for higher education, Govt. of A.P.*



VENGAMUKKAPALEM, ONGOLE. Admissions Contact... **9246419545, 9246419547, 9246419579, 9246419527**



## తిరుమలలో తరగని రద్దీ

తిరుమల, జూలై14(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం నాలుగురోజులుగా యాత్రికులతో కిటకిటలాడుతోంది. గురువారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లతోపాటు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోతూనే ఉన్నాయి. కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ మీదుగా బాటగంగమ్మ, శ్రీవారిసేవాసదన్, ఆక్టోబస్ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపిస్తోంది. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్ శిలాతోరణ సర్కిల్ వరకు ఉంది. వీరికి 15 గంటల దర్శన సమయం పడుతోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్నవారికి మూడు నుంచి నాలుగు గంటల తర్వాతే దర్శనం లభిస్తోంది.

### ఒంటిమిట్టలో ఆగస్టు నుంచి
## తిరుమల తరహాలో అన్నదానం

తిరుమల, జూలై14(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో తిరుమల తరహాలో అన్నప్రసాద వితరణకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఆగస్టు నుంచి అన్నదానం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనాభవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, అన్నప్రసాద విభాగాలు సమన్వయంతో అన్నప్రసాద వితరణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఒంటిమిట్టలో ఏప్రిల్11న జరిగిన కోదండరామస్వామి కల్యాణోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన సూచన మేరకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

## జేవీవీ నూతన అధ్యక్షునిగా శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షునిగా నెల్లూరు జిల్లాకు చెందిన కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కడపలో శని, ఆదివారాల్లో జేవీవీ 18వ రాష్ట్ర సభలు జరిగాయి. ఈసందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన బి.విశ్వనాథ, కోశాధికారిగా విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ పైల రమేశ్‌రాజు, రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన భాస్కర్, రాష్ట్ర సలహామండలి సభ్యునిగా కె.సురేశ్‌బాబు ఎన్నికయ్యారు. వీరంతా మరింత బాధ్యతగా పనిచేసి వేదికను విస్తృతపరచాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

## ఆ నలుగురి ఉద్యోగాల తొలగింపునకు సూచిస్తాం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

జీజీహెచ్ (కాకినాడ), జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అనుబంధమైన జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ల్యాబ్ అటెండెంట్, టెక్నీషియన్లను ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగించమని ప్రభుత్వానికి సూచిస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆమె రంగరాయ వైద్య కళాశాలను సందర్శించి బాధిత విద్యార్థినులను కలుసుకుని అటెండెంట్, టెక్నీషియన్లు చేసిన అకృత్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు నిర్భయంగా వివరాలను తెలియజేసేందుకు కళాశాల ఆడిటోరియంలోని ప్రత్యేక గదిలో ఏకాంత సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, అధ్యాపకులు, ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ సభ్యులతో కూడా సమావేశమై భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. బాధిత విద్యార్థినులను కళాశాలలోగానీ, జీజీహెచ్‌లో గానీ, అధికారులు గానీ, సిబ్బంది గానీ టార్గెట్ చేసే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

## ఘాట్‌లో ప్రతి బండిపై నిఘా..!

- తిరుమల ఘాట్‌లలో ఏఎన్‌పీఆర్ వ్యవస్థ ఏర్పాటు దిశగా టీటీడీ
- సీసీ కెమెరాలతో అనుసంధానం.. వచ్చివెళ్లే ప్రతి వాహనం గుర్తింపు
- ఏర్పాటుకు ముందుకొచ్చిన ఎల్‌అండ్‌టీ సంస్థ

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్లలో ప్రయాణించే ప్రతి వాహనాన్నీ గుర్తించేందుకు 'ఆటోమ్యాటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్' (ఏఎన్‌పీఆర్) వ్యవస్థ ఏర్పాటుకు టీటీడీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ప్రస్తుతం తిరుమలకు రోజూ 7వేల నుంచి 10వేల వాహనాలు వచ్చి వెళ్తున్నాయి. టోల్ గేట్లలో నమోదయ్యే సమాచారం తప్ప ఈ వాహనాలకు సంబంధించిన రికార్డులేవీ టీటీడీ వద్ద ఉండవు. ఈ క్రమంలో అత్యంత ప్రసిద్ధి చెందిన హిందూ ధార్మిక క్షేత్రంలో భద్రతను మరింత పెంచేందుకు ఏఎన్‌పీఆర్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నారు. తిరుమలలో 2,780 సీసీ కెమెరాలున్నా ఘాట్‌రోడ్లలో మాత్రం లేవు. దీంతో ఘాట్ రోడ్లలో సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిని ఏఎన్‌పీఆర్ వ్యవస్థతో అనుసంధానం చేస్తే.. వాహనం సీసీ కెమెరా ముందుకు రాగానే నంబర్ ప్లేట్‌ను గుర్తించి నమోదు చేస్తుంది. కాబట్టి ఏ వాహనం ఏ సమయంలో ఏ ప్రాంతంలో ఉంది అనే సమాచారం ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. వాహనం నంబర్‌ను ఎంటర్ చేస్తే చాలు ఆ వాహనం ఏయే రోజుల్లో, ఏయే సమయాల్లో తిరుమల ఘాట్ రోడ్లలో కనిపించిందో మొత్తం రికార్డు లభ్యమవుతుంది. ఇప్పటికే 40కిపైగా స్మార్ట్ సిటీల్లో ఈ వ్యవస్థను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ తిరుమలలోనూ దీన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. దీనిపై నివేదిక సమర్పించాలని టీటీడీ ఎల్ అండ్ టీ సంస్థను కోరింది.

### హెల్మెట్ లేకపోతే దొరికిపోతారు

దీంతోపాటూ ఘాట్ రోడ్లలో 'నో హెల్మెట్ డిటెక్షన్' సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని టీటీడీ భావిస్తోంది. ప్రస్తుతం రోజుకు వెయ్యి దాకా బైక్‌లు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయి. తిరుమలకు హెల్మెట్ లేకుండా అనుమతించరు. అయితే టోల్‌గేట్ దాటగానే చాలామంది హెల్మెట్ తీసేస్తున్నారని టీటీడీ గుర్తించింది. 'నో హెల్మెట్ డిటెక్షన్' సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుంటే హెల్మెట్ లేని వాహనాన్ని గుర్తించి ఆటోమ్యాటిక్‌గా జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

# మనోడేగా ఇచ్చేద్దాం..!

## రాష్ట్ర పర్యాటక శాఖ పరిధిలో తూతూ మంత్రంగా టెండర్ల ప్రక్రియ

- అధికారులు నిర్ణయించిన వారికే పనులు
- పేరుకే టెండర్లు.. పనులు నామినేషన్‌లోనే
- రూ.20 కోట్ల టెండర్.. అడ్డగోలుగా అప్పగింత
- అర్హతున్న కంపెనీలకు కావాలనే మొండిచేయి
- టీడీసీలో ఇంజనీర్ల ఇష్టారాజ్యం.. 4 కోట్ల నష్టం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్(ఏపీటీడీసీ) ఇంజనీరింగ్ విభాగంలో టెండర్ల మతలబు జరుగుతోంది. కార్పొరేషన్‌లోని ఇంజనీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. ఏ టెండర్‌నైనా.. తమకు నచ్చిన కంపెనీకే కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో అర్హత, అనుభవం ఉన్న పెద్ద పెద్ద కంపెనీలను సైతం పక్కన పెడుతున్నారు. అప్పటికీ తమకు నచ్చిన కంపెనీకి అప్పగించడంలో అవాంతరాలు ఎదురైతే.. ఏకంగా సదరు టెండర్‌నే రద్దు చేస్తున్నారు. 'ప్రసాద్(పిలిగ్రిమ్ రెజువెంటేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) పథకంలో భాగంగా ఏపీటీడీసీకి రూ.20 కోట్లతో అన్నవరంలోని సత్యదేవుని దేవస్థానంలో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్‌తో పాటు మరికొన్ని పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. వైసీపీ హయాంలో సరైన ప్రతిపాదనలు పంపకపోవడంతో నిర్మాణ పనులకు కేంద్రం నిధులు కేటాయించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడంతో ఆయా పనులకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ, నిర్మాణాలు చేపట్టే బాధ్యత ఏపీటీడీసీ పరిధిలో ఉంటాయి. ఈ పనుల కోసం ఏపీటీడీసీ ఇప్పటి వరకు నాలుగుసార్లు టెండర్లు పిలిచింది. తొలుత గత ఏడాది ఆగస్టు-సెప్టెంబరు మధ్య ఒకసారి టెండర్లు ఆహ్వానించారు. అప్పుడు సంబంధం లేని కారణాలతో రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ టెండర్లు పిలిచినా.. మళ్లీ రద్దు చేశారు. మూడోసారి టెండర్లను 17 శాతం తక్కువ ధరలకు ఒక ప్రముఖ కంపెనీ దక్కించుకుంది. సదరు కంపెనీ పనులు ప్రారంభించే సమయానికి సింహాచలంలో గోడకూలి ఎనిమిది మంది మరణించారు. సింహాచలంలో గోడ కూలడానికి కారణమైన కాంట్రాక్టు సంస్థకే అన్నవరం ఆలయ పనులు కూడా దక్కాయి. దీంతో ప్రభుత్వం సదరు కంపెనీకి దక్కిన అన్నవరం పనులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఏపీటీడీసీ అధికారులు మరోసారి టెండర్లు పిలవాల్సి వచ్చింది. నెల రోజులలోపే పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియను నెలల తరబడి నాన్చారు. ఇలా ఎందుకు ఆలస్యం చేశారన్న దానికి కారణం.. ఈ టెండర్‌ను తమతో కుమ్మక్కైన కంపెనీకి కట్టబెట్టాలని ముందుగానే నిర్ణయించడమేనని తెలిసింది.

### అర్హత ఉన్నా.. లేనట్టుగా!

వాస్తవానికి టెండర్ ప్రక్రియలో ఆరు కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కంపెనీలు మంచి గుర్తింపు, అర్హత ఉన్నవే. ఒక్క కంపెనీని కూడా డిస్క్వాలిఫై చేయడానికి అవకాశం లేదు. ఇంత గట్టిపోటీలో ఇంజనీరింగ్ అధికారులు తమకు నచ్చిన కంపెనీకి టెండర్ దక్కేలా చేయడం కష్టంగా మారింది. దీంతో ఏం చేయాలన్న ఆలోచనలో భాగంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెక్నికల్ బిడ్ తెరవకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. చివరికి నెల రోజుల నుంచి టెండర్లల్లో పాల్గొన్న కంపెనీ యజమానులకు ఏపీటీడీసీ కార్యాలయం నుంచి ఫోన్లు వెళ్లడం ప్రారంభమయ్యాయి. ఈసారి ఏకంగా మంత్రి పేరుతో కంపెనీల యజమానులకు ఫోన్లు చేశారు. మంత్రికి తెలిసిన వ్యక్తి టెండర్లలో పాల్గొన్నారని, కాబట్టి ఈసారి పనులు ఆయనకే ఇచ్చేస్తామని, మీరు పోటీలో ఉండొద్దని చెప్పారు. అయితే.. ఈ ప్రతిపాదనను కొన్ని కంపెనీలు తిరస్కరించాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆయా కంపెనీలను అనర్హులుగా ప్రకటించారు. అంతేకాదు, వారు ముందుగా నిర్ణయించిన కంపెనీకే అర్హత కల్పించి, టెండర్ కట్టబెట్టారు. మిగిలిన కంపెనీలను ఏ కారణాలతో డిస్క్వాలిఫై చేసారో వెల్లడించలేదు. అంటే.. అధికారులు కేవలం పేరుకు మాత్రమే టెండర్లను ఆహ్వానించారు. కానీ.. తెరవెనుక మొత్తం ప్రక్రియను నామినేషన్ పద్ధతిలోనే కట్టబెట్టారని స్పష్టమైంది. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే అంతా నిబంధనల ప్రకారమే చేశామని, టెండర్ కమిటీ నిర్ణయించిన కంపెనీకే పనులు దక్కాయని చెప్పారు.

### రూ.4 కోట్ల నష్టం..

తొలుత టెండర్ దక్కించుకున్న కంపెనీ 17 శాతం తక్కువ మొత్తానికి పనులు చేస్తామని ముందుకు వచ్చింది. సింహాచలంలో గోడ కూలిన ఘటన నేపథ్యంలో ఆ కంపెనీకి దక్కిన పనులను ప్రభుత్వం రద్దు చేసింది. తొలుత టెండర్ దక్కించుకున్న కంపెనీ కోట్ చేసిన 17 శాతమంత కాకపోయినా, రీ టెండర్లలో కనీసం 13 నుంచి 15 శాతం తక్కువ ధరలకే పనులు చేసేందుకు ఓ కంపెనీ ముందుకు వచ్చింది. కానీ, దానిని కూడా అనర్హుల జాబితాలో ఉంచారు. ఇక, ఏపీటీడీసీ ఇంజనీరింగ్ అధికారులు ఎంపిక చేసిన కంపెనీ అధికారులు నిర్ణయించిన ధరలకంటే.. అత్యంత తక్కువగా 3.5 శాతం తక్కువ ధరలకు పనులు చేసేందుకు ముందుకు వచ్చింది. తొలుత టెండర్ దక్కించుకున్న కంపెనీ కంటే 13.5 శాతం అదనంగా కోట్ చేసింది. దీనివల్ల ఏపీటీడీసీకి దాదాపు రూ.4 కోట్లు నష్టం వస్తుంది. అయినా.. అధికారులు సదరు కంపెనీకి మేలు చేసేందుకు 3.5 శాతం తక్కువ ధరలకు మాత్రమే పనులు చేస్తామన్న కంపెనీకే టెండర్ కట్టబెట్టారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. ఏపీటీడీసీకి నష్టం వస్తుందని తెలిసినా ఇంజనీరింగ్ అధికారులు ఒక కంపెనీకి మేలు చేసేందుకు మనోడేగా ఇచ్చేద్దామన్న ధోరణిలో వ్యవహరించారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

## బీసీ హాస్టల్ విద్యార్థులకు ఆయుర్వేద ఆధారిత పోషకాహారం ఇవ్వండి

- కేంద్ర మంత్రికి సవిత వినతి



కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏపీలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు ఆయుర్వేద ఆధారిత పోషకాహారం అందించాలని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విన్నవించారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్య అభివృద్ధి కోసం ప్రతిపాదించిన 'ప్రాజెక్ట్ ఆరోగ్య బాల ఆయుర్ ఆంధ్ర ఇనీషియేటివ్‌'పై సవిత వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాజెక్ట్ కింద పోషకాహార లోపంతో బాధపడుతున్న హాస్టల్ విద్యార్థులకు, కిషోర బాలికలకు అశ్వగంధ, శతావరి, బ్రహ్మి, తులసి, శంకు, పుష్పి వంటి ఆయుర్వేద మూలికలతో తయారైన హెర్బల్ న్యూట్రిషన్ సప్లిమెంట్ అందివ్వనున్నారని మంత్రి సవిత తెలిపారు.















## వికసిత్ గ్రామాలతోనే వికసిత్ భారత్ సాధ్యం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు



న్యూఢిల్లీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌ను సాధించే క్రమంలో ముందుగా వికసిత్ గ్రామాలను నిర్మించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పనితీరు సమీక్ష కమిటీ(పీఆర్‌సీ) మొదటి సమావేశంలో పెమ్మసాని మాట్లాడారు. ప్రతి కుటుంబానికీ పక్కా ఇల్లు, నాణ్యమైన రోడ్లతో కూడిన గ్రామాలు, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకానికి ఏటా కేంద్రం రూ.90 వేల కోట్లకు పైగా కేటాయిస్తోందని దీంతో నాణ్యమైన, ఉత్పాదక ఆస్తుల సృష్టి జరుగుతుందని పెమ్మసాని వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ్) కింద గ్రామీణ కుటుంబాల కోసం ఇప్పటివరకు 3.22 కోట్లకు పైగా పక్కా ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. 2029 నాటికి అదనంగా 2 కోట్ల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు.

## వివాదంలో టీటీడీ ఉద్యోగి

- తనిఖీల కోసం కర్నూలు వచ్చిన క్వాలిటీ కంట్రోల్ డీఈఈ
- ఆయన వచ్చిన కారుపై అన్యమత వచనాలు
- టీటీడీ కల్యాణ మండపం ఆవరణలోనే కారు పార్కింగ్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సిబ్బంది




కర్నూలులోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో పార్కింగ్ చేసిన కారుపై అన్యమత వచనాలు

కర్నూలు, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగిగా పని చేస్తూ చర్చికి వెళ్తున్నారన్న అభియోగంపై ఏఈవో రాజశేఖర్ బాబు సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువకముందే టీటీడీలో పని చేస్తున్న మరో ఉద్యోగి అన్యమత ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కర్నూలులో టీటీడీ కల్యాణ మండపం, ఎమ్మిగనూరు టీటీడీ కల్యాణ మండపం రీ మోడిఫికేషన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను తనిఖీ చేయడానికి టీటీడీ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎలియేజర్ శనివారం ఏపీ21బీఎన్3265 నంబరు కారులో కర్నూలు వచ్చారు. తనిఖీల అనంతరం రాత్రి కర్నూలులోని కల్యాణ మండపంలోనే బస చేసినట్లు సమాచారం. ఆ కారు ముందు, వెనకా క్రీస్తు బోధనలు రాసి ఉన్నాయి. టీటీడీ ఉద్యోగిగా ఉంటూ.. అన్యమత ప్రచారానికి సంబంధించిన వచనాలు రాసి ఉన్న కారులో రావడమే కాకుండా, కల్యాణ మండపం ఆవరణలో కారును పార్కింగ్ చేయడం వివాదాస్పదంగా మారింది. కల్యాణ మండపం ఆవరణలో డీఈఈ పార్కింగ్ చేసిన కారును స్థానిక ఉద్యోగులు ఫొటోలు ఆదివారం టీటీడీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా పనులు పర్యవేక్షించే ఇంజనీరింగ్ అధికారులు లేకుండానే తనిఖీలకు రావడం, ఆయన వచ్చిన కారుపై అన్యమత బోధనలు రాసి ఉండడం వివాదంగా మారింది. ఆ కారు ఓనర్ బొట్టె ఎలియేజర్ ఆయన తండ్రి బి.ఏసయ్యగా విచారణలో తేలింది.

## ఇళ్లు కట్టిస్తానని మోసం చేసిన కాంట్రాక్టర్ అరెస్టు

తెనాలిరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టిస్తానని అగ్రిమెంట్ చేసుకుని నిర్మాణాలు పూర్తి చేయకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసిన కాంట్రాక్టర్‌ను అరెస్ట్ చేసినట్టు గుంటూరు జిల్లా తెనాలి రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం... పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా గత ప్రభుత్వంలో మండలంలోని నేలపాడు లేఅవుట్‌లో లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చారు. అక్కడ ఇంటి నిర్మాణాలకు ఒప్పందం చేసుకున్న పట్టణంలోని మారీసుపేటకు చెందిన ఎస్‌జి బిల్డింగ్‌వర్క్ పున్నారావు కాలపరిమితి ముగిసినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. పలువురి నుంచి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1,80,000 నగదు చొప్పున తీసుకుని నిర్మాణపనులు సగంలోనే వదిలేసి ఇబ్బందులకు గురిచేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# చెత్త నుంచి విద్యుత్..

### కొత్తగా ఆరు ప్లాంట్లు!

- ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- మరో 2 నెలల్లో ఎల్‌ఈడీ లైట్ల పాలసీ: మంత్రి నారాయణ

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ఆరు కొత్త ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆ వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. 'రాష్ట్రంలో రోజుకు 6,500 టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి నిర్వహణ కోసం 2014-19 మధ్య చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 10 ప్లాంట్లు మంజూరు చేయగా, రెండు పూర్తయ్యాయి. 8 ప్లాంట్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరు ప్లాంట్లు ప్రారంభించాలని నిర్ణయించింది. నెల్లూరు, కాకినాడల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఎల్-1 కింద టెండరు ఎంపిక చేశాం. కర్నూలు, కడపలో ప్లాంట్లకు త్వరలో టెండర్లు పిలవనున్నాం. గుంటూరులో రోజుకు 1,400 టన్నుల చెత్తను విద్యుత్‌గా మార్చే ప్లాంట్ ఉన్నా.. దానికి ఒత్తిడి పెరిగింది. అందువల్ల కృష్ణా జిల్లాలో ప్లాంట్ పెట్టేందుకు బందరు లేదా ఉయ్యూరులో వెయ్యి టన్నుల సామర్థ్యం కల ప్లాంట్ కోసం స్థలాన్ని చూస్తున్నాం. తిరుపతిలో మరో ప్లాంట్‌కు ప్లాన్ చేస్తున్నాం. దీంతో 8 ప్లాంట్లు ఉంటాయి' అని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఏ రోజు చెత్తను ఆరోజు మేనేజ్‌మెంట్ చేసినట్లే.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్లాంట్లు పెట్టాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీలు ప్రాధాన్యం ఇచ్చి స్పెషల్ డ్రైవ్ పెట్టాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తిరిగి వినియోగించేలా హైదరాబాద్‌లోని యూనిట్ నిర్వాహకులతో చర్చించి, రీజినల్ ప్లాంట్స్ పెట్టాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో 1.68 లక్షల పడకలు ఉండగా, రోజుకు 17,783 కిలోల జీవ వ్యర్థాలు వస్తున్నాయన్నారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని, ఆక్వా వ్యర్థాలపై పాలసీ తేవాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఇక నుంచి ప్రతి నెలా ఒక థీమ్‌తో చెత్త నుంచి వ్యర్థాల నిర్వహణ అమలు చేస్తామని తెలిపారు. 2014-19 మధ్య 98వేల ఎల్‌ఈడీ లైట్లు మార్చగా, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఎల్‌ఈడీ లైట్ల గురించి పట్టించుకోలేదన్నారు. మరో రెండు నెలల్లో ఎల్‌ఈడీ లైట్లపై ఒక పాలసీ తెస్తామని వెల్లడించారు. ఈ ఏడాది విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖ, రాజమండ్రికి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు వచ్చాయని, మిగతా మున్సిపాలిటీలు కూడా పోటీపడి స్వచ్ఛ అవార్డులు సాధించాలని సూచించారు.

## నిమ్న వర్గాల అభ్యున్నతికి నిబద్ధతతో పనిచేయాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్




సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

విజయవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిమ్నవర్గాల అభ్యున్నతి లక్ష్యంగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల నుంచి అట్రాసిటీకి సంబంధించిన ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పోలీసులపై చర్యలు తీసుకునే అధికారాలు కమిషన్‌కు ఉన్నాయన్నారు. మూడు నెలలకొకసారి తప్పనిసరిగా జిల్లా స్థాయిలో విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. పూచీకత్తు లేని రుణాల మంజూరుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని రాంచందర్ కోరారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీ శ, సీపీ ఎస్.వీ.రాజశేఖర బాబు, డీఆర్‌ఓ ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ డీఆర్‌ఓ కావూరి చైతన్య, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమాధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

## కామ్రేడ్ విజయ్ మరణం విప్లవోద్యమానికి తీరని నష్టం

- యుసీసీఆర్ఐ(ఎం-ఎల్) సంస్థ కార్యదర్శి వినోద్



హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం సభ్యుడు కామ్రేడ్ విజయ్(74) శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారని, ఆయన మృతి కమ్యూనిస్టు విప్లవోద్యమానికి తీరని నష్టమని యుసీసీఆర్ఐ(ఎంఎల్) సంస్థ కార్యదర్శి వినోద్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని వ్యాప్తి చేయడానికి, వ్యవసాయ విప్లవ పోరాటాలు, విద్యార్థి ఉద్యమాల నిర్మాణానికి, సింగరేణి బెల్ట్‌లో కార్మిక పోరాటాలకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం లంకపల్లి గ్రామంలో 1951 మార్చి 19న జన్మించిన విజయ్.. ఏరోనాటిక్ ఇంజనీరింగ్ పూర్తి చేసి న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్‌లో చేరి, విప్లవోద్యమాలకు ఆకర్షితుడై ఉద్యోగానికి రాజీనామా చేశారని వినోద్ తెలిపారు.

### పొగాకు కొనుగోలుకు
## అదనపు కేంద్రాలు

- గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఏర్పాటు చేస్తాం
- వచ్చే సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చూడండి: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు కొనుగోలుకు అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సోమవారం గుంటూరు సమీపంలోని లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో బర్లీ పొగాకు కొనుగోలుపై అధికారులు, రైతు ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ వర్చువల్‌గా పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ 'గతేడాది 36వేల హెక్టార్లలో సాగైన బర్లీ పొగాకు 80మిలియన్ కిలోలు ఉత్పత్తి అవ్వగా, 36మిలియన్ కిలోల పొగాకును 22 కంపెనీలు, మార్క్‌ఫెడ్ కొనుగోలు చేశాయి. కొనుగోలును మరింత వేగవంతం చేసేందుకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్లకు వెసులుబాటు కల్పిస్తున్నాం. ఈ నెల 21 నుంచి యాప్‌లో నమోదైన సన్నచిన్నకారు రైతుల నుంచి 1-20 క్వింటాళ్ల ఉత్పత్తిని నాణ్యత ప్రమాణాలతో వెంటనే కొనుగోలు చేస్తాం. 20 క్వింటాళ్లపైన ఉన్న రైతులకు కొనుగోలు తేదీల షెడ్యూల్ తెలియజేస్తాం. యాప్‌లో నమోదు కాని రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయడానికి అధికారులు చర్యలు చేపడతారు. గ్రామాల్లో గోడౌన్లు నిండిపోయాయని రైతులు ఆందోళన చెందొద్దు. ప్రభుత్వమే పూర్తి రవాణా ఖర్చును భరించి, కొత్త గోడౌన్లకు పొగాకు చేరుస్తుంది. వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ల గిడ్డంగుల్లో నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ప్రైవేట్ గోడౌన్లు అద్దెకు తీసుకుంటాం. రానున్న సీజన్‌లో పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని మంత్రి అన్నారు. ఎమ్మెల్యేలు పుల్లారావు, సాంబశివరావు, రామాంజనేయులు, పొగాకు బోర్డు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# సందేహాలు సశేషం!

**మన** దేశాన్నే కాదు, యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనపై ఇటీవల విడుదలైన ప్రాథమిక నివేదిక, సమాధానాలకంటే కొత్త సందేహాలు, ప్రశ్నలు రేకెత్తించింది. విమాన ఇంజన్లకు ఇంధనాన్ని సరఫరాచేసే కంట్రోల్ స్విచ్‌లు ఆఫ్ కావడంతో ఈ ఘోరం జరిగిందని నివేదిక అంటోంది. ప్రమాదానికి ముందు ఏ క్షణానికి ఏం జరిగిందన్న వరుసక్రమంతో పాటు, కాక్‌పిట్ సంభాషణల వివరాలను కూడా ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్‌బ్యూరో (ఎఎఐబి) ఈ ప్రాథమిక నివేదికలో అతిపరిమితంగా ఉంచింది. గాల్లోకి లేచిన కొద్ది క్షణాల్లోనే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలి, క్షణాల్లో తగలబడిపోయిన ఈ దారుణఘటనకు అనేకానేక సాంకేతిక అంశాలూ, తప్పిదాలు దోహదం చేశాయని నివేదిక నిగ్గుతేల్చవచ్చునని నిపుణులు సైతం భావించారు. తుదినివేదికలో మరెన్ని వివరాలు, ఇంకెన్ని లోతులు ఉంటాయో తెలియదు గానీ, పదిహేను పేజీల ఈ ప్రాథమిక నివేదిక తన గడువు లక్ష్యాన్ని అయితే అందుకోగలిగింది కానీ, తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.

ప్రాథమిక నివేదిక ఆధారంగా మాట్లాడటం సరికాదని ప్రభుత్వ పెద్దలు ఒకపక్క అంటున్నప్పటికీ, తప్పును తమమీదకు తోసేసే ప్రయత్నంగా పైలట్ల సంఘం అనుమానిస్తోంది. ఎందుకు, ఎలా, సాంకేతికమా, మానవతప్పిదమా వంటి వివరణలూ, వివరాలూ ఏ మాత్రం లేకుండా, పైలట్ల సంభాషణను కూడా పూర్తిగా అందివ్వకుండా నివేదిక విడుదలైనందున పైలట్లకు ఆగ్రహం కలగడం సహజం. ఏం జరిగిందో చెప్పిన ఆ నివేదిక, ఆ చిరు సంభాషణను ప్రస్తావించడం ద్వారా పైలట్లే ఏదో గందరగోళం చేశారన్న అనుమానానికే ఆస్కారం కల్పించింది. ఈ తరహా విమానాల్లో ఇంధన సరఫరా స్విచ్‌లకు లాక్ ఉంటుందని, కుదుపులకు జారిపోకుండా బ్రాకెట్లూ ఉంటాయని నిపుణులు అంటున్నారు కనుక, ఈ విమానంలో ఆ వ్యవస్థ ఉంటే, సక్రమంగా పనిచేస్తున్నదా అన్నది ముఖ్యం. అనుభవజ్ఞులైన పైలట్లు నడుపుతున్న ఈ విమానంలో వారు తమకు నిర్దేశించిన ప్రక్రియలను నిర్లక్ష్యం చేయడమన్నది జరగకపోవచ్చును. కానీ, లాకింగ్ సదుపాయం లేని విమానాలు కూడా ఉన్నందున, పైలట్ ప్రమేయం లేకుండా అవి ట్రిప్ అయ్యే అవకాశాల గురించి నివేదిక రేఖామాత్రంగా ప్రస్తావించి ఉంటే బాగుండేది. టేకాఫ్‌లో స్విచ్‌లు కటాఫ్ కావడం, ఇంధనం అందక విమానం జారిపోవడం, క్షణాల్లో పైలట్లు సరిదిద్దినా ఒక ఇంజన్ మాత్రమే పుంజుకోవడం ఇత్యాది వరుస పరిణామాల మధ్య వారిరువురూ ఎంత ఒత్తిడికి గురై ఉంటారో అర్థమవుతూనే ఉంది.

ఇంధన సరఫరా ఎలా నిలిచిపోయిందన్నది పైలట్లకు అర్థంకాలేదని ఆ సంభాషణలో తెలుస్తూనే ఉంది. కానీ, సీవీఆర్ డేటానుంచి, ఈ రెండు వాక్యాలు మాత్రమే నివేదికలో ఉండటం వల్ల తప్పును వారి మీదకు నెట్టివేసి, విమాన నిర్వహణ సంస్థ, తయారీ సంస్థ తప్పించుకో చూస్తున్నాయన్న విమర్శలకు ఆస్కారం కలిగింది. ఈ నెలరోజుల దర్యాప్తులో చాలా విషయాలు తెలిసినప్పటికీ, వాటిని బయటపెట్టకుండా, ఈ నివేదికను ఆన్‌లైన్‌లో ఏ హడావుడీ లేకుండా ఉంచడం వెనుక ఏవో అంతిమ లక్ష్యాలున్నాయన్న అనుమానాలకూ అవకాశం ఏర్పడింది. ఈ పదిహేనుపేజీల నివేదికలోని అంశాలమీద నిపుణులతో వివరణ ఇప్పించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. స్పష్టతను ఇవ్వాల్సిన నివేదిక సామాన్యులు కొన్ని ప్రమాదకరమైన నిర్ధారణలకు వచ్చేట్టుగా చేసింది. రిపోర్టుమీద ఎవరూ సంతకాలు చేయలేదని, మనకంటే ముందు విదేశీమీడియా సంస్థలకు అది అందిందని కూడా అంటున్నారు. ఇంతటి భయానకమైన ప్రమాదాలు జరిగినప్పుడు, వాటిపై జరిగే దర్యాప్తులను ప్రభావితం చేయడానికి అనేక శక్తులు సహజంగానే ప్రయత్నిస్తాయి. కానీ, ఒత్తిళ్ళకు తలొగ్గి కారణాలను కచ్చితంగా నిర్ధారించని పక్షంలో మన పౌరవిమానయాన రంగానికీ, ప్రభుత్వానికీ అప్రదిష్ట కలుగుతుంది. తుదినివేదిక విడుదల కావడానికి ఎన్ని నెలలు పట్టినప్పటికీ, ఈ పుకార్లు, నిందలకూ అది స్వస్తిచెప్పడం అవసరం. అత్యంత నిజాయితీగా ఆ నివేదిక రూపొంది, బాధిత కుటుంబాలవారికి ఉపశమనం కలిగించాలి.

# న్యూయార్క్‌లో కొత్త పొద్దుపొడుపు

**‘ఆ** అబ్బాయి గురించి నేను ఆందోళన పడుతున్నాను’ అని ఇటీవల భారతీయ అమెరికన్‌ల సమావేశంలో ఒక మాతృమూర్తి కంపిత స్వరంతో అన్నారు. ‘అతడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మతిస్థిమితం లేని అనేక మంది తుపాకులతో తెగబడుతున్నారు..’ అని కూడా ఆమె అన్నారు. ఆ మాతృమూర్తి ప్రస్తావించిన ‘అబ్బాయి’ ప్రభవిస్తున్న జనాకర్షక యువనేత జోహ్రాన్ ఖ్వామె మమ్దానీ. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నిక డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీలలో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచిన దార్శనిక నాయకుడు. అవును, మమ్దానీ గెలుపు విస్మయపరచడమేకాదు, దిగ్భ్రాంతిపరిచింది కూడా. అనూహ్య విజేత మమ్దానీ. ఆయన ప్రత్యర్థులు ప్రభావశీలురు కాకపోవచ్చు కానీ సొంత పార్టీలోనే చాలా మంది విమర్శకులు ఉన్నారు. మమ్దానీ సైద్ధాంతిక విశ్వాసాలను వారు ప్రశ్నిస్తున్న దృష్ట్యా అంతిమ ఎన్నికలో ఆయన విజయం నల్లేరుపై నడక కాదు, కాబోదు. మేయర్ పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని గెలుచుకున్న రోజు, మేయర్ ఎన్నిక జరగనున్న నవంబర్ 4, 2025 మధ్య ఏమైనా సంభవించవచ్చు.

అయితే మమ్దానీ యోధుడు. ఆయన సైద్ధాంతిక చిత్తశుద్ధి శక్తిమంతమైన ప్రభావాన్ని నెరపుతోంది. ఆ ప్రభావానికి చాలా మంది ఇప్పటికే లోనయ్యారు. ఇదే ఆయన్ను తన లక్ష్య సాధనలో ముందుకు సాగేందుకు ప్రేరేపిస్తూనే ఉంటుంది. పార్టీ పరాజయాలు, ప్రజల విముఖతతో నిరుత్సాహంలో మునిగిపోయిన యువ డెమొక్రాట్స్‌ను, ప్రగతిశీలవాదులను ఆయన ఉత్తేజపరచడం కొనసాగుతూనే ఉంటుంది. అధ్యక్ష ఎన్నికలలో కమలాహారిస్ ఓడిపోయిన తరువాత డెమొక్రాటిక్ పార్టీ శ్రేణులు తడబడుతున్నాయి. ఆ దయనీయ స్థితి నుంచి వారిని బయటపడవేసేందుకు మమ్దానీ సకల విధాలా ప్రయత్నిస్తున్నారు. మేయర్ పదవికి పార్టీ అభ్యర్థిత్వాన్ని గెలుచుకోవడం అందులో భాగమే. పార్టీ తనపై పెట్టిన బాధ్యతను అంగీకరిస్తూ నెల్సన్ మండేలా స్ఫూర్తిదాయక మాటలను మమ్దానీ ఉటంకించారు: ‘ఏదైనా సాధించేంత వరకు అది అసాధ్యంగానే కనిపిస్తుంది’.

జోహ్రాన్ మమ్దానీ సరైన సమయంలో ప్రభవించారు. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, న్యూయార్క్ మేయర్ పదవీ ఎన్నిక ఫలితం భావి ఎన్నికల సంభావ్య జయాపజయాలకు ఒక సూచిక అవుతుంది. న్యూయార్క్ నగరం మిగతా అమెరికా కంటే భిన్నమైనది కావచ్చుకాని తమ కొత్త మేయర్‌పై ఈ మహానగర ప్రజల నిర్ణయం భావి ఎన్నికల ఫలితాలకు ఒక సంకేతం అవుతుంది, సందేహం లేదు. జూలై 4, 2026న అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నది. వచ్చే ఏడాదే భారతీయ అమెరికన్లు తమకు విశేషంగా మేలు చేసిన ఒక ప్రముఖ చారిత్రక సంఘటన 80వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగింపు (1945), భారత స్వాతంత్ర్య విజయం(1947) మధ్య సంవత్సరం (1946)లో అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్ లూస్–సెల్లర్ చట్టం (దీనినే ఫిలిప్పీన్స్, ఇండియా ఇమ్మిగ్రేషన్ చట్టం అని కూడా అంటారు)పై సంతకం చేశారు. అమెరికాలోని ఫిలిప్పీనీయులు, భారతీయులకు పౌరసత్వ హక్కులు ప్రసాదించడంతో పాటు ఆ రెండు దేశాల నుంచి అమెరికాకు ఏడాదికి 100 మంది చొప్పున వలస రావడానికి ఈ చట్టం అనుమతించింది. అలా వలసవచ్చిన వారు సహజసిద్ధంగా అమెరికా పౌరులుగా మారే హక్కును కూడా ఆ చట్టం కల్పించింది. ఈ చట్టానికి ఆమోదాన్ని పొందడంలో వలసదారు క్రియాశీలురు కీలకపాత్ర నిర్వహించారు. ద్వితీయ యుద్ధ ప్రపంచంలో మిత్ర రాజ్యాల విజయానికి ఫిలిప్పీన్స్, భారత్ ప్రజల నుంచి లభించిన సహాయసహకారాలకు గాను ప్రత్యుపకారంగా అమెరికా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. ఆసియా జనాభాపై వివక్ష చూపుతున్న వలస విధానాలకు స్వస్తి చెప్పేందుకు ఈ చట్టం విశేషంగా దోహదం చేసింది.




> ట్రంప్ ప్రభుత్వం వలసదారులను అవమానకరంగా స్వదేశాలకు తరలించివేస్తున్న తరుణంలో న్యూయార్క్ మేయర్ ఎన్నిక ప్రైమరీలలో డెమొక్రాటిక్ పార్టీ విజేత జోహ్రాన్ క్వామే మమ్దానీ ఆ అభాగ్యుల తరపున నిలబడి అమెరికా అధ్యక్షుడికి భయానక దుస్స్వప్నంగా పరిణమించారు. నవంబర్ 4న జరిగే ఈ మేయర్ ఎన్నిక ఫలితం వచ్చే ఏడాది కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీల జయాపజయాలను సూచించనున్నది. దక్షిణాసియావాసుల అమెరికన్ స్వప్నానికి మమ్దానీ ఒక సంకేతం.

న్యూయార్క్ నగర సమస్యల పరిష్కారానికి మమ్దానీ అనుసరించే ‘డెమొక్రాటిక్ సోషలిస్ట్’ దృక్పథం ఆచరణీయత, సార్థకతపై మద్దతుదారుల అనుమానాలు ఎలా ఉన్నప్పటికీ ఒకటి మాత్రం వాస్తవం. జోహ్రాన్ మమ్దానీ నిర్భయస్తుడు. ఆయన ఎట్టి పరిస్థితులలోను వలసదారుల హక్కుల పరిరక్షణకు సుస్థిరంగా నిలబడతారు. ట్రంప్ పాలన రెండో హయాంతో వలసదారుల హక్కుల పరిరక్షణకు నిబద్ధమవడమనేది కచ్చితంగా ఎన్నికల ప్రచారంలో ఒక ప్రధాన ఆకర్షణ అవుతుంది. న్యూయార్క్ వాసులలో 60 శాతం మంది వలసదారులు లేదా వారి బిడ్డలే అని 2024లో మేయర్ నివేదిక ఒకటి పేర్కొనడం గమనార్హం. ఈ వాస్తవం దృష్ట్యా వలసదారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చిన మమ్దానీ ఎన్నికల ప్రచారం ఓటర్ల హృదయాలను గెలుచుకోవడంలో ఆశ్చర్యమేముంది?

గత తరాలలో వలసదారుల తరపున పోరాడిన వారికి మమ్దానీ సమున్నత వారసుడు. లూస్–సెల్లర్ చట్టం అమలులోకి రావడంలో అనుపమేయ కృషి చేసిన వ్యక్తి జేజే సింగ్. న్యూయార్కర్ మ్యాగజైన్ ఈయన్ని ‘వన్ మ్యాన్ లాబీ’ (ఒక నిర్దిష్ట సమస్య పరిష్కారానికి ఎవరూ కలిసిరాకున్నా పూర్తిగా సొంత ప్రయత్నాలు, పలుకుబడి ద్వారా కృషి చేసిన వ్యక్తి)గా అభివర్ణించింది. వ్యాపారవేత్త అయిన జేజే సింగ్ 1946లో లూస్–సెల్లర్ బిల్లుపై సంతకం చేసినప్పుడు ఓవల్ ఆఫీసులో ఉన్న ఇద్దరు భారతీయులలో ఒకరు (మరొకరు ఎమ్‌ఓఏ బైగ్ ఆ తరువాత పాకిస్థాన్ ఎంబసీలో చేరారు). ఆ కాలంలో వలసవాదుల హక్కుల పరిరక్షణకు కృషి చేసిన వారిలో తారక్‌నాథ్ దాస్, ముబారక్ అలీ ముఖ్యులు. ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన మరో ప్రముఖుడు దిలీప్‌సింగ్ సాంధ్ (1899–1973). కేలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన సాంధ్, కాంగ్రెస్ దిగువ సభ ప్రతినిధుల సభకు ఎన్నికైన ప్రప్రథమ ఆసియన్ అమెరికన్. 1957 నుంచి వరుసగా రెండుసార్లు ఆయన కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. ఇప్పుడు ప్రతినిధుల సభలో ఆరుగురు భారతీయులు ఉన్నారు. సాంధ్ మాదిరిగా అందరూ డెమొక్రాట్లే.

వర్తమాన అమెరికా సమాజం సాంధ్ కాలం నాటి దానికి చాలా సుదూరమైనదీ, భిన్నమైనదీ అయినప్పటికీ మమ్దానీ లాంటి శ్వేతజాతీయేతర మైనారిటీ అభ్యర్థులకు పూర్తిగా ఈ నాటివైన సమస్యలు, సవాళ్లను విసురుతున్నది. అమెరికాలో నిరంకుశాధికార తత్వం ప్రబలిపోతోన్న పరిస్థితుల్లో కరడుగట్టిన మితవాద రాజకీయ పక్షంగా పరిణమించిన అమెరికా పురాతన రాజకీయ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ మమ్దానీ లాంటి మైనారిటీ, శ్వేతజాతీయేతర అభ్యర్థులు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన వారయితే మరింతగా తీవ్ర విమర్శలకు పాల్పడుతోంది. వారి పట్ల నిస్సిగ్గుగా దుర్నీతితో వ్యవహరిస్తోంది.

‘మమ్దానీ అక్రమ వలసదారు అని అనేక మంది చెబుతున్నారు’ అని అంటూ ఆ యువనేత అమెరికా పౌరసత్వ చట్టబద్ధతను ట్రంప్ ప్రశ్నించారు. మమ్దానీ సహజీకరణ (అమెరికా పౌరుడు కాని వ్యక్తి చట్టబద్ధమైన మార్గాల ద్వారా అమెరికా పౌరుడు అయ్యే ప్రక్రియ) ద్వారా అమెరికా పౌరసత్వాన్ని పొందారు. బరాక్ ఒబామా, కమలా హారిస్‌లు అధ్యక్ష పదవికి పోటీపడిన తరుణంలో కూడా వారిపై ట్రంప్ ఇటువంటి తప్పుడు విమర్శలే చేశారు. ఈ మొరటు దాడులు అనూహ్యమైనవి ఏమీకావు. మేయర్ పదవికి పోటీలో మమ్దానీ ఎదుర్కొంటున్న, ఓటర్ల విదేశీ ద్వేష ధోరణులను ముమ్మరం చేస్తాయి. సాంధ్ ఎదుర్కొన్న వివక్షలు, అవరోధాలు తీవ్రమైనవి. అయితే ఆయన ఎన్నడూ ‘చంపివేస్తామనే’ బెదిరింపులకు గురికాలేదు. తుపాకీ హింసాకాండకు బాధితుడు కాలేదు. ఇప్పుడు అమెరికన్ పౌరులు మొత్తం 500 మిలియన్ (50 కోట్లు) మారణాయుధాలకు యజమానులుగా ఉన్నారు. ఇదే 1950ల్లో ఈ ప్రైవేట్ ఆయుధాల సంఖ్య కేవలం 54 మిలియన్ (5 కోట్ల 40 లక్షలు) మాత్రమేనని ఒక అంచనా. సాంధ్ కాలంలో బ్రౌన్ మైనారిటీ (శ్వేతజాతీయేతరులు కాని అమెరికా పౌరులు. ఆఫ్రికన్–అమెరికన్లను ఈ మైనారిటీ వర్గంలోని వారుగా పరిగణించరు. దక్షిణాసియా, పశ్చిమాసియా, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాల నుంచి వలస వెళ్లిన వారిని మాత్రమే బ్రౌన్ మైనారిటీగా పరిగణిస్తారు) ప్రజలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. శ్వేతజాతీయులు అభద్రతా భావానికి లోనుకావలసిన పరిస్థితులు ఏ మాత్రం లేవు. అయితే ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి. వలసదారులకు కాకుండా స్థానిక ప్రజలకే అగ్రప్రాధాన్యమివ్వాలనే ధోరణులు, ప్రబలుతోన్న నిరంకుశాధికారతత్వం, రాజకీయ వదరుబోతుతనం దశాబ్దాలుగా ఉన్న పరిస్థితులను పూర్తిగా తలకిందులు చేశాయి.


ఇదొక నిరాశామయ కాలం. ‘అమెరికన్ స్వప్నం’ (స్వయం కృషితో మెరుగైన, సమున్నత, సంపూర్ణ జీవితాన్ని సాధించుకోవచ్చనే దృఢవిశ్వాసం, ఇందుకు అవకాశాలు లభిస్తాయనే నమ్మకం) ‘అమెరికన్ దుస్స్వప్నం’ (అమెరికా సమాజంలో అందరికీ సమ అవకాశాలు లభిస్తాయనే విషయమై భ్రమలు తొలగిపోవడం, వ్యక్తిగత శ్రేయస్సును అసాధ్యం చేస్తున్న సామాజిక సమస్యలు ప్రబలిపోవడం)గా మారిపోతోందని పలువురు అంటున్నారు. అయితే మమ్దానీ వెనకడుగు వేయలేదు. తన వైయక్తిక విశ్వాసాలకు ఆయన కట్టుబడి ఉన్నారు. ‘ట్రంప్ ప్రకటనలు మన ప్రజాస్వామ్యంపై దాడులు మాత్రమే కాదు, మీ అభిప్రాయాలు ఏమైనప్పటికీ వాటిని గోప్యంగా ఉంచుకోవాలని, వాటిని బహిరంగంగా వ్యక్తం చేస్తే ‘వారు’ మీ వద్దకు వస్తారనే సందేశాన్ని ప్రతి న్యూయార్క్ ఓటరుకు పంపే ప్రయత్నమని’ మమ్దానీ అన్నారు. ట్రంప్ మాటల దాడికి దీటుగా ప్రతిస్పందిస్తూ ‘ఇటువంటి బెదిరింపులను మనం ఎట్టి పరిస్థితులలోను అంగీకరించకూడదు. వాటికి భయపడకూడదు’ అని మమ్దానీ దృఢంగా అన్నారు.

■ మురళి కమ్మ
అట్లాంటాలోని ‘ఖబర్’ మాసపత్రిక ఎడిటర్
(క్వింట్ సౌజన్యం)

# పల్లె భారతిలో నాబార్డ్ ప్రగతి సేద్యం

**హ**రిత విప్లవానంతరం భారత వ్యవసాయ రంగం ఆధునికీకరణ దిశగా ముందడుగు వేస్తున్న సమయంలో, వ్యవసాయానికి అవసరమైన రుణాల కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవారు. అప్పట్లో దేశంలోని బ్యాంకులన్నీ ప్రైవేటు రంగంలో ఉండటంతో, వ్యవసాయ రంగానికి రుణాల వాటా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక శాతం కంటే కూడా తక్కువగా ఉండేది. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ, వ్యవసాయ–గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్న దృక్పథంతో 1969లో 14 పెద్ద బ్యాంకులను, 1980లో మరో ఆరు బ్యాంకులను జాతీయం చేశారు. బ్యాంకుల జాతీయీకరణ తరువాత, వ్యవసాయ–గ్రామీణ రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తిస్తూ, మొత్తం బ్యాంక్ రుణాల్లో కనీసం 40 శాతం ఈ రంగాలకు కేటాయించాలన్న నిబంధనను అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. అంతేకాకుండా, గ్రామీణాభివృద్ధికి మరింత బలమిచ్చే ఉద్దేశంతో 1975లో గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను ప్రారంభించింది.

భారతదేశంలో వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి రంగాలకు బ్యాంకుల జాతీయీకరణ అనంతరం పెట్టుబడుల కోసం రుణాలు గణనీయంగా పెరిగినా, ఆ రంగాల కోసం ప్రత్యేకంగా సమన్వయం, నియంత్రణ చేపట్టే జాతీయస్థాయి శిఖరాగ్ర బ్యాంకు లేదు. అప్పటి వరకు ఆర్బీఐలోని ప్రత్యేక విభాగం వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన రుణాలు, పెట్టుబడులను సమన్వయం చేస్తున్నది. ఈ లోపాన్ని గుర్తించిన ఇందిరాగాంధీ 1982 జూలై 12న రూ. 100 కోట్ల మూలధనంతో జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (NABARD)ను ముంబయి కేంద్రంగా స్థాపించి, జూలై 15న జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి నాబార్డ్ ప్రస్థానం నానాటికీ విస్తరించి, నేడు 43 సంవత్సరాల ప్రయాణంలో ఒక మహావృక్షంగా రూపాంతరం చెందింది. 2023–24 నాటికి నాబార్డ్ వివిధ రూపాల్లో వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తొమ్మిది లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు, రుణాలు అందించింది. దేశవ్యాప్తంగా విస్తృతంగా సేవలందిస్తోంది.




> భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో నాబార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి నిధుల సమకూర్పు, మౌలిక వసతుల నిర్మాణం, సహకార సంస్థల పునరుద్ధరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో నాబార్డ్ పాత్ర ఎంతో అమోఘమైనది.

సహకార సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అసాధారణమైనది. ఈ బ్యాంకు దేశవ్యాప్తంగా సహకార బ్యాంకులకు అవసరమైన రీఫైనాన్స్ నిధులను అందించింది. తద్వారా సహకార బ్యాంకులు ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు... గ్రామీణ రుణాల పంపిణీకి ప్రధాన కేంద్రాలుగా మారాయి. నాబార్డ్ సమర్థమైన పర్యవేక్షణ, ఆర్థిక మద్దతుతో ఈ సహకార సంఘాలు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు, వితరణ సేవలు, నిల్వ సదుపాయాలు, సబ్సిడీ విధానాలను అమలు చేశాయి. అంతేకాక, స్వయం సహాయక సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అపూర్వం. 1992లో ప్రారంభించిన స్వయం సహాయక సంఘాలను బ్యాంకులకు అనుసంధానించడం ద్వారా గ్రామీణ మహిళలు సమూహాలుగా ఏర్పడి, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం సుగమమైంది. నాబార్డ్ శిక్షణ, నిధుల మంజూరు, పర్యవేక్షణతో స్వయం సహాయక సంఘాలు స్థిరమైన ఆర్థిక సంఘాలుగా మారాయి.

గ్రామీణ బ్యాంకింగ్‌ను ఆధునికీకరించడంలో నాబార్డ్ కీలకపాత్ర పోషించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 63వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను డిజిటలైజ్ చేయడం ద్వారా, రుణాల మంజూరు, నిల్వ నిర్వహణ, పంట నష్టపరిహారాల లింకేజీ వంటి సేవలన్నీ పారదర్శకంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థలు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాయి. నాబార్డ్ దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ఏర్పాటుకు నిధులు, శిక్షణ, మార్కెట్ లింకేజీలతో సహకారం అందిస్తోంది. మధ్యవర్తులపై ఆధారాన్ని తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నాబార్డ్ ఈ రంగంలో మార్గనిర్దేశక పాత్ర పోషిస్తోంది.

1995లో ప్రారంభించిన రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్‌ఐడిఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో నాబార్డ్ రుణాలు అందించింది. ఈ నిధులతో గ్రామీణ రహదారులు, చెక్‌డ్యామ్‌లు, మార్కెట్ యార్డులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, శీతల గిడ్డంగులు వంటి మౌలిక వసతుల నిర్మాణం వీలైంది. నీటిపారుదల రంగంలో నాబార్డ్ అందించిన రీఫైనాన్స్ వల్ల చిన్న, మధ్యస్థ సాగునీటి ప్రాజెక్టులు అమలులోకి వచ్చాయి. ఇది సాగు విస్తీర్ణం పెరుగుదలకు దోహదం చేసింది. ప్రాంతీయ వ్యవసాయ వ్యాపార ఇన్క్యుబేటర్ కేంద్రాల ద్వారా యువతకు నాబార్డ్ కొత్త అవకాశాలను అందిస్తోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మద్దతుతో ఏర్పడిన ఈ కేంద్రాలు... యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం, మార్కెట్ లింకేజీ వంటి అంశాల్లో సహాయపడుతూ, స్వయం ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తున్నాయి.

ఇలా భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో నాబార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి నిధుల సమకూర్పు, మౌలిక వసతుల నిర్మాణం, సహకార సంస్థల పునరుద్ధరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో నాబార్డ్ పాత్ర ఎంతో అమోఘమైనది. గ్రామీణ బ్యాంకింగ్‌ను డిజిటలైజ్ చేస్తూ, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, వ్యవసాయ స్టార్టప్‌లకు తోడ్పాటుతో నాబార్డ్ గ్రామీణ భారత ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోంది.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
ఉపకులపతి, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

## ‘ఉప్పు’ భూముల లీజులను పునరుద్ధరించాలి

**శ్రీ**కాకుళం జిల్లాలోని నౌపాడ ప్రాంతం ఉప్పు సాగుకు ప్రసిద్ధి. దశాబ్దాలుగా ఉప్పు ఉత్పత్తికి పేరుగాంచింది. స్థానిక ఉప్పు పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది రైతులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఏడేళ్లుగా నౌపాడ ఉప్పు పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పనిపై ఆధారపడ్డ కుటుంబాల జీవితం ప్రశ్నార్థకంగా మారింది.

2018లో నౌపాడలోని సుమారు 2,650 ఎకరాల ఉప్పు భూముల లీజు గడువు ముగిసింది. కేంద్ర ప్రభుత్వం ఈ లీజులను పునరుద్ధరించలేదు. ఫలితంగా ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ సహకారం కరువవ్వడంతో ఉప్పును ఉత్పత్తి చేయలేకపోతున్నామని చెబుతున్నారు. దీంతో వీరికి ఆర్థిక సమస్యలు తప్పడం లేదు. గతంలో నౌపాడ ప్రాంతంలో ప్రతి ఏడాది సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అయ్యేది. కానీ ప్రస్తుతం అది 10 వేల నుంచి 15 వేల టన్నులకే పరిమితమైంది. జీవనాధారం కరువవుతుండడంతో 4 వేల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

గోరు చుట్టుపై రోకటి పోటులా ఉప్పు భూములపై ఇప్పుడు మరో తీవ్రమైన సమస్య వచ్చిపడింది. ఆ ప్రదేశంలో కొన్ని ప్రభుత్వానికి చెందిన భూములు కాగా, మరికొన్ని స్థానికులకు చెందిన భూములు. కొందరు అక్రమార్కులు ఈ భూములపై కన్నేశారు. ఇక్కడి నుంచి మట్టిని తవ్వి, రోజూ వందల ట్రాక్టర్ల ద్వారా ప్రైవేట్ లే–అవుట్లు, గృహ నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. దీనివల్ల ఉప్పు భూములు పాడవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఈ భూముల్లో ఉప్పు సాగు చేయడం అసాధ్యం. ఈ విషయమై అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. పర్యావరణ పరిరక్షణ చట్టాలు, భూ సంరక్షణ నిబంధనలన్నింటినీ అక్రమార్కులు ఉల్లంఘిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.


ఈ నేపథ్యంలో నౌపాడ ప్రజలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచుతున్నారు. మొదటిది– ఉప్పు భూముల లీజులను పునరుద్ధరించాలి. తద్వారా ఉప్పు ఉత్పత్తిని తిరిగి ప్రారంభించవచ్చు. రెండోది– ఆయా భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. బాధ్యులపై కేసులు నమోదు చేయాలి. మూడోది– ఉప్పు పరిశ్రమ భూముల లీజులను పునరుద్ధరించలేని పక్షంలో.. ఆ పరిశ్రమపై ఆధారపడ్డ కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించాలి. వారికి ఉద్యోగాలు, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాల వంటివి అమలు చేయాలి. ఇది కేవలం ఒక ప్రాంతీయ సమస్య కాదు. వందలాది కుటుంబాల జీవన సమస్య. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలకు స్పందించడమే ప్రభుత్వాల కర్తవ్యం.

– అప్పన్న గొనప

## పెన్షనర్లకు న్యాయం చేయాలి

**ఇ**టీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన పెన్షనర్లు–వర్గీకరణ చట్టం వల్ల పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. పెన్షనుదారులను విధులు ముగిసిన సంవత్సరం, పదవీ విరమణ తేదీ, లేదా నియమాల ఆధారంగా వేర్వేరు వర్గాల్లో ఉంచటం వల్ల ఒకే విధిగా సేవ చేసినవారు వేర్వేరు లాభాలు పొందే అవకాశం ఉంది. సీనియర్ పెన్షనర్లకు తక్కువ, జూనియర్ పెన్షనర్లు ఎక్కువ పెన్షన్ పొందే పరిస్థితులు ఏర్పడతాయి. సమాన విధులు నిర్వహించిన వారికి సమాన పెన్షన్ రావాలని సుప్రీంకోర్టు పలుమార్లు తీర్పులు ఇచ్చినా, ఈ చట్టం ఆ ఆదేశాలను బైపాస్ చేసేలా తయారైందని పెన్షన్‌దారులు అభిప్రాయపడుతున్నారు.

1979లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ పాలసీని అమలు చేసింది. దీని ప్రకారం, 1979 మే 31 తర్వాత పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కొత్త పెన్షన్ లబ్ధిని వర్తింపజేస్తామని తెలిపింది. అంతకుముందు పదవీ విరమణ పొందిన వారికి ఈ పెన్షన్ సౌకర్యాలు వర్తించవని నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ డి.ఎస్. నకారా అనే పెన్షన్‌దారు, మరికొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో “పెన్షన్ అనేది సౌకర్యం కాదు, అది ఒక హక్కు. ఉద్యోగ సమయంలో చెల్లించిన సేవలకు ప్రతిఫలంగా ఇచ్చే సామాజిక భద్రత, విభజన అసమంజసం... పెన్షన్ విధానంలో మార్పులు, పెంపులు అన్నీ అంతకుముందు పదవీ విరమణ పొందినవారికీ వర్తించాలి.” అని సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది.




పెన్షనుదారుల హక్కులకు, భద్రతకు ముప్పు తలపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ‘పెన్షనర్ల వర్గీకరణ చట్టం’పై రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్‌దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అమలుతో వేతన సవరణ, అరియర్స్, కరువుభత్యాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో పెన్షన్‌దారులకు అన్యాయాలు జరుగుతున్నాయని పెన్షన్‌దారుల సంఘం పేర్కొంది. పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపుతో, ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారుల సంఘం ప్రధానమంత్రికి ఒక వినతిపత్రాన్ని పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో పెన్షన్‌దారుల సంక్షేమానికి అనేక చొరవలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో స్పందించి కేంద్రం దిశానిర్దేశం చేసిన చట్టాల వల్ల రాష్ట్ర పెన్షన్‌దారులకు తలెత్తిన సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని పెన్షన్‌దారులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి చేసిన విజ్ఞప్తి లేఖలో పెన్షనర్లకు 12వ పీఆర్‌సీ అమలు, 35 శాతం మధ్యంతర భృతి, తగ్గించిన అదనపు క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ, కమ్యుటేషన్ కాల పరిమితి 15 నుంచి 11 సంవత్సరాలకు తగ్గించడం వంటివి ఉన్నాయి. అలాగే ప్రభుత్వ ఉత్తర్వులు నెం.315లో మార్పులు చేసి కుటుంబ పించను అమలులో న్యాయం చేయడం, యూజీసీ స్కేల్స్‌లో సేవ చేసిన వారికి హక్కుల అమలు, 10వ పీఆర్‌సీ నిర్ణయించిన మేరకు అంత్యక్రియ ఖర్చులు కొనసాగించడం, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించడం, వేతన సవరణ బకాయిలు, కరువు ఉపశమనం బకాయిలు విడుదల చేయడం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పూర్తిగా చెల్లించడం వంటివి ఉన్నాయి. పెన్షన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆరోగ్య బీమా కార్డులు అందరికీ పరిమితుల్లేకుండా జారీ చేయాలని కూడా కోరారు.

దేశ నిర్మాణానికి ప్రధాన శక్తిగా పని చేసిన పెన్షన్‌దారుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి, వారికి సరైన న్యాయం చేయాలి.

○ టి.ఎం.బి. బుచ్చిరాజు
ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారుల సంఘం

## ఆర్థిక నేరస్థులకు శిక్ష ఎప్పుడు?

**జనం** సొమ్ముతో అవినీతి సామ్రాజ్యాలు నిర్మించుకున్న ఆర్థిక నేరస్థుల కేసులకు ఏళ్ళు గడుస్తున్నా అతీగతీ ఉండటం లేదు. నేర తీవ్రత కళ్ళకు కడుతున్నా ఆర్థిక నేరస్థుల కేసులపై విచారణ పూర్తికావడానికి, తీర్పు రావడానికి ఏళ్ళకు ఏళ్ళు పట్టడం ఏమిటి? చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పుకోవడానికే తప్ప ఆచరణలో అది ఎక్కడ అమలవుతున్నది? న్యాయస్థానాల ఆదేశాల మేరకు విచారణ జరుగుతున్న కేసుల్లో కూడా సత్వరం దోషులకు శిక్షలు పడతాయనుకొనే వీలులేకుండా పోయింది. నిందితులు ఒకరి తరువాత ఒకరు డిశ్చార్జి పిటిషన్లు వేసి విచారణను అడ్డుకొంటున్నారు. ఆర్థిక నేరస్థుల కేసుల విచారణను జాప్యం చెయ్యడానికి నిందితులు చేసే ప్రయత్నాలను దర్యాప్తు సంస్థలు అడ్డుకోవడం లేదు. సీబీఐ, ఈడీ వంటి సంస్థలు రాజకీయ ఒత్తిళ్లకు లోనవడం వల్ల కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి విచారణ కొనసాగుతున్నాయి. రాజకీయ లబ్ధి కోసం కేసులను వాడుకోవడంతో రాష్ట్రాల్లో భారీ స్కామ్‌లు జరిగినా విచారణ వేగంగా జరగడం లేదు. భయంకరమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు కూడా బెయిల్‌పై ఉండి, వాయిదాలకు వెళ్లకుండా తిరగడంతో న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం కోల్పోతున్నారు.




ఆనాడు అధికారమే పెట్టుబడిగా క్విడ్ ప్రొ కో పద్ధతిలో రూ.43వేల కోట్ల అవినీతికి పాల్పడ్డాడంటూ జగన్‌రెడ్డిపై సీబీఐ 11, ఈడీ 9 అభియోగ పత్రాలు దాఖలు చేశాయి. జగన్‌రెడ్డి అవినీతి కేసుల విచారణ పన్నెండేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందం కావడానికి కారణం ఏమిటని సుప్రీంకోర్టు అనేకసార్లు సీబీఐని నిలదీసింది. “ఆవేశం అదుపు తప్పినప్పుడు ఒక హత్య జరగవచ్చు. కానీ, ఆర్థిక నేరం అటువంటి కాదు. నీతి తప్పినవారు కొందరు కలిసి కుట్ర పన్ని స్వార్థంతో పనిగట్టుకుని చేసేది ఆర్థిక నేరం. ఖజానాకు తీవ్రమైన నష్టం కలిగించే ఇలాంటి నేరాలను ఉపేక్షించరాదని, దేశ ఆర్థిక ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించాలి” అని 2013లో జగన్‌రెడ్డి కేసులో సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆర్థిక నేరగాళ్లను శిక్షించకపోతే మొత్తం సమాజమే అన్యాయమైపోతుందని కూడా మరో కేసులో సుప్రీం స్పష్టం చేసింది. కుట్రలు, కుతంత్రాలతో జరిగిన ఆర్థిక నేరాలను తీవ్రంగా పరిగణించాలని సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటిస్తూనే ఉంది. రూ. 43వేల కోట్ల అక్రమాస్తులను వెనకేసుకున్నారనే నేరాభియోగాలను నెత్తిన పెట్టుకుని నిర్లజ్జగా తిరుగుతున్న జగన్‌రెడ్డి దాదాపు 12 ఏళ్ల నుంచి బెయిల్‌పై ఉన్నారు. ఆయనను అధికారంలోంచి ప్రజలు కిందికి దించినా పోలీసులనే బెదిరిస్తున్నారు. ఆర్థిక నేరగాళ్లను సకాలంలో శిక్షించకుండా ఉపేక్షిస్తే సమాజానికి జరిగే నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదు.

ఒక్కో కేసులో ఏడేళ్ల నుంచి యావజ్జీవం దాకా శిక్షపడే తీవ్ర ఆర్థిక నేరాల్లో మొదటి ముద్దాయి అయిన జగన్‌రెడ్డి వాయిదాలకు వెళ్లకుండా కోర్టులకు మొహం చాటేస్తున్నారు. ఎనిమిది ఏళ్లుగా ఆయన మినహాయింపు ఎలా పొందగలుగుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు చెందాల్సిన జాతి సంపదను దోచుకుతిన్న ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టి దండించడంలో దర్యాప్తు సంస్థలు కూడా మీన వేషాలు లెక్కిస్తున్నాయి.

– నీరుకొండ ప్రసాద్

# ఇచ్చే తీరిక లేక!

- జూన్‌లోనే ఇస్తామని ప్రకటన..
- నిధుల విడుదల
- పలుమార్లు వాయిదా పడిన పంపిణీ
- ఆవేదనలో లబ్ధిదారులు

## వెనక్కి వెళ్లిన స్పౌజ్ పింఛన్ల నగదు



**చేతికందిన ఫలం నోటి దాకా రావడం లేదన్న చందంగా మారింది భాగస్వామ్య పింఛనుదారుల(స్పౌజ్) పరిస్థితి. స్పౌజ్ పింఛన్లకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భాగస్వామి దూరమైనా.. ప్రభుత్వం నుంచి ఒక భరోసా ఉందని పండుటాకులకు ధీమా లభించింది. అయితే ఆచరణ లో లబ్ధిదారులకు ఇంకా ఊరట దక్కలేదు. పింఛను మంజూరై రెండు నెల లు పూర్తయినా ఇప్పటి వరకు వారికి నగదు జమ కాలేదు. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోతూనే ఉన్నాయి.**

గుంటూరు, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): స్పౌజ్ కోటాలో ఎంపికైనవారికి తొలుత జూన్ 1న పింఛ ను అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటైన జూన్ 12వ తేదీకి పంపిణీని వాయిదా వేసింది. అందుకోసం రూ.3.32 కోట్లు అధికారుల ఖాతాల్లోకి జమయ్యా యి. అయితే అదే రోజున ప్రభుత్వం సుపరి పాల నలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పింఛన్ల పంపిణీ మరోమారు నిరవ ధికంగా వాయిదా పడింది. ఎప్పుడు పంపిణీ చేస్తారనే విషయం చెప్పకుండానే వాయిదా వేయడంతో సందిగ్ధం నెలకొంది. అలా జూన్ నెల మొత్తం గడిచిపోవడంతో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులను తిరిగి జమ చేయాలని ఆదేశించారు. దీంతో నిధులన్నీ తిరుగు టపాలో వెనక్కి వెళ్లిపో యాయి. దీంతో జూలైలోనైనా పిం ఛన్లు అందుతాయనుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. ఈ నెలలో ఇప్పటి 14 రోజు లు గడిచిపోయినా.. పింఛన్ల పంపిణీ మాత్రం జరగలేదు. దీంతో మళ్లీ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు నగదు తిరిగి వెనక్కి పంపాలని ఆదేశా లు వచ్చాయి. ఫలితంగా ఈ నెల పింఛ ను నగదు తిరిగి వెనక్కి వెళ్లిపోతోంది. అ యితే ఇలా వెనక్కి వెళ్లిన పింఛను మొత్తాన్ని తిరిగి ఒకేసారి అందజే స్తారా? లేక పథకం అమ లులోకి రాలేదు కాబట్టి ఈ రెండు నెలలది మిన హాయించి ఒక నెల పింఛనుతోనే సరిపెడతారా? అన్న ఆందోళన లబ్ధిదారులను వెంటాడుతోంది.

### కారణాలేంటి..?

పింఛను పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, భాగస్వామ్య పార్టీలు అట్టహాసం గా నిర్వహించాలని భావించాయి. అయితే వి విధ కారణాలతో కూటమి పార్టీల ప్రజా ప్రతి నిధులకు అందుకు అవకాశం లభించ లేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అందరూ సుపరిపా లన కార్యక్ర మంలో తీరిక లేకుండా ఉండడంతో ఈ కార్య క్రమం మరుగున పడి పోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ జాప్యం కారణంగా లబ్ధిదారు లకు మాత్రం తీవ్ర నష్టం వాటి ల్లింది.

**మూడు జిల్లాల్లో 8,304 మందికి..**


కూటమి ప్రభుత్వం 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ మధ్య కాలంలో పింఛన్‌దారులు మృతి చెందితే వారి జీవిత భాగస్వాములు పింఛను పొందే అవకాశాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్పించింది. మే నెలాఖరుకల్లా అర్హులను ఎంపిక చేసి వారికి జూన్ నెల నుంచి పింఛను అందజేస్తామని ప్రకటించింది. దీంతో భాగస్వామి కోటాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 8,304 మందికి పింఛను పొందే అవకాశం లభించింది. గుంటూరు జిల్లా నుంచి 2,565, బాపట్ల నుంచి 2,715, ప ల్నాడు నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు.

# గొంతెండుతున్న.. గుంటూరు!

- నగరంలో తాగునీటి ఎద్దడి
- నెహ్రూనగర్, హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్లకు అందని నీరు
- ఉండవల్లి, మంగళగిరి హెడ్ వాటర్ వర్క్స్‌లో నిలిచిన పంపింగ్
- కార్మికుల సమ్మె, విద్యుత్ అంతరాయాలతో సమస్య
- శివారు, విలీన గ్రామాల్లో సమస్య జఠిలం



రా వాటర్ పంపింగ్ లేకపోవడంతో బయటపడ్డ పైపులు



మంగళగిరి సమీపంలోని ఇంటేక్ వెల్స్‌లో అడుగంటిన నీరు

గుంటూరు కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో తాగునీటి ఎద్దడి నెల కొంది. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. గుంటూరు నగ రంలో రెండు రోజులుగా తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారు. వాటర్ వర్క్స్‌లో పనిచేసే కార్మికులు సమ్మెకు దిగడంతో నీటి సరఫరాలో అంత రాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం తోడవడంతో తాగునీటి సమస్య మరింత జఠిలంగా మారింది. ఉండ వల్లి ప్రధాన పంపిణీ కేంద్రం నుంచి మంగళగిరి పంపింగ్ కేంద్రం వరకు.. అక్కడ నుంచి తక్కెళ్ల పాడు హెడ్ వాటర్ వర్క్స్ వరకు తాగు నీరు సర ఫరా కావడం లేదు. షోకాజ్ నోటీస్‌లు ఇచ్చినప్ప టికీ తమ డిమాండ్ల సాధనకు తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క సోమవారం భారీగా విద్యుత్ కోతలు విధించడంతో తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నెహ్రూ నగర్, హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వా యర్‌కు ఒక చుక్క నీరు అందలేదు.

### వాటర్ వర్క్స్‌లో నిలిచిన పంపింగ్

ఉండవల్లి, మంగళగిరి, తక్కె ళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో వాటర్ పంపింగ్ నిలిపివేశారు. నైపుణ్యం కలిగిన కార్మికులు సమ్మెకు దిగ డంతో కొత్త సిబ్బందిని నియమించిన ప్పటికీ పంపిణీ జర గడం లేదు. గుంటూరు నగరంలోని అరండల్ పేట, బ్రాడీపేట, శ్రీనగర్, కొరిటిపాడు, లక్ష్మీపురం, గార్డెన్స్, గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్ కాలనీ, హనుమయ్య నగర్, నగ రాలు, గోరంట్ల ఇలా అనేక ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కాలేదు. దీంతో ప్రజలు బోర్లు, బావుల వద్దకు నీటి కోసం పరుగులు తీస్తున్నారు.

**నేడు కూడా తాగునీటి సమస్య**

నగరంలో మంగళవారం కూడా తాగునీటి సమస్య ఏర్పడనుంది. సమ్మె చేస్తున్న యూనియన్ కార్మికు లంతా వాటర్ పంపింగ్ కేంద్రాల్లో పని చేస్తున్నారు. వారంతా సమ్మెకు దిగ డంతో మోటారు సక్రమంగా ఆడించే వారు లేరు.







రిజర్వాయర్ల దగ్గర నీళ్లు పట్టుకెళ్తున్న నగరవాసులు

# అమరావతి ప్రజలకు.. ప్రత్యామ్నాయ జీవనోపాధి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో మంత్రి కొండపల్లి భేటీ



పెమ్మసానితో చర్చిస్తున్న మంత్రి కొండపల్లి తదితరులు

అమరావతి, జూలై 14(ఆంధ్ర జ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు స్థిరమైన ప్రత్యా మ్నాయ జీవనోపాధి కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖ ర్‌ను కోరారు. అందుకోసం మైక్రో ఎంటర్ ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని కొండపల్లి విజ్ఞప్తి చేశారు. దానిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రి కొండ పల్లి, సెర్ప్ అధికారులతో కలసి కేంద్ర మంత్రితో సమావేశం అయ్యారు. అమరాతి రాజధాని ప్రాంతంలోని 22 గ్రామాలకు చెందిన 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద స్వచ్ఛందంగా సీఆర్‌డీఏకు ఇచ్చిన విష యాన్ని కొండపల్లి పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీల జీవ నో పా ది తీవ్రంగా ప్రభావిత మైందని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను వెతుక్కో వాల్సిన పరిస్థితుల్లో పడ్డారని ఆయన అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి నైపుణ్య శిక్షణ, ఫార్వార్డ్ - బ్యాక్‌వార్డ్ లింకేజ్ కల్పించాలని మంత్రి కొండపల్లి కోరారు. జక్కంపూడి, మోతడక ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు రెండు ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, అద నపు సీఈఓ శ్రీరాములు నాయుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమాన్ని విస్మరిస్తే కఠిన చర్యలు

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డేపల్లి రామ్ చందర్, పాల్గొన్న భార్గవతేజ, సతీష్‌కుమార్, పులి శ్రీనివాసులు

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం షెడ్యూల్ కులాల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అధికారులు, ఉద్యోగులు కచ్చితంగా అమలు చేయాలని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో పలు శాఖల అధికారులతో కలసి జిల్లాలో షెడ్యూల్ కులాల అభ్యున్నతిపై జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ డైరెక్టర్ డాకర్ జి.సునీల్ కుమార్ బాబుతో కలసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వడ్డెపల్లి మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్ 338 ద్వారా జ్యూడిషియల్ అధికారాలతో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా వేగవంతంగా షెడ్యూల్ కులాల వారు ఇళ్లు నిర్మించుకోవడానికి బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ, బ్యాంకర్లు ప్రత్యేకంగా సమావేశమై తీసుకునే చర్యలపై కమిషన్‌కు నివేదిక అందించాలన్నారు. ఏఎన్‌యూ, ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీల్లో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీపై కమిషన్‌కు నివేదిక అందించాలని కోరారు. జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుదలపై విద్యాశాఖ అధికారులను ఆయన అభినందించారు. జేసీ భార్గవతేజ జిల్లాలో ఎస్సీలకు అందుతున్న సంక్షేమం, ఇతర కార్యక్రమాల అమలును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాధ్యమైనంత వరకు 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తొలుత వడ్డేపల్లి రామచందర్‌కు ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.




## ‘మనమిత్ర’తో.. అన్నదాత సుఖీభవ

- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- మన మిత్ర వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం

## అడ్డగోలు.. అనుసంధానం

- విద్యుత్ సర్వీసు ఒకరిది.. ఆధార్ మరొకరిది

8

## సీఆర్డీఏ ఆధీనంలోకి ఇసుక క్వారీలు..!

- రాజధాని అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు

## రిలీవింగ్ ఆర్డర్ కోసం ఏఎన్ఎం ఆందోళన

6

- రోడ్డుపై బైఠాయింపు

# ప్రభుత్వం కళ్లకు గంతలు..!

- నాడు-నేడు పనులపై అటకెక్కిన విచారణ
- గోప్యంగా.. సవ్యంగా ఉందని సోషల్ ఆడిట్ నివేదిక?
- శాసనసభలో విచారణ కోరిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల




నిడుబ్రోలు జడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణం

పొన్నూరుటౌన్, జులై14 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాం లో నాడు-నేడు పేరుతో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పను ల్లో భారీ అవకతవకలు జరిగాయ ని.. వాటిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ప్రభు త్వం ఇచ్చిన హామీ నీటిమూటగా మారింది. ప్రభు త్వం కళ్లకు గంతలు కట్టి.. విచారణ తూతూ మం త్రంగా నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో పనులు స క్రమంగా చేసినట్లు నివేదిక ఇచ్చారని విశ్వసనీయ సమాచారం. పొన్నూరు పురపాలక సంఘం, మండ లంలో 87 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. నాడు-నే డు ఫేజ్ 1 కింద 34 పాఠశాలలకు రూ.7.15కోట్లు మంజూరయ్యాయి. పనులకు సంబంధించి రూ.4.85 కోట్లు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖా తాలకు జమయ్యాయి. 2వ దశలో 36 పాఠశాలలకు రూ.6.19కోట్లు నిధులు ప్రభుత్వ పాఠశాలలకు జమ అయ్యాయి. అయితే మొదటిదశలో జరిగిన పనుల్లో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలువచ్చాయి. నాడు - నేడు పనులు వైసీపీ నాయకులు, ( పభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జేబులు నింపాయని శాసన సభలో స్థానిక ఎమ్మెల్యే ధూళి పాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణలు చేశారు. నిబం ధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేసుకున్నారని దీనిపై.. సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వా న్ని కోరారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై సమ గ్ర విచారణ జరపాలని విద్యాశాఖను ఆదేశించిం ది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నాడు-నేడు పనులన్నీ నిలిపివేసింది. విద్యాశాఖ సోషల్ ఆడిట్ విభాగం నాడు- నేడు పనుల ఆడిట్‌ను గుట్టుచ ప్పుడు కాకుండా పూర్తి చేసి.. పనులు సక్రమంగా జరిగినట్లు నివేదిక ఇచ్చిందని సమాచారం. పొ న్నూరు పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూ ల్‌లో పాత వాటికి రంగులు వేసి బిల్లులు చేసుకు న్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల పర్యటించి.. ప్రత్యక్షం గా విచారణ జరిపి నిర్ధారించారు. కానీ, ఈ పను లన్నీ సక్రమంగా జరిగినట్లు నివేదికలో పొందరుపరిచినట్లు తెలుస్తోంది. నాడు - నేడు ప నులను వైసీపీ ప్రభుత్వంలో తల్లిదండ్రుల కమిటీ, వైసీపీ కీలక నాయకుల అనుచరులు నామినేషన్ పద్ధతిలో చేసి నిధులను దోచుకున్నారు. విద్యాశా ఖతో కాకుండా విజిలెన్స్, సీఐడీతో ఈ పనులపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయ ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా నాసిరకంగా జరగటంతో.. పనులను ప్రభు త్వం నిలిపివేసింది.

# ఉద్యోగోన్నతులు ఎప్పుడో..!

- కూటమి ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల ఆశలు
- వైసీపీ ప్రభుత్వంలో ప్రమోషన్లకు దూరం




గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉ ద్యోగోన్నతుల కోసం ఎదు రు చూస్తు న్నారు. కూట మి ప్రభు త్వంలో ప్రమోషన్లపై కోటి ఆశలు పెట్టుకు న్నారు. ప్రస్తుతం ప్ర మో షన్ల ఫైలు సీఎం చంద్ర బాబు వద్ద పెండింగ్‌లో ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఆ ఫైల్‌కు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని గంపెడాశలతో ఉన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఉద్యోగోన్నతుల ఊసే ఎత్త లేదు. వందలాది మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ కూడా చేశారు. గత ప్రభుత్వం తమను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాతే అసలు కష్టాలు మొదలయ్యాయని ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉద్యోగి వైద్యం ఖర్చులు ఎంతైనా.. ఆర్టీసీనే భరించేది. పైగా రిఫ రల్ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందే సదుపాయమూ ఉండేది. జగన్ ప్రభుత్వ పుణ్యమా వీట న్నింటికీ ఉద్యోగులు దూరమయ్యారు. కొత్తగా నియామకాలు చేపట్టాలని, ఉద్యో గోన్నతులు కల్పించాని సీఎంగా ఉన్న జగన్‌కు పలుమార్లు ఉద్యోగ సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజే శారు. కానీ, అవన్నీ.. బుట్టదాఖలయ్యా యి. ఆర్టీసీలో డ్రైవర్‌గా, కండక్టర్‌గా నియమితులైన వారు ఉద్యోగ విర మణ చేసే వరకు అదే పోస్టులో ఉండాల్సిన పరిస్థితు లు నెలకొ న్నాయి. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన డ్రైవర్లు, కండక్టర్లు అనారోగ్య సమస్యలతో సతమతమ వుతున్నారు. కనీసం సీనియార్టీ ప్రకారం ఉద్యోగో న్నతులు ఇవ్వడం కూడా లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఆర్టీసీలో మహిళా ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. 1996, 97లో ఉద్యో గాల్లో చేరిన వారు ప్రమోషన్లు లేకుండానే త్వర లో పదవీ విరమణ చేయనున్నారు. 50 ఏళ్లు దాటిన మహిళ లకు అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నా యని, కనీసం సీనియార్టీ ప్రకా రం ఓడీ పేరుతోనైనా కార్యాలయాల్లో పనిచేసే విధులు కేటాయించాలని కోరుతున్నారు.

# ఓడీఓపీ.. గుంటూరు మిరపకు అవార్డు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి అందుకున్న కలెక్టర్




న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి ఓడీఓపీ అవార్డు అందుకొంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద గుంటూరు మిరపకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందడం చాలా గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని భారత మండపం(ప్రగతి భవన్)లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా గుంటూరు మిరపకు బంగారు కేటిగిరి అవార్డును కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అధికారులు చేసిన కృషికి తగిన ఫలితం లభించిందన్నారు. మున్ముందు ఇలాంటి జాతీయ స్థాయి అవార్డుల కోసం అన్ని శాఖలు ప్రయత్నించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు.

# పరామర్శల పేరుతో బెదిరింపు రాజకీయాలు

● ప్రజలపై దండయాత్ర చేస్తున్న జగన్ ● ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, నరేంద్ర

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు పరామర్శల పేరుతో అరాచకాలు సృష్టిస్తూ, మరికొం త మందిని చంపుతూ ఇదేమిటని ప్రశ్నిస్తే రప్పా రప్పా నరుకుతా మంటూ మాట్లాడటం క్షమించరాని విషయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరామర్శల పేరుతో జగన్ రెడ్డి కొంతమంది అల్లరి మూకను పోగుచేసి పరామర్శల అర్థాన్నే మార్చేశారన్నారు. కేవ లం తమ పార్టీ ఉనికిని కాపాడుకోవటానికి ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నారని విమర్శించారు. జగన్‌కు, వైసీపీకి పెద్ద పాలేరుగా చెప్పుకునే పేర్ని నాని చీకట్లో ఎందుకు, పట్టపగలే రప్పా రప్పా అనే కార్యక్రమం చేపడతామని ప్రజల్లో భయాందోళనలు కలిగేలా దుర్మార్గంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభు త్వం రైతులను ఆదుకుంటుంది. వైసీపీ ఏం చేయాలో అర్థంకాక మామిడి పండ్ల రైతుల పరామర్శల యాత్ర పేరుతో రెచ్చగొట్టే కార్య క్రమాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయిన దగ్గర నుంచి పరామర్శల పేరుతో ప్రజలపై దండ యాత్రలు చేస్తున్నా రన్నారు. రైతులను పరామర్శల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు తమ రౌడీ మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అకాల వర్షాలు, వరదలు వస్తే రైతుల ముఖం చూడని జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోగానే రైతులపై కపట ప్రేమ కురిపిస్తున్నారన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీస్ కమిషనర్ దగ్గరకు వెళ్లి సోషల్ మీడియాలో వైసీపీ వారిపై కేసులు పెట్టాలని చెప్పడం చూస్తే సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. వైసీపీ క్యాంప్ కర్స్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన స్క్రిప్ట్ మాత్రమే రోజుకొకరు మీడియాలో మాట్లాడటం పరిపాటిగా మారిపోయిందన్నారు. సింగయ్య మృతి కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు చార్జీ షీట్లో నెంబర్ వన్ పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రిలీవింగ్ ఆర్డర్ కోసం ఏఎన్ఎం ఆందోళన

రోడ్డుపై బైఠాయింపు


ఏఎన్ఎం స్లీవ రాణితో వాదులాడుతున్న ఎంపీడీవో శివపార్వతి

ప్రత్తిపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎవరో ఒకరు విధుల్లోకి వచ్చే వరకు .. రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వలేని లేదంటూ వంగిపురం సెక్రటరీ, ఎంపీడీవో చెప్పడంతో ఏఎన్ఎం సచివాలయం ఎదుట ఆందోళనకు దిగింది. ఏఎన్ఎం శౌరి స్లీవ రాణి సాధారణ బదిలీల్లో భాగంగా కాట్రపాడు పీహెచ్‌సీకి బదిలీ అయింది. అయితే సోమవారం ఉదయాన్నే గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి చేత రిలీవింగ్ ఆర్డర్‌పై సంతకం చేయించుకుని సెక్రటరీ సంతకం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చింది. వంగిపురం ఇన్‌చార్జి సెక్రటరీ శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వడానికి నిరాకరించారు. ఆమె స్థానంలో ఎవరో ఒకరు వస్తే తప్ప ఇవ్వమంటూ తేల్చి చెప్పారు. ఈ విషయంపై గొట్టిపాడు పీహెచ్‌సీ డాక్టర్ మేరీ యానిస్ కూడా ఎంపీడీవోతో ఫోన్‌లో మాట్లాడారు. అయినప్పటికీ సానుకూల స్పందన లభించకపోవడంతో.. ఏఎన్ఎం స్లీవ రాణి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గుంటూరు - పర్చూరు ప్రధాన రహదారి పక్కన బైఠాయించింది. సాయంత్రం 5.30 వరకు ఆమె అక్కడే కూర్చోవడంతో.. మీడియా అక్కడకు వచ్చింది. దీంతో సెక్రటరీ ఆమెకు రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చారు.

## ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

పెదకాకాని, జూలై 14(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పెదకాకాని పోలీసులు సోమవారం తెలి పారు. వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇంటూరి కిరణ్, సు నీల్ బాషాతో పాటు గుంటూ రు ఇజ్రాయెల్ పేటకు చెందిన సయ్యద్ బాషా అనే ముగ్గురు కొంతకాలంగా గం జాయి అమ్ముతున్నారు. గత రాత్రి ఆటోనగర్ వై జంక్షన్ వద్ద గంజాయి ప్యాకెట్లు కడు తున్న వీరిని అదుపులోకి తీ సుకున్నారు. వీరి నుంచి 1.30 గ్రాముల గంజాయిని స్వాధీన చేసుకున్నారు. ముగ్గురినీ కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

## క్వారీ ఆలయ చైర్మన్‌గా శ్రీకాంత్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై14(ఆంధ్రజ్యోతి): క్వారీ బాల కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా గోళ్లమూడి శ్రీకాంత్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా అద్దంకి శ్రీనివాసరావు, కొసరాజు బసంత్ బాబు, దగ్గు వెంకటరమణ, బత్తుల రంగారావు, మోదుగల సుబ్బారెడ్డి, మట్టుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు వీరాస్వామి, మద్దినేని శ్రీనివాసరావు, లగడపాటి కిరణ్ కుమార్, వెలగా గోపీనాథ్, తాటి.శంకర్, జంపని రామారావు, మక్కే రామారావు, ఏమినేని శ్రీనివాసరావును నియమించారు.

# జన సైనికుల సహనాన్ని పరీక్షించవద్దు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె హెచ్చరిక



సమావేశంలో మాట్లడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని అహంకారంతో సీఎం, డిప్యూటీ సీఎంపై అవాకులు చెవాకులు పేలుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు అన్నారు. పేర్ని నానికి జనసేన తరపున ఇదే చివరి హెచ్చరికని, భవిష్యత్తులో మరోసారి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సోమవారం అమరావతి రోడ్డులోని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లా డారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, మరో పక్కన రాష్టాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తోందన్నారు. వైసీపీ నాయ కులు ఇది తట్టుకోలేక రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయ త్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గోడౌన్లో రేషన్ బియ్యం పట్టివేతకు సంబంధించి కేసులో పేర్ని నాని ఉన్నారని, తన ఇంట్లో వాళ్ళను కూడా ఆయన అవినీతిలో భాగస్వా మ్యం చేశారని గాదె ఎద్దేవా చేశారు. నాడు సీఎం చంద్రబాబు వారి ఇంట్లో వాళ్ల జోలికి వద్దని చెప్పడంతో ప్రెస్ మీట్ పెట్టి మరి ముఖ్యమంత్రిని పొగిడిన పేర్ని నాని.. ఇప్పుడు అదే ముఖ్యమంత్రిపై అసందర్భ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శిం చారు. ముఖ్యమంత్రి ముసలి వ్యక్తి అని, ఇంకెన్ని రోజులు ఉంటారని పిచ్చి వాగుడు వాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని రాష్టానికి ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ య ర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాథ్, కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు

# కుల బహిష్కరణ పేరుతో వసూళ్లు... వేధింపులు


ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తల్లి, కుమారులు

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నేటి నాగరిక సమాజంలో ఇప్పటికీ కుల బహిష్కరణల పేరుతో వేధింపులకు పాల్పడుతూ, లక్షల్లో వసూళ్లు చేసుకుంటున్నారని పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన ఎస్ ఆదెమ్మ ఇరువురు కుమారులతో సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఆరోపించారు. తాము 40 సంవత్సరాలుగా వెనిగండ్లలో నివాసం ఉంటున్నామన్నారు. అయితే తమ గూడెంలో రామకృష్ణ, రాంబాబు, సింహాచలం, వెంకయ్య, చింటూ అనే ఐదుగురు పెద్దమనుషులుగా చలామణి అవుతూ మిగిలిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మా కుటుంబ సభ్యులను ఐదేళ్ల క్రితం కులం నుంచి బహిష్కరించారని ఆవేదన వెలిబుచ్చారు. తిరిగి కులంలోకి తీసుకోవడానికి మూడు లక్షల రూపాయలు జరిమానా వసూలు చేశారన్నారు. వారి వేధింపులు కారణంగా పురుగుల మందు తాగి అనేకమంది ఆత్మహత్య కూడా చేసుకున్నారన్నారు. అలాంటి వారి పరిస్థితి చూసిన నా కుమారులు ఇంకా ఈ రోజుల్లో కూడా ఇటువంటి కట్టుబాట్లు ఏంటి, మనం ఏ రోజుల్లో ఉన్నాం అని ప్రశ్నించడంతో అప్పటి నుంచి తన కుమారులైన రమేష్, నాగరాజుపైనా ద్వేషం పెంచుకొని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 13న రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో వారందరూ మా కుటుంబ సభ్యుల మీద దాడి చేశారని చెప్పారు. ఇక్కడ మీకు ఇష్టం వచ్చినట్లు ఉంటే కుదరదని, మేము చెప్పినట్లు వినాల్సిందేనని హెచ్చరించి కులం నుంచి బహిష్కరిస్తున్నట్టు చెప్పారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అంతే కాకుండా లక్ష రూపాయలు జరిమానా కూడా విధించారని చెప్పారు. మహిళలని కూడా చూడకుండా తన పైనా, గర్భవతి అయిన తన కోడలు పైన దాడి చేశారన్నారు. కులంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ కుల బహిష్కరణ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వీరిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలన్నారు. తమపై దాడి చేసిన వారిపై పెదకాకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళగా, వీరంతా స్టేషన్‌కు సమీపంలో కాపు కాసి ఉన్నారన్నారు. దీంతో భయపడి తాము పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్ళలేకపోయామని, ప్రస్తుతం తమంతా పెదకాకాని తోటలో తలదాచుకుంటున్నామని వాపోయారు.

# లక్నోలో శిక్షణ తరగతులకు మక్కెన

● రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్‌లతో కలిసి పర్యటన

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లి కార్జునరావు


లక్నో పర్యటనలో ఆప్కో చైర్మన్ వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో పర్యటనకు వెళ్లారు. పరిపాలనా, నాయకత్వం, సహకార విభాగంలో అభివృద్ధి వంటి అంశాలపై మూ డు రోజుల పాటు జరుగనున్న శిక్షణ తరగతులకు ఆయన రాష్ట్రంలో డీసీసీబీ చైర్మన్లతో కలిసి హాజరయ్యారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాం జనేయులు, డీసీసీబీ చైర్మన్, ఇద్దరు సీనియర్ అధికారులు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు.

# 22 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా


జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గడచిన 22 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కారు. సో మవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 నెలల నుంచి జీతాలు ఇవ్వక పోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇచ్చేదే అతి తక్కువ జీతం అది కూడా అన్ని నెలలు పాటు నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు. జీతాలు రాక, అనారోగ్యంతో పిడమర్తి పవన్ కుమార్ మృతి చెందా రని ఆరోపించారు. అయినా కూడా జిల్లా పరిషత్ అధికారులకు తమ మీద కనికరం కలగడం లేదని ఆవేదన చెందారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు సంబంధించిన బడ్జెట్‌కు పాలక వర్గం ఎప్పుడో అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. అయినా జడ్పీ అధికా రులు లేని పోనీ కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా వచ్చిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు మందా ప్రేమానందం మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇన్ని రోజు లుగా జీతాలు చెల్లించక పోవడం అంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద శిక్షకు పాత్రులేనని స్పష్టం చేశారు. జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న సీఈఓ, డిప్యూటీ సీఈఓ మీద చర్యలు తీసుకో వాలని అధికారు లకు విజ్ఞప్తి చేశా రు. ఈ ధర్నాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొ న్నారు.

# ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వైసీపీ

● మంత్రి అనగాని సత్యప్రసాద్


మంచికలపూడిలో మహిళకు కరపత్రం పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

దుగ్గిరాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రప్పా.. రప్పా నరుకుతామని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైసీపీకి భవిష్యత్‌లో ఉనికి కూడా లేకుండా తుడిచిపెట్టుకుపోతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, వైసీపీ అరాచకాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని, మంత్రి నారా లోకేశ్ కృషితోనే పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో సూపర్‌సిక్స్ పథకాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి అనగానికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, తమ్మిశెట్టి జానకీదేవి, మరీదు రాము, ఏమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర సాగుతో పత్తిలో నష్ట నివారణ

ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎక్కు వగా సాగయ్యే పత్తి పంటలో నష్టాల నివారణకు అంతర పంటల సాగు చక్కని పరిష్కారం అని లాం ఫాం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు తెలిపారు. ప్రతికూల వాతావ రణ పరిస్థితులు పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీస్తాయని, తద్వారా రైతులు నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కోవాలంటే అంతర పంటల సాగు మాత్రమే మంచి పరిష్కారం అని పేర్కొన్నారు. పత్తిలో పప్పు జాతి పంటలను సాగు చేస్తే నేలలో సారం పెరిగి ప్రధాన పంట పెరుగుదలలో దోహ దపడుతుందని అన్నారు. ఈ అంతర పంటలు చీడపీడలను ఆకర్షించి ప్రధాన పంటకు నష్టం వాటిల్లకుండా కాపాడతాయని తెలిపారు. అం తర సాగుకు అనువైన పంటలను వివరించారు. కంది, సోయా బీన్, పెసర, మినుము పంటలను కూడా సాగు చేసుకోవచ్చునన్నారు. రైతు లు అనుమానాల నివృత్తి కోసం ఏరువాక కేంద్రంలో సంప్రదించవచ్చునని కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మీ సూచించారు.

## పూర్ణచందుకు 'సాహితీసింధు' పురస్కారం


సాహితీసింధు పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జీవీ పూర్ణచందు

నరసరావుపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలో 13వ తేదీ నుంచి 3 రోజులపాటు జరుగుతున్న విద్వత్ సభలలో సోమవారం 2వరోజు కార్యక్ర మంలో ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, భాషోద్యమ ప్రముఖులు డాక్టర్ జీవీ పూర్ణచందుని 'సాహితీసింధు' బిరుదుతో సత్కరించారు. 150 గ్రంథాలు రచించి తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పు రస్కారం అందిస్తున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. ప్రసిద్ధ పంచాంగ కర్తలు బుర్రా వెంకటేశ్వర శర్మ, బుట్టే వీరభద్ర దైవజ్ఞ, ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, చల్లా శ్రీనివాస శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి బహుమతి గ్రహీత డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు సభను నిర్వహించారు.

## ఘర్షణలో ఇద్దరికి కత్తిపోట్లు

వెదురు బొంగులు దగ్ధంపై వాగ్వాదం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో పంట పొలాల్లో వెదురు బొంగులు తగలబడిన ఘటనకు సంబంధించి చెలరేగిన వివాదంలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం వేజెండ్ల గ్రామంలో తూమాటి సుమన్ అనే వ్యక్తి పొలంలో వెదురుబొంగులు తగలబడ్డాయి. గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద గ్రామస్తులతో ఈ విషయం చర్చిస్తుం డగా.. అదే గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి.. బొంగులు తగలబడటానికి తానే కారణమని ఊర్లో ప్రచారం చేస్తున్నావంటూ సుమన్‌తో ఘర్షణకు దిగాడు. అంతేకా కుండా.. వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశారు. దుర్గా ప్రసాద్ దాడిలో సుమన్ మోచేతికి నడుము భాగానికి కత్తిపోట్లకు గురయ్యాడు. దీంతో సుమన్ బంధువైన తోమాటి పృథ్వీ సుమన్‌ను రక్షించే ప్రయత్నంలో కత్తిపోట్లుకు గురయ్యాడు. స్థానికులు కేకలు వేయగా దుర్గా ప్రసాద్ అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు ఆటోలో వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి క్షత గాత్రు లను తరలించారు. సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్సైడి వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 98, 107, 118 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 190.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 200.00 |

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ




ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

## నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి

● 13వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన - మన ఎమ్మెల్యే తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సంగడిగుంటలో పర్యటించారు. తాము ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించామని, అప్పుడు కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పుడు సంగడిగుంట ప్రాంతంలో ప్రతి రోడ్డునూ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కేవలం రోడ్లు మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ- 4 వంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. దీని ద్వారా బంగారు కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచబోతున్నామని చెప్పారు. అనంతరం స్థానిక ప్రజలతో ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ దేనన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీలా, చిన్న బుజ్జి, ఆంజనేయ ప్రసాద్, గోల్డ్ రఫీ, మంత్రి నాగరాజు, సోఫియా, బాజీ, రత్న కిరణ్, కిషోర్, వాకా వీరారెడ్డి, మీరా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్యంపై రాజీ లేదు

నగరంలో పారిశుధ్యం అత్యంత ప్రాధాన్యమని, ఈ విషయంలో ఎలాంటి రాజీలేదని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో పారిశుధ్య విధులకు ఆటంకం కల్పిస్తున్న అంశాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మైక్రో ప్యాకెట్స్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ప్రతి వార్డులోనూ శానిటేషన్ నిర్వహణకు ఒక ప్రత్యేక టీం ఉండాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ ఉండకూడదని స్పష్టం చేశారు.

## జీఎంసీలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు గుంటూరు కార్పొరేషన్‌లోకి నీరు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆదేశించారు. సోమవారం గుంటూరు కార్పొరేషన్ ఆవరణలోని పలు ప్రాంతాలను కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో వర్షం వస్తే నగరపాలక సంస్థ కార్యాలయం మునిగిపోవడం వంటి వీడియోలు, ఫొటోస్ వంటివి చూశామనీ అన్నారు. మున్సిపల్ కార్యాలయం మునగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించమన్నారు.


కార్పొరేషన్ ఆవరణ పరిశీలన చేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

## ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులు వారంలో పూర్తి చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగర పాలకసంస్థ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారం రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ ప్రకారం చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్‌స్టేడియంలో పనులను పరిశీలించి సంబంధిత అధి కారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వాకింగ్ ట్రాక్‌లోకి వాహనాలు రాకుండా మెయిన్ గేట్ల దగ్గర చిన్న గేట్లు ఏర్పాటు చేయాలని డీఈఈని ఆదేశించారు. స్టేడియంకు వాకర్స్ ఎక్కువ మంది వస్తుంటారని, పనులు జాప్యం వల్ల వారికి సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నందున పనులను వేగంగా చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ రమేష్‌బాబు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పేరేచర్ల క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ (జీఈసీఏ) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఎన్నికల ప్రక్రియకు అధికారిగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి వెంకటరత్నం వ్యవహరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఎన్నికల వివరాలను వెల్లడించారు. అసోసియేషన్ నిబంధనలు అనుసరించి ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్టు చెప్పారు. ఆఫీస్ బేరర్స్ పదవులకు నామినేషన్ పత్రాల ఉపసం హరణ గడువు ముగిసిన నాటికి పోటీలో ఉన్న అభ్యర్థుల అర్హత ప్రమాణాలను పరిశీలించామని తెలిపారు. అనంతరం అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవంగా ప్రకటించినట్టు పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్, ఉపాధ్యక్షుడుగా తోట వెంకట శివరామకృష్ణ, కార్యదర్శిగా యనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కొంగర రాహుల్ చౌదరి, కోశాదికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నంది రాజు శివరామకృష్ణలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అనంతరం చుక్కపల్లి రాకేష్, తోట వెంకట శివరామకృష్ణలు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కావాల్సిన అన్ని చర్యలను అసోసియేషన్ చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడా పాలసీపై క్రీడాకారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా సంఘాలు, క్రికెట్ అసోసియేషన్లు నూతన కమిటీని అభినందించారు.


నూతనంగా ఎన్నికైన జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

## జిల్లాలో ఎరువులకు కొదవ లేదు : ఏవో

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల సాగు విస్తీర్ణం తగ్గిందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పత్తి పంట 1632 హెక్టార్లు, వరి 6433 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారని తెలి పారు. యూరియా 15021 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4252 మెట్రిక్ టన్నులు, 13797 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 946 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నా మని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

# నిర్ణీత గడువులో అర్జీలను పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 302 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 302 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో షేక్ ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం భార్గవతేజ మాట్లాడుతూ అర్జీదారుడి దరఖాస్తును రిజిస్టర్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని, సమస్యలను పరిష్కరించి దానికి సం బంధించిన రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగ సాయికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డీటీసీ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

● తూర్పు నియోజకవర్గంలోని 53, 54, 55 వార్డుల్లో కమ్యూనిటీ భవనాలు, గ్రంథా లయాలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు అర్జీ అందజేశారు. ఆయా వార్డుల్లో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసిస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీహెచ్ వాసు, మణికుమారి, రవితేజ, సాధిక్ తదితరులు ఉన్నారు.

● 16 నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని జడ్పీలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు అర్జీ అందజేశారు. జడ్పీలో అటెండర్లు, స్వీపర్లు ఇతర విభాగాల్లో దాదాపు 25 మందికి పైగా పనిచేస్తున్నామని గత ఏడాది ప్రారంభం నుంచి జీతాలు నిలిపివేశారని వాపోయారు. జీతాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకాలు పెట్టకుండా జడ్పీలో పనిచేసే ఉన్నతాధికారులు వేధిస్తున్నారని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కృష్ణవేణి, రమణి, నందిని తదితరులున్నారు.

● డీఎస్సీకి అనర్హులు చాలా మంది దరఖాస్తు చేసుకుని పరీక్షలకు హాజరయ్యారని దీనిపై విచారణ జరిపించాలని ఏపీ వ్యాయమ పోరాట సమితి ఆధ్వర్యంలో అర్జీ అంద జేశారు. 4వ సెమిస్టర్ చదువుతున్న కొంత మంది అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో తప్పు డు సమాచారాన్ని పొందుపరిచారని తెలిపారు. ఈ సమాచారంతోనే పరీక్షకు హాజరయ్యా రని ఆరోపించారు. దీంతో అర్హులు ఎక్కువ మంది ప్రభుత్వ కొలువునకు దూరమవుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శివరామకృష్ణ, ఎం నర సింహారావు, మౌలాలి, అనిల్‌కుమార్, షఫీ, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● స్థానిక ఏటీ అగ్రహారం, ఇందిరా గాంధీ బొమ్మ, రెండో లైను వద్ద స్పీడ్ బ్రేకర్లును ఏర్పాటు చేయాలని స్థానికులు అర్జీ అందజేశారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా నడుపుతున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సీనియర్ సిటిజన్స్, మహిళలు, చిన్నారులు గాయపడ్డారని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లును అమర్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానికులు ప్రసా దు, జితేంద్ర, మోహన్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

● గుంటూరులో ఉన్న గిరిజన బాలుర వసతి గృహం-2ను మాచర్లకు మార్చేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కే పాండునాయక్ అర్జీ అందజేశారు. మాచర్ల పరిసర ప్రాంతాల్లో చాలా గిరిజన తండాలు ఉన్నాయని, విద్యార్థులు చదువుకునేందుకు మాచర్లకు వస్తున్నారని తెలిపారు. కాకపోతే అక్కడ వసతి గృహాలు లేవని, ఈ సమస్యను పల్నాడు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, ఆయన గుంటూరులో ఉన్న వసతి గృహాన్ని మాచర్లకు మార్చాలని గుంటూరు జిల్లా కలె క్టర్‌కు లేఖ రాశారని గుర్తుచేశారు.

## వైసీపీ పాలనలో దళితుల హత్యలపై విచారణ జరిపించాలి

● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లికి వినతి

గుంటూరు(తూర్పు), జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో దళితుల హత్యలపై విచారణ జరిపించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామ్‌చందర్‌కు దళిత సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. పొన్నూరులో బండ్లమూడి బాబురావుపై బొనిగల నాగమల్లేశ్వరరావు 40మంది వైసీపీ గూండాలతో కత్తులు రాడ్లతో దాడి చేశారని, బర్న్ బాస్ అనే బియ్యం వ్యాపారిని హత్యచేశారని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇవి గాకుండా దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, ఎరిచర్ల కిరణ్ కేసుల్లో కూడా న్యాయం జరగలేదని తెలిపారు. ఇటీవల సింగయ్య అనే దళితుడిని కారుతో జగన్ మోహన్ రెడ్డి తొక్కించగా ప్రాణాలు కోల్పోయారని, ఆ కేసును వైసీపీ నేతలు ప్రక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గూండాలకు శిక్ష పడేలా కేసులు ఫాస్టు ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించాలని కోరారు. దళిత నాయకులు కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నేతలు ఈమని చంద్రశేఖర్, కొర్రపాటి సురేష్, బొల్లెద్దు సుశీలరావు, కోడూరి అఖిల్,దాసరి రమణ, కోపూరి లక్ష్మీ, ఆత్మకూరి వెంకటేశ్వర్లు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించటం అభినందనీయం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించటం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర సోమవారం తెలిపారు. గత నెల 22 నుంచి 30వ తారీకు వరకు కర్ణాటకలోని ధావనగిరిలో జరిగిన జాతీయస్థాయి సీనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ విభాగం నుంచి గోల్డ్ మెడల్ బొల్లినేని చంద్రిక, జూనియర్స్ విభాగంలో సిల్వర్ మెడల్స్‌ను షేక్ సాదియా అల్మాస్, జి.నాగదివ్య సాధించారు. సందర్భంగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రను ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలవగా, మేయర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, సెక్రటరీ షేక్ సందాని పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న నగరమేయర్ కోవెలమూడి రవీంద్ర

## సబార్డినేడ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గం ఎన్నిక గుంటూరు జిన్నాటవర్ సెంటర్లోని వసుంధర భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బాపట్ల గోపాలకృష్ణ, సహాయ ఎన్నిక అధికారిగా దేవరపల్లి జగన్నాథంలు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం.షణ్ముఖ, ఎం.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎన్ కార్తీక్, కార్యాలయ కార్యదర్శిగా వీ కళ్యాణ్, సంయుక్త కార్యదర్శిగా ఆర్ సరళబాబు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రావులపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, జిల్లా మాజీ అధ్యక్షుడు పాగోలు మల్లికార్జున రావులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## ఎస్పీ కార్యాలయం ఎదుట అంబటి, మోదుగుల నిరసన

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో తన పైనా, మాజీ సీఎం జగన్ పైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై తాము ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ప్ల కార్డులు పట్టుకుని గంట పాటు నిరసన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో సీమ రాజా, కిరాక్ ఆర్పీ వైసీపీ నేతలపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆధారాలు చూపినా పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని అంబటి ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో మోదుగుల వేణుగోపాల్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు, పలువురు కార్యకర్తలు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు


మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు మధు తదితరులు

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు తక్షణమే పెంచాలి

● మంత్రి నారాయణకి యూనియన్ నాయకుల వినతి

గుంటూరు కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు పెంచాలని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణను యూనియన్ నాయకులు కోరారు. సోమవారం ఈ మేరకు మంత్రి నారాయణని గుణదలలోని ఆయన నివాసంలో ది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్- టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు, యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఈ నెల 19వ తారీకు లోపు అధికారికంగా ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎన్ సుమన్, గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి ఏసు బాబు, యూనియన్ సభ్యులు రమాదేవి, కోటేశ్వరమ్మ, ఎస్తేరు, కుమారి పాల్గొన్నారు.

## ఆర్వోబీ పిల్లరు గుంతలో జారిపడిన పాదచారి

● బాధితుడుని స్థానికులు ఆస్పత్రికి తరలింపు

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్వోబీ కోసం అరండల్‌పేట మెయిన్ రోడ్డులో తవ్విన పిల్లరు గుంత ప్రమాదకరంగా మారింది. సోమవారం ఉదయం అటుగా వెళుతున్న ఒక పాదచారి గుంతని చూసేందుకు అడ్డుగా పెట్టిన బోర్డులు దాటి లోపలికి రావ డంతో అదుపుతప్పి పడిపోయాడు. అయితే అదృష్టవశాత్తు అంత ఎత్తు నుంచి కిందికి పడిపోయినా పిల్లరు కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ కాంక్రీట్ బెడ్/ఇనుప చువ్వలపై పడలేదు. బెడ్ పక్కనే ఉన్న మట్టిలో పడటం వలన ప్రాణాపాయం తప్పింది. ఈ విషయాన్ని గమ నించిన స్థానికులు వెంటనే పిల్లర్ గుంతలోకి దిగి స్ట్రెచర్ ద్వారా క్షత గాత్రుడిని పైకి తీసుకొచ్చి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ డేంజర్ జోన్ దాటి ఎవరూ లోపలికి ప్రవేశించకుండా ఏజెన్సీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా రాత్రివేళ ఎలాంటి పోలీసు రక్షణ లేకపోతుండటంతో బస్సులు, లారీలు వంటివి కూడా పిల్లరు గుంతల పక్క నుంచి ఆర్వోబీ మీదకు ప్రయాణిస్తున్నాయి. ఆ సమయంలో మట్టి జారిపోతే పెద్ద ప్రమాదాలే జరిగే ఆస్కారం ఉన్నది.


గుంతలో పడిపోయిన పాదచారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

## 22న మెగా జాబ్ మేళా

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సహకారంతో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో ఈ నెల 22న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ భార్గవతేజ తెలిపారు. కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో జాబ్ మేళాను పోస్టర్లు ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. స్థానిక బ్రాడీపేట, మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేళాలో దాదాపు 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ ఆసక్తి గల్గిన యువత 88830 65546, 89195 08017లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలీ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలీ తదితరులు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం డీ 13 సెక్షన్ పరిధిలోని సీతారామనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ పేర్కొన్నారు.


సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ రవీంద్ర

## అంబటి గారడీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఎస్పీ కార్యాలయం ఎదుట అంబటి రాంబాబు చేసిన గారడీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ఎద్దేవా చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలు సోమవారం 18వ డివిజన్ మొహిద్దీన్‌పాలెం, అడపాబజార్‌లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలను అడిగి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. తొలుత మొహిద్దీన్‌పాలెం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, టీడీపీ సీనియర్ నాయకుడు మల్లె విజయ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రజల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి హామీని నెరవేర్చి ప్రజల్లోకి వెళ్లటం చాలా ఆనందంగా ఉందన్నారు. 18వ డివిజన్లో ఎన్నికల ముందు అనేక సమస్యలు చూశామని, రోడ్లు, డ్రైనేజి, మంచి నీటికి ఇబ్బందులు తీవ్రంగా ఉండేవని, వాటన్నిటిని నేడు అధిగమించి ప్రగతి వైపు పయనించేలా చేశామని అన్నారు. వైసీపీ నేత అంబటి రాంబాబు ఎస్పీ కార్యాలయం ఎదుట చేసిన హడావిడి చూస్తుంటే, వారు తమ మనుగడ కోసం వెంపర్లాడుతూ ఏదో ఒక కారణంతో మీడియాలో కనపడాలనే తపన తప్ప, ఆయన చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వచ్చే నెల నుంచి అమలు చేయబోతోందన్నారు. ఎన్డీయే పాలనలో మహిళలకు రక్షణ లేదని వైసీపీ విమర్శించటం సిగ్గుచేటని మేయర్ రవీంద్ర విమర్శించారు. కార్యక్రమంలో పరిశీలకులు సింహాద్రి కనకాచారి, ఉల్లి గోపాలకృష్ణ, మల్లె ఈశ్వర్, ఉప్పుతల సాంబ, ముప్వా వేణుబాబు, కసుకుర్తి హనుమంతురావు, అడపా బాబు, బాషా, నీలం ప్రసాద్, బుజ్జి మేస్త్రి, మల్లీశ్వరి, పూసల శ్రీను, మల్లె నరసింహారావు, ఖాజా, రియాజ్, ఇంతియాజ్, శంకర్‌రావు, ములక సత్యవాణి, శివ లీల తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిలో చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీడీపీ 22వ డివిజన్ నాయకుడు చింతకాయల

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది కూటమి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఆ పార్టీ 22వ డివిజన్ నాయకుడు చింతకాయల వెంకటసాయి అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని శ్రీనివాసరావు పేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొమ్మినేని కోటేశ్వరరావు, కో-క్లస్టర్ ఇన్‌ఛార్జ్ షేక్ అబ్దుల్ రహీం, మాజీ కార్పొ రేటర్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల దైవం మంత్రి లోకేశ్ : టీఎన్ఎస్ఎఫ్

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పాలిట మంత్రి లోకేశ్ దేవుడిగా మారాడని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు అన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో సోమవారం మంత్రి లోకేశ్, ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'థ్యాంక్యూ లోకేశ్ అన్న' అంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమృతరావు మాట్లాడుతూ వివిధ కళాశాలల్లో నిలిచి పోయిన 10లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో ఘట్టమ నేని ఉమా, షేక్ జనత్, పరిశ యువ గణేష్, విజయ్, దాసు, మహీంద్ర, అర్జున్, మోహిత్, దేవాన్ష్ సాయి పాల్గొన్నారు.


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్

## డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరో గ్య కేంద్రం వైద్యాధికారి పీ వైష్ణవీదేవి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల్లో దోమలు పెరగటం వల్ల మలేరియా, డెంగీ చికెన్ గున్యా వంటి జ్వరాలు విజృంభిస్తాయని అన్నారు. మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడ చేరి వచ్చిన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శేషగిరి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

## ప్రారంభమైన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటే శ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం జరుగుల బంగారుబాబు, శివకుమారి గార్ల సౌజన్యంతో శ్రీమద్భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మాచారి సువీరానంద స్వామి ప్రవచిస్తూ భగవద్గీతలోని 16వ అధ్యాయం దైవిక స్వభావం గలవారి లక్షణాలను, అలాగే రాక్షస స్వభావం గలవారి లక్షణాలను వివరిస్తుందన్నారు.

## వైభవంగా ముగిసిన శతాబ్ది మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, 2వ లైన్‌లో కొలువైన శ్రీగౌరీ విశ్వేశ్వర స్వామి ఆలయ శతాబ్ది మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, మహామంగళ పూర్ణాహుతి, మహా కుంబాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, మల్లికార్జునశర్మ, గిరి, రాజనాల వాసులు పర్యవేక్షించారు.



# అడ్డగోలు.. అనుసంధానం!

- విద్యుత్ సర్వీసు ఒకరిది.. ఆధార్ మరొకరిది
- మీటర్ రీడింగ్ పెరిగితే.. సంక్షేమ పథకాలు కట్..
- నష్టపోతున్న లబ్ధిదారులు
- పల్నాడులో ఒక సర్వీసు నంబరుకు 150 ఆధార్ లింకులు..
- పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధికంగా విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలుగా ఆధార్ కార్డు లింక్‌లు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. ఇటీవల పల్నాడులోని వినుకొండలో ఓ వినియోగదారుడి విద్యుత్ సర్వీసుకు ఏకంగా 150 ఆధార్ కార్డులు లింక్ అవడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ సర్వీస్ నంబర్లకు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేయాలన్న నిబంధన పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అసలు సర్వీస్ తీసుకొన్న వినియోగదారుడి ఆధార్ నంబరు కాకుండా.. సంబంధం లేనివారిని లింక్ చేయడమే వివాదాస్పదమవుతోంది. ఒక్కో సర్వీస్ నంబర్‌కు మూడు నుంచి ఐదు, పది ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆధార్ నంబర్లు అనుసంధానమై.. ఉండటం ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

### సంక్షేమ పథకాలకు ఎసరు..

సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటోంది. ఏడాదిలో సరాసరి 3,600 యూనిట్లు దాటి వినియోగం జరిగితే వారికి పలు పథకాలు వర్తించే పరిస్థితి లేదన్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్వీసుకు వేర్వేరు ఆధార్ నంబర్లు అనుసంధానమై.. అనేక మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఇటీవల విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌లకు వేరొకరి ఆధార్ నంబర్లు అనుసంధానం కావడంతో.. తల్లికి వందనం పథకం లబ్ధికి అర్హులు దూరమైన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం.. 'మాకు సంబంధం లేదు అనుసంధానమైన.. సర్వీస్ వినియోగదారుల ఆధార్ కార్డులు మీరే తీసుకురండి' అంటూ తీరిగ్గా, ఉచిత సలహాలు ఇస్తున్నారు.

**● ఈ అనుసంధానం వెనుక ఆంతర్యమేమిటో..?**

**మంగళగిరి సెక్షన్ పరిధిలో దొంతిరెడ్డి శివరామిరెడ్డి పేరుతో ఉన్న విజయ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ విద్యుత్ సర్వీస్‌కు మాజీ ఎంపీ నందిగం సురేష్ కుటుంబ సభ్యుల ఆధార్ నంబరు అనుసంధానమై ఉండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

### పట్టించుకోని యంత్రాంగం

విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలు ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్ల లింక్‌లపై విద్యుత్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఉదాసీనత, క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో అడ్డగోలుగా ఆధార్ నంబర్లు అనుసంధానం అయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు.. క్షేత్రస్థాయిలో సిబ్బంది సాయంతో విద్యుత్ సర్వీస్‌లకు అడ్డగోలుగా ఉన్న ఆధార్ కార్డులను తొలగించి సక్రమంగా నిర్వహించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

---




## మన మిత్రతో..
# అన్నదాత సుఖీభవ



- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- ఆందోళన అవసరం లేదు.. మన మిత్ర ఉంది..
- వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం
- రైతులకు రియల్ టైమ్ గవర్నెన్స్: డీఏఓ నాగేశ్వరరావు



గుంటూరు సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే కారణం తెలుసు కోవడం అతి సులభమని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే రూ.6వేలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వడం జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా ఇప్పటికే ప్రదర్శించారు. రైతులు వాటిని పరిశీలించి తమ పేరు ఉందో లేదో చూసు కోవాలి. అర్హత ఉండి.. జాబితాలో తమ పేరు లేకపోతే.. ఖంగారు పడకుండా.. అందుకుగల కారణాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. ఇందుకు చేయాల్సిందల్లా.. రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తీసుకొచ్చిన మన మిత్ర వాట్సాప్ నంబరు హాయ్ పెడితే చాలు.

### గుంటూరు జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 2,64,566 మంది రైతులు ఉండగా 2,21,317 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయింది. మిగి లిన రైతులకు వివిధ కారణాలతో ఈకేవైసీ కాలేదు. వివరాలకు వ్యవసాయ అధికారి టెక్నికల్ నంబర్ 83310 56914కు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

### ప్రధానంగా ఎదురయ్యే సమస్యలు..

- భూమి లేని బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు, కౌలు గుర్తింపు కార్డులు పొందాలి. ఖరీఫ్ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి. అర్హులకు రూ.20 వేలు సాయాన్ని మూడు విడతల్లో అందజేస్తారు.
- డి-పట్టాదారులు, ఆసైన్డ్, ఈనాం భూములు సాగు చేసేవారందరూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే. కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. కుటుంబం నుంచి విడిపోయి వేరుగా ఉంటే.. కుటుంబ సర్వేలో పేరు చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబరు తప్పుగా అనుసంధానం చేసి ఉంటే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సరైన ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో ఆధార్‌తో జత కాలేదని గుర్తించినా.. చనిపోయిన వారి భూమి మ్యుటేషన్ జరగకపోయినా, వెబ్ ల్యాండ్‌కు సంబంధించిన కారణాలు ఏమైనా ఉంటే వీఆర్వో, తహసీల్దారు ద్వారా సరిచేసుకోవాలి. అనంతరం రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి.
- అటవీ భూమి సాగుదారులు.. గిరి భూమి పోర్టల్లో సమస్యలు ఉంటే గిరిజన సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి, ఆధార్ తప్పుగా నమోదైనా మ్యుటేషన్ కోసం పీఓను సంప్రదించి సరిచేసుకోవాలి.
- రైతుల పేర్లు పరిశీలనలోకి రాలేదంటే వారి భూమి రెవెన్యూ వెబ్ ల్యాండ్, ఆధార్ జతకాలేదని గుర్తించాలి. రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆధార్‌ను వెబ్ ల్యాండ్ రికార్డులతో అనుసంధానం చేసుకుని అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. దేవాదాయ భూముల్లో సాగు చేస్తున్న వారిని కౌలు రైతుల కింద గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తారు.

### ఏం చేయాలి..

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేరు లేని రైతులు మన మిత్ర (95523 00009) వాట్సాప్ నంబరుకు తమ ఫోన్ నుంచి హాయ్ అని సందేశం పంపాలి. అందులో మొదటి వరసలో ఉండే అన్నదాత సుఖీభవ సేవపై క్లిక్ చేసి ఆధార్ నం బర్ నమోదు చేయాలి. దీంతో వెంటనే లబ్ధిదారుని పేరు, తండ్రి పేరు, గ్రామం, మండలం మొదలగు సమాచారం వస్తుంది. అందులో పథకానికి అర్హులా, అనర్హులా అని కూడా తెలుస్తుంది. అనర్హులైతే.. అందుకు కారణం కూడా పొందు పరచడం జరుగుతుంది. ఈకేవైసీ పూర్తయిందా లేదా అనే వివరాలు కూడా వస్తాయి. కారణం తెలుసుకొని అవసరం అయిన పత్రాలు అందజేస్తే వ్యవసాయ శాఖ సిబ్బంది సమస్యను వెంటనే పరిష్కరిస్తారు.

---

## హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయికి
# విజయలక్ష్మి అవార్డు



తెనాలి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాపను విశ్రాంత దివంగత ఉపాధ్యాయిని మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డుతో సత్కరించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొవ్వా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా ఈ అవార్డును ప్ర ముఖులకు అందజేస్తున్నారు. విజయలక్ష్మి పేరిట సత్యనారాయణ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ నెల 19న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పదవ తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 60 మందికి ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని గౌరవ న్యాయమూర్తికి ప్రదానం చేస్తారు. విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేస్తారు. తెనాలిలో జన్మించిన జస్టిస్ జ్యోతిర్మయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. పలుమార్లు బంగారు పతకాలు అందుకున్నారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. 1997లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయి అంచలంచలుగా హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగారు. జాతీయ న్యాయ సేవా సంస్థకు థీమ్ సాంగ్‌ను కూడా రచించారు. సైబర్ క్రైమ్‌పై శిక్షకురాలిగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన విజయలక్ష్మి స్మారక సేవా సంస్థ ఈ అవార్డును ఎంపిక చేసిందని సత్యనారాయణ తెలిపారు. అవార్డు ప్రధానోత్సవంలో జేఎన్‌టీయూ కాకినాడ వీసీ శివరామకృష్ణప్రసాద్, దళిత యూనివర్శిటీ వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, డీఎస్పీ జనార్దనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ ప్రిన్సిపల్ రాంచంద్ పాల్గొంటారని తెలిపారు.

---

# రూ. 60.17 లక్షల విత్తన అమ్మకాలు నిలిపివేత

- గుంటూరులో విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 60.17 లక్షల విలువైన మిరప, సోయాబీన్ విత్తనాల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ. 1.66 లక్షలు విలువ చేసే ఎరువులు, రూ. 14.13 లక్షల విలువ చేసే 3,460 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. సరైన పత్రాలు లేనందున అమ్మకాలు నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఏడీఏ పి.మురళీ కృష్ణ, క్రిష్ణా జిల్లా ఏడీ ఏఎం సునీల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ రవిబాబు, గుంటూరు రూరల్ వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

---




**ఏజెంట్ల మాయా జాలం**

తత్కాల్ టిక్కెట్‌లు రైల్వేలో హాట్ కేకుల్లా బుకింగ్ అయిపోతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం లైసెన్సు కలిగిన ఏజెంట్లు, కొంతమంది ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వాహకులు ఎవరెవరివో ఈ-మెయిల్స్, మొబైల్ నంబర్ల ద్వారా యూజర్ ఐడీలు నమోదు చేసి, ఎక్కువ స్పీడ్ కలిగిన ఇంటర్నెట్ సదుపాయంతో టిక్కెట్‌లు బుకింగ్ చేస్తుంటారు. దీంతో ఐఆర్‌సీటీసీ యూజర్లతో పాటు పీఆర్ఎస్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవడానికి వెళ్లిన సామాన్యులకు తత్కాల్ వెయిటింగ్ లిస్టు ప్రత్యక్షమవుతుంది. తత్కాల్ అవుతుండగానే ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను కూడా బుకింగ్ చేస్తున్నారు. దీనిపై రైల్వే శాఖకు కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

# తత్కాల్ బుకింగ్‌కి.. ఓటీపీ!

- రిజర్వేషన్‌కు ప్రామాణీకరణ తప్పనిసరి
- నేటి నుంచే పీఆర్ఎస్ కౌంటర్లు, ఐఆర్‌సీటీలో అమలు
- ఏజంట్లకు అరగంట తర్వాతే బుకింగ్ అనుమతి
- ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ నిఘా



గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌లో ఆ శాఖ చేసిన సవరణలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఐఆర్‌సీటీసీ యాప్, లైసెన్సు కలిగిన ఏజంట్లు, ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం(పీఆర్ఎస్) కౌంటర్లలో తత్కాల్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవాలంటే సమర్పించిన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ప్రామాణీకరణ తప్పనిసరిగా చేయాలి. అప్పుడే టిక్కెట్ రిజర్వు అవుతుంది. దీని వల్ల టిక్కెట్ బుకింగ్‌కు కొంత సమయం పెరిగే అవకాశం ఉంది. ఐఆర్‌సీటీసీ యాప్ /వెబ్‌పోర్టల్ వినియోగదారులైతే ఆధార్ ఆధారిత ఓటీపీని నమోదు చేస్తేనే టిక్కెట్ బుకింగ్ అవుతుంది. లైసెన్సు కలిగిన ఏజంట్లు తత్కాల్ బుకింగ్స్ ప్రారంభమైన అరగంట వరకు లాగిన్ చేసుకోలేరు. ఈ క్రమంలో ఏమైనా అడ్డదారులు తొక్కేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు ఆర్‌పీఎఫ్ ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆకస్మిక దాడులకు ఉపక్రమించింది.

### ఓటీపీ నమోదు తప్పనిసరి

ఎట్టకేలకు రైల్వే శాఖ తత్కాల్ స్కీమ్‌లో కొన్ని మార్పులు చేసి నేటి నుంచి అమలులోకి తీసుకురానుంది. ఇప్పటికే ఐఆర్‌సీటీసీ యాప్ వినియోగించే యూజర్లకు ఆధార్‌తో అథెంటికేషన్ చేయించింది. ఆధార్ అథెంటికేషన్ లేకపోతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం లేకుండా చేసింది. తాజాగా యాప్/ పోర్టల్ ద్వారా టిక్కెట్‌లు బుకింగ్ చేయదలిచిన యూజర్లు ఆధార్ ఆధారిత ఓటీపీని అథెంటికేషన్ చేస్తేనే తత్కాల్ టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. పీఆర్ఎస్ కౌంటర్లకు వెళ్లి ఫాంలు నింపి బుకింగ్ చేసుకొనే ప్రయాణికులు అందులో తప్పనిసరిగా మొబైల్ నంబరుని నమోదు చేయాలి. ఆ నంబరుకు వచ్చే ఓటీపీని బుకింగ్ క్లర్కుకు చెబితేనే టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. లైసెన్సు పొందిన ఏజంట్లు ఏసీ తరగతుల టిక్కెట్‌లు అయితే ఉదయం 10.30, నాన్ ఏసీ తరగతుల టిక్కెట్లను 11.30 గంటల నుంచి మాత్రమే బుకింగ్ చేయగలరు. అది కూడా ప్రయాణికుడి మొబైల్ నంబరకు వచ్చే ఓటీపీని ప్రామాణికరణ చేసిన తర్వాతనే. కాగా, గత రెండు రోజుల నుంచి ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుంటూరు రైల్వే డివిజన్‌లో పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని యోహిత డిజీ సర్వీసెస్‌లో తనిఖీలు నిర్వహించి ఐదు లైవ్ ఈ టిక్కెట్‌లు, 39 వినియోగించిన ఈ-టిక్కెట్లను సీజ్ చేశారు. వీటి విలువ రూ. 76,715గా పేర్కొన్నారు. అలానే మరో రైల్వేస్టేషన్‌లో రెండు లైవ్ టిక్కెట్లను సీజ్ చేశారు. నరసరావుపేటలో ఆపరేషన్ రైల్ ప్రహరీ నిర్వహించి, ఒక నకిలీ టీటీని అరెస్టు చేశారు.

---

# మంత్రితో మీటింగ్ ఏర్పాటు చేయాలి

**ఏపీ ఎంసీపీ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్**

గుంటూరు సిటీ, జూలై 14( ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలపై చర్చించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తమ హక్కుల సాధన కోసం 40 రోజుల పాటు సమ్మె చేస్తే వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు కొన్ని హామీలు ఇచ్చి దాన్ని విరమింపజేశారని పేర్కొన్నారు. అందులో ప్రధానమైన హామీ ఆరోగ్య శాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు అని గుర్తుచేశారు. సమ్మె విరమించి మూడు నెలలు దాటినా అధికారులు సమావేశం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా.. మంత్రితో సమావేశం ఏర్పాటు చేసి, పెండింగ్ ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రోత్సాహకాలు రాకపోవడంతో పిల్లలకు పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేక పోతున్నామని ఏపీ ఎంసీపీ రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను టాటా డీఐఎన్‌సీ ప్రైవేట్ కంపెనీకి కేటాయిస్తామని చెప్పడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ గురించి మొదట తమతో మాట్లాడాలన్నారు. ఈ అనుమానాల నివృత్తి కోసం మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

---

# సీఆర్డీఏ ఆధీనంలోకి ఇసుక క్వారీలు..!

- రాజధాని అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు



గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇసుక కొరత రాకుండా ఉండేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ ముందుచూపు చర్యలు చేపట్టింది. కృష్ణానది తీరం వెంట ఇరువైపులా ఉన్న ఇసుక రీచ్‌లన్నింటిని ఏపీ సీఆర్‌డీఏ ఆధీనంలోకి తీసుకొనేందుకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేయగా .. పురపాలక శాఖ దానికి రాజముద్ర వేసింది. దాదాపుగా రూ.286 కోట్ల అంచనా విలువతో ఏజెన్సీని త్వరలో ఎంపిక చేసి ఇసుకని బయటకు తీసే బాధ్యతని కేటాయించనుంది. ఇందుకోసం అవసరమైన అన్ని అనుమతులను ఏపీ సీఆర్‌డీఏ తీసుకొనేలా నిబంధనల్లో సవరణలు కూడా జరిగాయి. దీంతో ఇసుక రేవులన్ని కొద్ది రోజుల్లోనే సీఆర్‌డీఏ ఆధీనంలోకి వెళ్లిపోనున్నాయి. నదిలో నుంచి తీసిన ఇసుక మోతాదు, విక్రయించగా వచ్చిన నగదుని జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షిస్తుంది.

### భారీ మోతాదులో ఇసుక అవసరాలు

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ ద్వారా రాజధానిలో వివిధ నిర్మాణాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏడీసీఎల్‌కి 67,88,355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని ఇది వరకే ప్రభుత్వానికి తెలియజేసింది. అలానే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద మౌలిక సదుపాయాల కల్పన కసం 1,18,69,500 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం. హౌసింగ్, భవనాలకు 11,77,815 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లలో నుంచి ఇంత భారీ మోతాదులో ఇసుక సరఫరా చేయాలంటే కుదిరే పని కాదు. ఇదే విషయాన్ని జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రభుత్వానికి నివేదించింది.

**పూడికతీత.. బ్యారేజ్‌లో నీటి నిల్వ**

రెండు జిల్లాల్లో ఉన్న ఇసుక రీచ్‌లలో సీ ఆర్‌డీఏ, ఏడీసీఎల్‌కు అవసరమైనంత మోతా దులో ఇసుక నిల్వలు లేవు. ప్రకాశం బ్యా రేజ్ ఎగువున పూడిక తొలగిస్తే చాలా వరకు అవసరాలు తీరతాయి. ప్రకాశం బ్యారేజ్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక పూడిక తొలగిం పు చేపట్ట లేదు. ఈ కారణంగా వరదలు వచ్చిన ప్రతి సారి భారీ మోతాదులో ఇసుక వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపో తోంది. మరోవైపు ద్వీపాలు కూడా విస్తరి స్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవి ష్యత్తులో మరిన్ని సమస్యలు ఉత్పన్న మయ్యే అవకాశం ఉంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం రాజధాని అవసరాలకు ఇసుక మేటలు, పూడిక తొలగించనుండటంతో నీటి నిల్వ కూడా పెరుగుతుంది.

---




2018లో కోనంకిలో కరకట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రం (సర్కిల్‌లో)

# కోనంకి మట్టిపై కాసు కట్టుకథలు

- తొవ్వింది వాళ్లే.. టీడీపీపై అభియోగం
- అసలు సంగతి చెప్పిన గూగుల్ ఫొటోలు

పిడుగురాళ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోనంకి గ్రామంలో టీడీపీ నాయకులు మట్టిని అక్రమంగా తరలించేశారని.. వరద ముంపు వస్తే గ్రామం మునకేస్తుందని టీడీపీ నేతల అవినీతికి పాల్పడ్డారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులు గూగుల్ టేకోవర్ ద్వారా 2018 నుంచి ఇప్పటి వరకు ఉన్న స్థితిని బయటకు తీశారు. 2018లో మట్టికట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రంలో చూపిస్తుండగా 2022లో మట్టికట్ట లేనట్టుగా గూగుల్ చిత్రంలో కనిపిస్తోంది. వైసీపీ హయాంలో గ్రామ నాయకు లు మట్టికట్టను అక్రమంగా తొవ్వేసి రహదారి ని ర్మాణానికి లక్షల రూపా యలకు అమ్మేసి... టీడీపీ నేతలపై చేస్తున్న ఆరోపణ లు సరైనవి కావని గూగుల్ చిత్రం ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.



2022లో గ్రామంలో కరకట్ట లేనట్టుగా చూపుతున్న గూగుల్ చిత్రం



వేర్వేరు ఊళ్లలో ఉద్యోగాలు, ఉరుకులు పరుగుల జీవితాలు... కారణాలు ఏవైనా, దంపతుల మధ్య లైంగిక దూరం పెరుగుతోంది. దాంతో గర్భం దాల్చే వెసులుబాట్లను వెతుక్కోవలసిన అవసరత ఏర్పడి, పలు రకాల సంతానోత్పత్తి పరికరాలు వాడుకలోకొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్న ఆ ఉత్పత్తుల ప్రామాణికత ఏ మేరకు? వాటితో లాభ నష్టాలేంటి? వైద్యులేమంటున్నారు? తెలుసుకుందాం!

# సంతానోత్పత్తి సాధనాల సారం ఎంత?

వ్యక్తిగత కారణాలతో పెళ్లి, పిల్లలను వాయిదా వేసే ధోరణి పెరిగింది. దాంతో ప్రత్యేకించి మహిళల్లో అండాల కొరత ఏర్పడి, గర్భధారణ అవకాశాలు క్షీణిస్తున్నాయి. దురలవాట్లు, ఒత్తిళ్లు, పర్యావరణ మార్పులు, ఆహారపుటలవాట్లు కూడా స్త్రీపురుషుల్లోని పునరుత్పత్తి వ్యవస్థలను నీరుగారుస్తున్నాయి. దాంతో పెళ్లవగానే పిల్లలు పుట్టే పరిస్థితులు అడుగంటాయి. ఇది నాణేనికి ఒక పార్శ్వం మాత్రమే! ఉదయం లేచినప్పటి నుంచి ఇంటి పనులు, ఉద్యోగ బాధ్యతలతో తీరిక లేకుండా గడపడం, రాత్రయ్యేటప్పటికి అలసిపోయి పడక మీద వాలిపోవడం పరిపాటైపోయింది. వారాంతాల్లో తీరిక దొరికినా, ఆ సమయాన్ని ఇతరత్రా పనులకు కేటాయిస్తూ ఉండడంతో, దంపతులు దాంపత్య జీవితానికి సరిపడా సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. వేర్వేరు ఊళ్లలో ఉద్యోగాలు చేస్తూ, దీర్ఘ సెలవుల్లోనే కలుసుకునే దంపతుల పరిస్థితి మరీ దారుణం. ఇన్ని ప్రతికూలతలు నెలకొని ఉన్నప్పుడు, పరిస్థితులన్నీ అనుకూలించి గర్భం దాల్చడం కష్టమే! కాబట్టే గర్భధారణ అవకాశాలను మెరుగు పరచడం కోసం పలు రకాల పరికరాలు అందుబాటులోకొచ్చాయి. అవేంటంటే...

## ఎవరి కోసం?

గర్భధారణకు అడ్డుపడే ఆరోగ్య సమస్యలేవీ లేవని వైద్యులు నిర్థారించిన దంపతులు గర్భధారణ సాధనాలను ఆశ్రయించడంలో తప్పు లేదు. ఈ కోవకు చెందిన దంపతులతో పాటు...

- వేర్వేరు ఊళ్లలో ఉంటూ, తరచూ శారీరకంగా కలుసుకునే వీలు లేని దంపతులు
- అరుదుగా కలిసే సందర్భాల్లో పర్ఫార్మెన్స్ ప్రెషర్ వల్ల అంగస్తంభన సమస్యను ఎదుర్కొంటున్న వాళ్లు
- భాగస్వామిలో ఒకరు ఆరోగ్య కారణాలతో మంచానికే పరిమితమై, ఆ ఖాళీ సమయంలో గర్భధారణ ప్రయత్నం చేయాలనుకునే దంపతులు
- దంపతుల్లో ఒకరు రాత్రి వృత్తి, మరొకరు పగటి వృత్తి చేస్తూ, లైంగికంగా దగ్గరయ్యే వీలు లేని దంపతులు

## ఓవ్యులేషన్ కిట్

ఊపిరి పీల్చుకోలేని పనులతో సతమతమయ్యే మహిళలకు నెలసరిని గుర్తుపెట్టుకుని, అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా కనిపెట్టే తీరిక ఉండకపోవచ్చు. ఇలాంటి మహిళల కోసం అందుబాటులోకొచ్చినదే ఓవ్యులేషన్ కిట్. ఇది ప్రెగ్నెన్సీ కిట్ లాంటిదే! సాధారణంగా అండం విడుదలకు ముందు ల్యుటినైజింగ్ అనే హార్మోన్ మూత్రంలోకి విడుదలవుతూ ఉంటుంది. కాబట్టి మూత్రాన్ని పరీక్షించడం ద్వారా అండం విడుదలను కనిపెట్టే గ్యాడ్జెట్ ఇది. ఈ కిట్‌లో ఉండే స్ట్రిప్స్‌ను మూత్రంలో ముంచి, మారిన రంగును బట్టి తర్వాతి 24 గంటల్లో అండం విడుదల కాబోతున్నట్టు నిర్థారించుకోవచ్చు. ఆ సమయంలో కలిస్తే గర్భధారణ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాటు, ఓవ్యులేషన్ కిట్‌ను ఎప్పుడు వాడుకోవచ్చో తెలిపే యాప్ కూడా అందుబాటులో ఉంది. అదే ఓవ్యులేషన్ ట్రాకర్. ఈ యాప్, మూడు నెలల నెలసరి వివరాలను అందించడం ద్వారా అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా లెక్కించి అప్రమత్తం చేస్తుంది.



## ఇన్‌సెమినైజేషన్ కిట్

నిర్దిష్ట రోజుల్లోనే కలిసి తీరే పరిస్థితి ఉన్నప్పుడు కొందరు పురుషుల్లో పర్‌ఫార్మెన్స్ ప్రెషర్ పెరిగిపోయి, అంగస్తంభన సమస్య తలెత్తుతుంది. ఇంకొందరికి స్వతహాగానే అంగ స్తంభన సమస్య ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో వీర్యాన్ని సేకరించి, జననావయవంలోకి ప్రవేశపెట్టుకునే వీలుండే కిట్ ఇది. అండం విడుదలయ్యే రోజు ఇలా ఈ కిట్‌ను వాడుకోవడం ద్వారా గర్భం దాల్చే అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు. ఈ కిట్‌లో, వీర్యాన్ని సేకరించే కప్పు, నీడిల్ లేని సిరంజి ఉంటాయి. శుభ్రత పాటించని సందర్భాల్లో మహిళలకు ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కిట్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి.

## కన్‌సెప్షన్ కప్స్

అంగ ప్రవేశం తదనంతరం, వీర్యం బయటకు రాకుండా గర్భాశయ ముఖ ద్వారం దగ్గరే ఎక్కువ సమయం పాటు నిలిపి ఉంచే పరికరం ఇది. దీన్ని ఉపయోగించుకున్నప్పుడు, గర్భాశయ ముఖద్వారం దగ్గరే వీర్యం నిలిచి ఉంటుంది కాబట్టి వీర్య కణాలు అండాన్ని చేరుకునే అవకాశాలు సులభతరమవుతాయి.


## గర్భధారణ కాలం ఎప్పుడు?

మహిళల్లో గర్భధారణ సజావుగా జరగడానికి అండాల విడుదల సక్రమంగా జరగాలి. నెలసరి అయిన రోజు మొదలు 14 నుంచి 16వ రోజు మధ్య ఎప్పుడైనా అండం విడుదల జరగవచ్చు. సాధారణంగా కొందరు నెలసరి ఆగినప్పటి నుంచి రోజులను లెక్కబెట్టి లైంగికంగా కలుస్తూ ఉంటారు. ఫలితంగా గర్భధారణ సాధ్యపడదు. కాబట్టి అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా లెక్కించి అప్రమత్తం చేసే ఉపకరణాలు ఇలాంటి మహిళలకు ప్రయోజనాన్నిస్తాయి.

## ఎవరికి నిష్ప్రయోజనం?

గర్భధారణ ఉపకరణాలు ఇన్‌ఫెర్టిలిటీని సరిదిద్దే మందులు కావు. ఇవి కేవలం గర్భధారణ అవకాశాలను మెరుగు పరిచే ప్రత్యామ్నాయాలు మాత్రమే అనే విషయం దంపతులు గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి గర్భధారణ కోసం వీటి మీదే గుడ్డిగా ఆధారపడడం అవివేకం! ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవని వైద్యులు నిర్థారించిన తర్వాత, గర్భధారణ కోసం నిర్దిష్ట కాలం పాటు మాత్రమే వీటి మీద ఆధారపడి, ఫలితం లేనప్పుడు, వైద్యులను సంప్రతించాలి. అలా కాకుండా, పునరుత్పత్తి సమస్యలు ఉన్నాయని తెలుసుకోకుండా, వాటిని సరిదిద్దుకోకుండా వీటి మీదే ఆధారపడడం వల్ల విలువైన గర్భధారణ సమయం వృథా అయిపోతుంది. ఉదాహరణకు థైరాయిడ్, పిసిఒడిల వల్ల నెలసరి సమస్యలు ఉన్న మహిళలు ఈ పరికరాలనే వాడుకుంటూ ఉండిపోవడం వల్ల ఆ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించకుండా వీటిమీదే ఆధారపడడం అవివేకం.


డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

అప్రమత్తం

## కృత్రిమ చక్కెర చేటు

కృత్రిమ చక్కెర ఆస్పర్టేమ్, పేగుల్లోని బ్యాక్టీరియాతో పాటు, జియోబ్లాస్టోమా అనే క్యాన్సర్‌తో సంబంధమున్న జన్యువుల రూపురేఖలను మార్చేస్తుందని తాజా పరిశోధనలో తేలింది. మరిన్ని వివరాలు... గతంలో అనుకున్నట్టు కృత్రిమ చక్కెర, ఆస్పర్టేమ్ ఇక మీదట ఏమాత్రం సురక్షితం కాదు. ఈ చక్కెరతో పేగులు, మెదడు, పునరుత్పత్తి వ్యవస్థ, రక్తం... ఇలా బహుళ క్యాన్సర్ల ముప్పు పెరిగే ప్రమాదముందని పలు



అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ చక్కెరతో తలనొప్పులు పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా క్షీణిస్తుంది. డైట్ పానీయాలు, రక్త క్యాన్సర్ ముప్పుకూ అత్యధిక ఆస్పర్టేమ్ మోతాదులకూ మధ్య ఉన్న సంబంధాన్ని కనిపెట్టడంలో తొలినాళ్ల అధ్యయనాలు విఫలమైనప్పటికీ, ఆస్పర్టేమ్ పేగుల్లోని మైక్రోబియంను నేరుగా ప్రభావితం చేసి, గ్లియోబ్లాస్టోమా అనే క్యాన్సర్ ముప్పును పెంచుతుందని తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. తాజా ఆధారాలు గ్లియోబ్లాస్టోమా చికిత్స వ్యూహాలను అంచనా వేయడంలో వైద్యులకు సహాయపడతాయనీ, జీన్ టార్గెటెడ్ థెరపీలతో పాటు, మైక్రోబియం ఆధారిత చికిత్సలకు కొత్త మార్గాలు తెరుస్తాయనీ పరిశోధకులు భావిస్తున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

# సహజమైన అందం... అరుదైన అభినయం



ఒకప్పుడు తెలుగు, తమిళ, కన్నడ భాషలను ఏలిన అందాల కథానాయిక బి.సరోజాదేవి. మిగిలిన రెండు భాషలతో పోలిస్తే తెలుగులో తక్కువ సినిమాలే చేసినా తన ముద్దు ముద్దు మాటలతో, సౌందర్యంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు సరోజాదేవి. తెలుగులో ఎన్టీఆర్, ఏయన్నార్, తమిళంలో ఎమ్జీఆర్, శివాజీగణేశన్, కన్నడంలో రాజ్‌కుమార్.. ఇలా మూడు భాషల్లో దిగ్గజ నటులతో నటించి ప్రేక్షకుల అభిమానం పొందారామె. ముఖ్యంగా 1955 నుంచి 84 వరకూ 29 ఏళ్ల పాటు వరుసగా 161 చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించి చరిత్ర సృష్టించారు సరోజాదేవి. ఇవాళ షష్ఠి పూర్తి చేసుకున్న మగమహారాజులకు వాళ్ల యవ్వన కాలంలో ఆకట్టుకొని అలరించిన కథానాయిక సరోజాదేవి.

నటన అన్నా, సినిమాలు అన్నా ఆసక్తి లేని సరోజాదేవి నటిగా పరిచయం కావడం, గ్లామర్ కథానాయికగా పేరు తెచ్చుకోవడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. కానీ వాళ్ల నాన్నగారికి నాటకాలంటే ఇష్టం కావడంతో సరోజాదేవితో ఓ నాటకంలో బాలకృష్ణుని వేషం వేయించారు. చక్కగా అలంకరించుకుని ముద్దు ముద్దు మాటలతో సరోజాదేవి అందరినీ ఆకట్టుకున్నారు. ఒకసారి స్కూల్ వార్షికోత్సవంలో 'ఏ జిందగీ' అని పాడుతూ అభినయించడం ప్రేక్షకుల్లో ఉన్న హొన్నప్ప భాగవతార్‌కు నచ్చింది. ఆయన ఆ సమయంలో (1955)లో మహాకవి కాళిదాస' చిత్రం తీసే సన్నాహాల్లో ఉన్నారు. అందులో కథానాయిక విద్యాధరి పాత్ర సరోజాదేవితో వేయించాలని నిర్ణయించుకున్నారు. సరోజకు ఇష్టం లేకపోయినా తల్లితండ్రుల బలవంతం మీదే తన 13వ ఏట ఆ చిత్రంలో నటించారు. ఆ తర్వాత వరుసగా సినిమాల్లో అవకాశాలు రావడంతో సరోజ కూడా నటన పట్ల ఆసక్తి పెంచుకున్నారు.

## ఆ పదేళ్లు ఏలేశారు

ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'పాండురంగ మహాత్మ్యం' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఎన్టీఆర్ సరసన ఎక్కువ చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. అలాగే ఏయన్నార్ సరసన ఐదు చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏయన్నార్ కలసి నటించిన 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో నటించే అవకాశం ఆవిడకు వచ్చింది. ఆ సినిమాలో ఎన్టీఆర్‌కు సోదరిగా నటించి 'చిన్నన్నయ్యా' అని ముద్దు ముద్దుగా పిలవడం ఆ రోజుల్లో ఆడపిల్లలకు పెద్ద క్రేజ్. సరోజాదేవి కెరీర్‌లో మరపురాని కాలం అరవయ్యవ దశాబ్దం. ఆ పదేళ్ల కాలంలో దక్షిణాదిన మకుటం లేని మహారాణిలా వెలిగారు. ఆ రోజుల్లో ఆమెను అంధ్రుల అందాల తార అని, 'ఆంధ్రా క్లియోపాత్ర' అని పిలిచేవారు. ఆ సమయంలో దక్షిణాదిలో ఆవిడ హయ్యెస్ట్ పెయిడ్ హీరోయిన్ కూడా. తదనంతర కాలంలో ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్, ఎమ్జీఆర్, జయలలితతో సరోజాదేవి కలసి నటించడం ఒక విశేషం. హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిన తర్వాత హీరో కృష్ణ నిర్మించిన 'పండంటి కాపురం' చిత్రంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆవిడ కొనసాగారు. హీరో కృష్ణంరాజు నిర్మించిన 'యమధర్మరాజు' చిత్రంలోనూ సరోజాదేవి కీలక పాత్ర పోషించారు.





## అభినయ సరస్వతి

తమిళ సినీ ప్రేక్షకుల హృదయాల్లో 'అభినయ సరస్వతి'గా చెరగని ముద్ర వేసుకున్న బి.సరోజాదేవి కోలీవుడ్‌లోనూ అగ్రనటిగా కొనసాగారు. ఎంజీ రామచంద్రన్, నడిగర్ తిలగం శివాజీ గణేశన్‌లతో కలిసి అత్యధిక చిత్రాల్లో నటించారు. ఎంజీఆర్‌తో 26 చిత్రాలు, శివాజీ గణేశన్‌తో 22 చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఆ తర్వాత జెమిని గణేశన్, ఎస్ఎస్ రాజేంద్రన్, ముత్తురామన్, ఏవీఎం రాజన్, రవిచంద్రన్ వంటి ప్రముఖ నటులతో అనేక చిత్రాల్లో నటించారు. ఎంజీఆర్‌తో కలిసి ఆమె నటించిన చివరి చిత్రం 'అరస కట్టలై' (1967). 1960-70 దశకంలో పద్మిని, సావిత్రి, సరోజాదేవి అగ్రహీరోయిన్లుగా కొనసాగారు. సరోజాదేవి నటించిన తన వందో చిత్రం 'పెణ్ ఎండ్రాన్ పెణ్' తమిళంలో రూపుదిద్దుకోవడం గమనార్హం. తమిళంలో ఆమె చివరిసారిగా 2009లో వచ్చిన 'ఆదవన్' అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో సూర్య - నయనతార జంటగా నటించారు..

## ఆ ఇద్దరితో వాన పాట

ఎన్టీఆర్, ఏయన్నార్ నటించిన చిత్రాల్లో వాన పాటల్లో మురిపించిన తారగా సరోజాదేవి నిలిచారు. 'ఆత్మబలం' (1964)లోని చిటపట చినుకులు పడుతూ ఉంటే' పాటలో ఏయన్నార్‌కు జోడీగా నటించిన సరోజాదేవి తన అందంతో ప్రేక్షకులను కట్టి పడేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'భాగ్యచక్రం' (1968)లో 'వాన కాదు వాన కాదు.. వరదా రాజా' పాటలోనూ సరోజాదేవి అందం ప్రేక్షకులకు బంధాలు వేసింది. 'చిటపట చినుకులు' పాట చిత్రీకరించే సమయానికి సరోజాదేవికి 104 డిగ్రీల జ్వరం. అంత జ్వరంలోనూ ఆవిడ ఆ పాట చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ పాటలో సరోజాదేవి వర్షంలో పెద్దగా తడవకుండా ఓ పెద్ద కర్ఛీఫ్ తలకు చుట్టారు. సినిమా విడుదలయ్యాక అలా కర్ఛీఫ్‌ను తలకు చుట్టుకోవడం ఓ ఫ్యాషన్‌గా భావించి ఆ రోజుల్లో చాలా మంది యువతులు ఫాలో కావడం విశేషం.

## పదవులు.. పురస్కారాలు

బి.సరోజాదేవికి 1969లో కేంద్రప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం లభించింది. 1992లో ఆమెను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాల నుంచి నాలుగుసార్లు ఉత్తమ నటిగా అవార్డులు అందుకొన్నారు సరోజాదేవి. 1989లో కర్నాటక ప్రభుత్వం నుంచి రాజ్యోత్సవ అవార్డు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ అవార్డ్‌తో, తమిళనాడు ప్రభుత్వం ఎమ్జీఆర్ అవార్డ్‌తో ఆవిడను సత్కరించాయి. 1989లో కేంద్రప్రభుత్వం ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డ్‌తో గౌరవించింది. బెంగళూరు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఇక సరోజాదేవిని వరించిన పదవుల విషయానికి వస్తే.. 1981లో కర్నాటక చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కంఠీరవ స్టూడియోకు ఛైర్మన్‌గా ఆవిడ వ్యవహరించారు. అప్పట్లో ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ మాండ్యా లోక్‌సభ స్థానానికి పార్టీ టికెట్ ఇస్తామని ఆఫర్ చేసినా, రెండు పడవల ప్రయాణం తనకు ఇష్టం లేదని సున్నితంగా తిరస్కరించారు సరోజాదేవి. ఆవిడకంటే అందగత్తెలు, గ్లామర్ నటీమణులు ఎవరూ లేరా అంటే.. ఉండొచ్చు కానీ ఓ తరం వారి హృదయాల్లో రోజూ దీపం వెలిగించిన ఘనత మాత్రం కచ్చితంగా సరోజాదేవిదే! ఆవిడ చిలుక పలుకులు, కన్నులు తిప్పే తీరు ఇప్పటికీ వెంటాడుతునే ఉంటాయి.

# అభినయ సరస్వతి బి. సరోజాదేవి ఇక లేరు

- నేడు దశవారలో అంత్యక్రియలు



తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 200కి పైగా చిత్రాల్లో నటించి 'అభినయ సరస్వతి' గా పేరొందిన బి. సరోజాదేవి(87) కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఒకప్పటి మైసూరు సంస్థానం చన్నపట్టణ పరిధిలోని దశవార గ్రామంలో 1938 జనవరి 7న ఒక్కలిగ కుటుంబంలో సరోజాదేవి జన్మించారు. తండ్రి భైరప్ప మైసూరులో పోలీసు అధికారి కాగా తల్లి రుద్రమ్మ గృహిణి. దంపతులకు నాల్గో సంతానంగా సరోజాదేవి జన్మించారు. 13వ ఏట కన్నడ సినిమాలో అడుగు పెట్టారు. 'మహాకవి కాళిదాస' 1955లో నటించడం ద్వారా ఆమెకు ఎంతో పేరు వచ్చింది. ఓవైపు కన్నడ సినిమాలలో నటిస్తూనే తెలుగు, తమిళ భాషల్లోనూ కొనసాగారు. కన్నడలో డాక్టర్ రాజ్‌కుమార్, కల్యాణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, తెలుగులో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళంలో జెమినీ గణేశన్, శివాజి గణేశన్, ఎంజీ రామచంద్రన్‌తోపాటు హిందీలో దిలీప్‌కుమార్, రాజేంద్ర కుమార్, షమ్మీకపూర్, సునిల్‌దత్‌లతో కలసి నటించారు. సరోజాదేవి 1967 మార్చి 1న జర్మనీలో మెకానికల్ ఇంజనీర్ అయిన శ్రీహర్షను పెళ్లి చేసుకున్నారు. అప్పటికే దాదాపు వంద చిత్రాల్లో నటించిన సరోజాదేవి. భర్త శ్రీహర్ష ప్రోత్సాహంతో నటిగా కొనసాగారు. 1986లో శ్రీహర్ష గుండె పోటుతో కన్నుమూశారు.. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కాగా పెద్దకుమార్తె మృతి చెందారు.

## బి.సరోజాదేవి మృతికి ఆంధ్ర, కర్ణాటక ముఖ్యమంత్రుల సంతాపం

బి.సరోజాదేవి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ప్రతిపక్షనేత ఆర్ అశోక్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, సభాపతి హొరట్టి, ప్రముఖ నటులు రజనీకాంత్, కిచ్చా సుదీప్, ఖుష్బూ సుందర్, సిమ్రాన్ సహా పలువురు సంతాపం తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

## ఆ ప్రత్యేకత ఆమె సొంతం

- బాలకృష్ణ



ఎన్టీఆర్ అవార్డు స్వీకరిస్తూ...

సరోజాదేవి మృతిపై నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒకప్పుడు ధ్రువతారగా వెలుగొందిన బి.సరోజాదేవి ఇక లేరు అన్న వార్త ఎంతో బాధాకరం. మా తండ్రి ఎన్టీఆర్‌తో దాదాపు 20 చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. ఆయనతో శ్రీరాముడి పక్కన సీతాదేవిగా, రావణాసురుడి పక్కన మండోదరిగానూ నటించిన ప్రత్యేకత ఆమె సొంతం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు

# బిజినెస్



## ఎల్ఐసీ చీఫ్‌గా దొరైస్వామి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) కొత్త సారథిగా ఆర్ దొరైస్వామి నియమితులయ్యారు. మూడు సంవత్సరాల కాలానికి ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ఆయనను నియమిస్తూ ఆర్థిక సర్వీసుల శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2028 ఆగస్టు 28 వరకు అంటే 62 సంవత్సరాల వయసు వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఎల్ఐసీలో ఎండీ, సీఈఓతో పాటు నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లుంటారు.



ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.444.79 కోట్ల డివిడెండ్‌ను అందించింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 15వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 510 | విజయవాడ | 515 |
| వరంగల్ | 512 | గోదావరి | 496 |
| చిత్తూరు | 583 | విశాఖపట్నం | 540 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 88 | విజయవాడ | 94 |
| వరంగల్ | 88 | గుంటూరు | 99 |
| కరీంనగర్ | 88 | ఒంగోలు | 102 |
| మహబూబ్‌నగర్ | 88 | చిత్తూరు | 100 |
| కర్నూలు | 88 | నెల్లూరు | 105 |
| విశాఖపట్నం | 81 | అనంతపురం | 105 |
| గోదావరి | 94 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99,880 ▲ | 91,550 ▲ | 1,25,000 ▲ |
| విజయవాడ | 1,01,450 ▲ | 95,300 ▲ | 1,16,700 ▲ |
| విశాఖపట్నం | 1,00,900 ▲ | 91,550 ▲ | 1,25,000 ▲ |
| రాజమండ్రి | 99,870 ▲ | 91,550 ▲ | 1,15,800 ▲ |
| ప్రొద్దుటూరు | 98,000 ▲ | 90,160 ▲ | 1,12,800 ▲ |
| ముంబై | 98,303 ▲ | 90,045 ▲ | 1,13,867 ▲ |

## ఐటీ కొలువుల్లో చిన్న నగరాల హవా

### జాబితాలో విశాఖపట్నం, వరంగల్.. 50 శాతానికి పైగా వృద్ధి: టీమ్‌లీజ్



న్యూఢిల్లీ: ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తెలంగాణలోని వరంగల్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు.. మెట్రో నగరాలను మించిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో ఈ నగరాల్లో ఐటీ నియామకాలు, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 50 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటు 12 నుంచి 15 శాతం మించలేదు. కంపెనీలకు నియామక సేవలు అందించే టీమ్‌లీజ్ డిజిటల్ సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ప్రధాన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు అన్నిటిలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోందని ఆ సంస్థ పేర్కొంది.

ఇతర ప్రధానాంశాలు

- కొవిడ్ తర్వాత ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై ఐటీ కంపెనీల దృష్టి
- కోయంబత్తూరు, నాగ్‌పూర్, నాసిక్ నగరాల్లో 20-25 శాతం పెరిగిన నియామకాలు
- ఇండోర్, జైపూర్‌లలో 30 నుంచి 40 శాతం పెరిగిన ఐటీ నియామకాలు
- సహాయ ఉద్యోగుల నియామకాలు ప్రధాన నగరాల్లో 8-15% పెరిగితే.. చిన్న నగరాల్లో 24-31% పెరుగుదల
- మైసూరులో జెనరేటివ్ ఏఐతో సహా డిజిటల్ టెక్నాలజీల నియామకాలు 32 శాతం అప్
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఐటీ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, అంతర్జాతీయ ప్రముఖ సంస్థల రాకతో పుంజుకున్న చిన్న నగరాలు.
- ప్రధాన నగరాల్లో స్టార్టప్‌ల పోటీని తట్టుకోలేక చిన్న నగరాల బాట పట్టిన ఐటీ కంపెనీలు.
- ఫుల్ స్టాక్ డెవలపర్లు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు, క్లౌడ్ స్పెషలిస్టులకు మంచి డిమాండ్

## ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

**జూన్‌లో 2.1 శాతంగా నమోదు**
**2019 జనవరి తర్వాత ఇదే తక్కువ**
**వడ్డీ రేట్లు మరింత దిగొచ్చే చాన్స్**

న్యూఢిల్లీ: వరుసగా కొన్ని నెలలుగా తగ్గుతూ వస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో మరింతగా తగ్గి 2.1 శాతానికి దిగొచ్చింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. 2019 జనవరిలో నమోదైన 1.97% తర్వాత ద్రవ్యోల్బణం ఇంత దిగువకు రావడం ఇదే ప్రథమం. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం వరుసగా ఇది ఎనిమిదో నెల. రుతుపవనాలు సకాలంలో రావడం, విస్తృతంగా వ్యాపించడం కారణంగా ఆహార వస్తువుల ధరలు.. పత్యేకించి కూరగాయల ధరలు -19 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ఇవి కాకుండా పప్పులు, పప్పు ఉత్పత్తులు (-11.76%), మాంసం, చేపలు (-1.62%), తృణ ధాన్యాలు, అనుబంధ ఉత్పత్తులు; చక్కెర, కన్ఫెక్షనరీ, పాలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాల (-3.03%) ధరలు కూడా జూన్‌లో గణనీయంగా తగ్గాయని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెలలో 2.82 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 5.08 శాతంగా ఉంది.

### రెపో మరింత తగ్గుతుందా...?

గత నవంబరు నుంచి ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్‌బీఐ) ప్రభుత్వం నిర్దేశించిన ద్రవ్యోల్బణం కట్టడి కనిష్ఠ పరిమితి 2 శాతానికి (ఎగువకు లేదా దిగువకు 2% సద్దుబాటుతో 4% స్థాయికి కట్టడి) అతి చేరువకు వచ్చింది. ఈ కారణంగా వచ్చే నెల మొదటి వారంలో జరుగనున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో వడ్డీ రేటు మరింతగా తగ్గించవచ్చని అంటున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం మేరకు తగ్గించింది. ఆగస్టులో మరో 0.25 శాతం తగ్గించవచ్చని భావిస్తున్నట్టు ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ అన్నారు.

### తెలంగాణలో కనిష్ఠం

ప్రాంతాలవారీగా చూసినట్టయితే రిటైల్ ద్రవ్యోల్బణం తెలంగాణలో అత్యంత కనిష్ఠం 0.93 శాతంగా ఉండగా కేరళలో అత్యంత గరిష్ఠం 6.71 శాతంగా నమోదైంది. అంతే కాదు... గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు కన్నా తక్కువ స్థాయిలో 1.72 శాతం ఉండగా పట్టణ ప్రాంతాల్లో 2.56 శాతంగా ఉంది.

### టోకు ధరలదీ అదే దారి

టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) అయితే 19 నెలల విరామం అనంతరం నెగిటివ్ జోన్‌లోకి వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది జూన్‌లో 0.13 శాతంగా ఉంది. మే నెలలో ఇది 0.39% ఉండగా గత జూన్‌లో 3.43 శాతంగా ఉంది. టోకు ధరల సూచీలోని ఆహార వస్తువుల విభాగం 3.75 శాతం ప్రతి ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది.

## నాలుగో రోజూ నష్టాలే..

**సెన్సెక్స్ 247 పాయింట్లు డౌన్**

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 490 పాయింట్లు క్షీణించింది. మళ్లీ కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67.55 పాయింట్లు కోల్పోయి 25,082.30 వద్ద ముగిసింది.

### పీఈ ఇన్వెస్టర్ల చేతికి వీఐపీ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: ప్రముఖ లగేజ్, ట్రావెల్ యాక్సెసరీస్ తయారీ కంపెనీ వీఐపీ ఇండస్ట్రీస్ యాజమాన్యం చేతులు మారుతోంది. ఈ కంపెనీ ప్రమోటర్లు అయిన దిలీప్ పిరామల్, అతని కుటుంబ సభ్యులకు కంపెనీ ఈక్విటీలో ఉన్న వాటా నుంచి 32 శాతం వాటాను మల్టిపుల్స్ ప్రైవేట్ ఈక్విటీ అనే ఆల్టర్‌నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇద్దరి మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరింది. దీంతో మల్టిపుల్ పీఈ సంస్థ ప్రజల నుంచి మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.388 చొప్పున కొనుగోలు చేసేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.

## ఎస్క్రో ఖాతాలో రూ.4,843 కోట్లు జమ

**జేన్ స్ట్రీట్**

న్యూఢిల్లీ: సెబీ ఆదేశానుసారంగా ఎస్క్రో ఖాతాలో రూ.4,843.57 కోట్లు జమ చేసిన అమెరికన్ హెడ్జ్ ఫండ్ కంపెనీ జేన్ స్ట్రీట్.. తమపై విధించిన కొన్ని ఆంక్షలను ఎత్తివేయాలని నియంత్రణ మండలిని కోరింది. జేన్ స్ట్రీట్ అభ్యర్థనను పరిశీలిస్తున్నామని సెబీ పేర్కొంది. మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల ద్వారా మార్కెట్ నుంచి అక్రమంగా వేల కోట్లు ఆర్జించిన జేన్ స్ట్రీట్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది.

## వెండి రూ.5,000 జంప్

**ఢిల్లీలో రూ.1.15 లక్షలకు చేరిన కిలో ధర**

న్యూఢిల్లీ: వెండి కొండెక్కుతోంది. ఢిల్లీ మార్కెట్లో కిలో ధర ఏకంగా రూ.5,000 పెరుగుదలతో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1.15 లక్షలకు చేరింది. హైదరాబాద్ మార్కెట్లోనైతే రూ.1.25 లక్షలు పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని రేటు 14 ఏళ్ల (2011 సెప్టెంబరు తర్వాత) గరిష్ఠ స్థాయి 39.02 డాలర్లకు ఎగబాకడంతో దేశీయంగానూ అమాంతం పెరిగింది. అంతర్జాతీయంగా పారిశ్రామిక రంగాల్లో, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో వెండి వినియోగం భారీగా పెరుగుతుండటం, ట్రంప్ సుంకాలతో నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, బులియన్ ఇన్వెస్టర్లు బంగారానికి ప్రత్యామ్నయంగా వెండిలో పెట్టుబడులు పెంచుకోవడం ఈ ర్యాలీకి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా, మేలిమి (99.9% స్వచ్ఛత) బంగారం రేటు దేశ రాజధానిలో రూ.200 పెరిగి రూ.99,570కి చేరగా.. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మూడు వారాల గరిష్ఠ స్థాయి 3,369 డాలర్లకు చేరింది.

## విమానాశ్రయాల సమీపంలోని ఇళ్లకు భలే గిరాకీ

**4 ఏళ్లలో 120% వరకు పెరిగిన ధర**

న్యూఢిల్లీ: ప్రస్తుతం లేదా ప్రతిపాదిత విమానాశ్రయాల సమీపంలోని ఇళ్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. గత నాలుగేళ్లలో బెంగళూరు, హైదరాబాద్, నవీ ముంబై, గ్రేటర్ నోయిడా ఎయిర్‌పోర్టులకు సమీపంలో ఉన్న ఇళ్ల ధరలు ఏకంగా 70 నుంచి 120 శాతం వరకు పెరిగాయి. స్క్వేర్ యార్డ్ అనే రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ ఈ విషయం తెలిపింది. ఈ ప్రాంతాల్లో గత నాలుగేళ్లలో ఇళ్లు, ఫ్లాట్లతో పాటు ఇళ్ల స్థలాల ధరలూ ఇదే స్థాయిలో పెరిగాయి. అయితే ఇదే సమయంలో ఆయా నగరాల్లోని ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల ధరల పెరుగుదల 45 నుంచి 93 శాతం వరకు పెరిగాయి.

## ఏటా 10,000 మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యం

**కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్**

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): దేశంలోని పోర్టుల ద్వారా వచ్చే 20 ఏళ్ల కాలంలో ఏటా 10,000 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ వెల్లడించారు. సోమవారం నాడిక్కడ బిమ్స్‌టెక్ సదస్సును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని టాప్ 30 పోర్టులలో భారత్‌కు చెందిన రెండు పోర్టులు ఉన్నాయన్నారు. ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారానే సముద్ర రవాణాలో ప్రగతి సాధించగలుగుతామని మంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం షిప్పింగ్ ఎక్సలెన్స్ సెంటర్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. క్రూయిజ్ టూరిజం, కోస్టల్ ఎకనామిక్ జోన్లు వంటివి అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. సదస్సుకు బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌ల్యాండ్ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జల రవాణా శాఖ సహాయ మంత్రి శాంతన్ ఠాకూర్, బిమ్స్‌టెక్ జనరల్ సెక్రటరీ ఇంద్రమణి పాండే, విశాఖ ఎంపీ శ్రీభరత్, విశాఖ పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు పాల్గొన్నారు.

**రూ.320 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన:** విశాఖపట్నం పోర్టులో రూ.320 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు మంత్రి శర్బానంద సోనోవాల్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కోస్టల్ షిప్పింగ్, క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

# స్పోర్ట్స్

## నాయర్‌కు ఇక నో?!

**మూడు టెస్ట్‌ల్లోనూ విఫలం**
**సాయి సుదర్శన్‌కు చాన్స్?**





సాయి సుదర్శన్

న్యూఢిల్లీ : దేశవాళీ పోటీల్లో పరుగుల వరద పారిస్తుండడంతో వయసు (34) కూడా చూడకుండా అవకాశాలిస్తే వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్‌తో ప్రస్తుత సిరీస్‌లోని మూడు టెస్టుల్లో వరుసగా 0, 20, 31, 26, 40, 14 స్కోర్లతో కనీసం ఒక్క ఫిఫ్టీ కూడా చేయలేకపోయాడు. 22 కంటే తక్కువ సగటుతో మూడు టెస్ట్‌ల్లో కలిపి 131 రన్స్ మాత్రమే చేశాడు. పైగా..బ్యాటింగ్ టెక్నిక్‌లో లోపాలు లేకపోలేదు. ఇవన్నీ చూస్తుంటే వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ తన కెరీర్‌లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడేసినట్టే కనిపిస్తోంది. ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన కరుణ్..ఇంగ్లండ్ పర్యటనను ప్రశంసనీయ రీతిలోనే ఆరంభించాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయడం ద్వారా టెస్ట్ తుది జట్టులో తనకు చోటు కల్పించక తప్పని పరిస్థితి కల్పించాడు. కానీ పేలవ ప్రదర్శనతో సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. భారత టెస్ట్ జట్టు భావి ఆటగాడిగా విశ్లేషకులు అంచనా వేస్తున్న 21 ఏళ్ల సాయి సుదర్శన్‌కు నాలుగో టెస్ట్‌లో అవకాశం ఇవ్వడమే సబబని మాజీ సెలెక్టర్ దేవంగ్ గాంధీ, మాజీ కీపర్ దీప్‌దాస్ గుప్తా అభిప్రాయపడ్డారు.

## టైటిల్‌పై సాత్విక్ జోడీ గురి

**జపాన్ ఓపెన్**



టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌పై భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి గురి పెట్టింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు టోర్నీల్లో సెమీస్ చేరిన సాత్విక్ జోడీ టైటిల్ సాధించలేకపోయింది. అయితే మంగళవారం నుంచి జరుగనున్న ఈ టోర్నీతో ఆ లోటును భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, చాలా కాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, పీవీ సింధు సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత రామ్‌రాజ్, డబుల్స్‌లో హరిహరన్-రుబాన్ కుమార్, కవిప్రియ-సిమ్రాన్ సింగీ, రుతుపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలోకి దిగుతున్నాయి.

## ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్



హైదరాబాద్: ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తమ కొత్త బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించుకుంది. న్యూజిలాండ్ మాజీ పేసర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ స్థానంలో వరుణ్‌ను తమ కోచింగ్ బృందంలోకి ఎస్ఆర్‌హెచ్ తీసుకుంది. 2011 నుంచి 2015 మధ్య వరుణ్ 9 టెస్టులు, 9 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో వరుణ్ చివరిగా ఆడాడు.

## ఆసీస్‌కు ఆధిక్యం

**విండీస్‌తో మూడో టెస్టు**

కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టు (డే/నైట్)లో ఆస్ట్రేలియాకు 82 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో బ్యాటింగ్ కొనసాగించిన వెస్టిండీస్ 143 పరుగులకు కుప్పకూలింది. క్యాంప్‌బెల్ (36) టాప్ స్కోరర్. బోలాండ్‌కు మూడు.. కమిన్స్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 99 పరుగులు చేసింది. దీంతో ఓవరాల్‌గా 181 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. గ్రీన్ (42 బ్యాటింగ్) మాత్రమే రాణించాడు. అల్జారికి మూడు, షామర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## దక్షిణాఫ్రికా బోణీ

**ముక్కోణపు టీ20 సిరీస్**

హరారే: జింబాబ్వే, న్యూజిలాండ్‌తో ముక్కోణపు టీ20 టోర్నీలో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సఫారీలు ఐదు వికెట్లతో జింబాబ్వేను ఓడించారు. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 141/6 స్కోరు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 15.5 ఓవర్లలో 142/5 స్కోరు చేసి నెగ్గింది.

## సినర్, అల్కారజ్ ర్యాంకులు పదిలం

*లండన్: డబ్ల్యూటీఏ తాజా ర్యాంకింగ్స్‌లో.. వింబుల్డన్ విజేత సినర్, రన్నరప్ అల్కారజ్‌లే తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. 12వేల ర్యాంకింగ్ పాయింట్లతో సినర్ నెం.1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 3,430 పాయింట్లతో అల్కారజ్ రెండో స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. జొకోవిచ్ తన ఆరో స్థానాన్ని దక్కించుకున్నాడు. డబుల్స్‌లో భారత స్టార్ యుకీ బాంబ్రీ 29వ ర్యాంక్‌లో ఉన్నాడు.*

## ప్రీ క్వార్టర్‌ఫైనల్లో హారిక

బటూమి (జార్జియా): భారత గ్రాండ్ మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేష్ బాబు ఫిడే మహిళల వరల్డ్ కప్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. సోమవారం జరిగిన టైబ్రేకర్‌లో స్ట్రవోలా (గ్రీస్)పై హారిక, కరీసా (అమెరికా)పై వైశాలి విజయం సాధించి నాలుగో రౌండ్‌కు చేరారు. మరో జీఎం వంతిక అగర్వాల్ టైబ్రేకర్‌లో లగ్నో చేతిలో ఓడిపోయింది.

## ఉత్కంఠ పోరులో.. లార్డ్స్ చేజారె!



ఇంగ్లండ్ ఆటగాళ్ల విజయహేల

**పోరాడి ఓడిన భారత్**
**రెండో ఇన్నింగ్స్‌లో 170 ఆలౌట్**
**22 పరుగులతో ఇంగ్లండ్ విజయం**
**జడేజా అజేయ అర్ధసెంచరీ**



జడేజా (61 నాటౌట్)



***ఆహా.. ఇది కదా టెస్టు క్రికెట్ మజా అంటే.. టీ20 జోరులో ఐదు రోజుల ఆటను బోరింగ్‌గా ఫీలయ్యే నేటి తరానికి విఖ్యాత లార్డ్స్ మైదానంలో భారత్ సాగించిన పోరాటాన్ని చూపాల్సిందే.. 193 పరుగుల ఛేదనలో 112 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన గడ్డు స్థితిలో జడేజా వీరోచితంగా నిలబడిన తీరు అపూర్వం. మరో ఎండ్‌లో బుమ్రా, సిరాజ్ ఏపాటి క్రీజులో నిలుస్తారులే అని అంతా భావించినా.. చక్కటి వ్యూహంతో జడేజా వీరి అండతోనే భారత్ పోరాటాన్ని మరో 35 ఓవర్లపాటు కొనసాగించి టెస్టుపై ఆశలు రేపాడు. కానీ ఆఖరి సెషన్ ఆరంభంలో విజయానికి 22 పరుగుల దూరంలో భారత్ అద్వితీయ సమరానికి చెక్ పడింది. తొలి సెషన్‌లో నాలుగు కీలక వికెట్లతో దెబ్బతీసి పైచేయి సాధించిన ఇంగ్లండ్ చివరికి మూడో టెస్టును దక్కించుకుంది.***

**లండన్:** ఇంగ్లండ్‌తో ఉత్కంఠ భరితంగా ముగిసిన మూడో టెస్టులో టీమిండియా పోరాటం ఫలితాన్నివ్వలేదు. టెయిలెండర్ల అండతో విజయం కోసం పట్టు వదలకుండా ప్రయత్నించినా దురదృష్టం వెంటాడింది. ఫలితంగా 193 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన గిల్ సేన ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు ఆలౌటైంది. దీంతో 22 పరుగుల తేడాతో గట్టెక్కిన ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. జడేజా (181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 61 నాటౌట్), రాహుల్ (39) మాత్రమే రాణించారు. స్టోక్స్, ఆర్చర్‌లకు మూడేసి, కార్స్‌కు రెండు వికెట్లు దక్కాయి.ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387, భారత్ 387 పరుగులు సాధించగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 రన్స్ చేసింది. స్టోక్స్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

### వణికించిన ఆర్చర్

58/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు ఛేదన ఆరంభించిన భారత జట్టు రాహుల్, పంత్ (9) బ్యాటింగ్‌పైనే ఆశలు పెట్టుకుంది. కానీ విజయం కోసం మరో 135 పరుగులు కావాల్సి ఉండగా, అటు ఇంగ్లండ్ పేసర్ల సవాల్‌ను వీరితోపాటు ఇతర బ్యాటర్లు కూడా సరిగ్గా ఎదుర్కోలేకపోయారు. ఫలితంగా తొలి సెషన్ ముగిసే సరికి 112/8 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. రాహుల్, పంత్ క్రీజులో నిలిస్తే గెలుపు సులువే అని అంతా భావించారు. కానీ ఈ జోడీ 18 బంతుల తేడాతో పెవిలియన్‌కు చేరింది. వేలి నొప్పితో బాధపడుతున్న పంత్.. ఆర్చర్ పేస్‌ను ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. అయితే తన ఓవర్లలోనే రెండు ఫోర్లు బాదినా ఓ అద్భుత బంతికి బౌల్డయ్యాడు. ఇక కాసేపటికే కీలక రాహుల్‌ను స్టోక్స్ ఎల్బీ చేయగా, తర్వాతి ఓవర్‌లో సుందర్‌ను సూపర్ రిటర్న్ క్యాచ్‌తో ఆర్చర్ అవుట్ చేశాడు. ఇలా తొలి గంట ఆటలోనే మూడు వికెట్లు కోల్పోయి 82/7 స్కోరుతో నిలిచింది. ఈ స్థితిలో చివరి స్పెషలిస్ట్ బ్యాటర్లు జడేజా-నితీశ్ పట్టు వదలకుండా క్రీజులో నిలిచి బౌలర్లను విసిగించారు. చివరి ఓవర్‌లో నితీశ్‌ను పేసర్ వోక్స్ అవుట్ చేయడంతో 112/8తో జట్టు బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో స్టోక్స్ వరుసగా 9 ఓవర్లు వేయడం విశేషం.

### అదిరే పోరాటంతో..

లక్ష్యం 81 పరుగులు.. ఉన్నవి రెండే వికెట్లు. రెండో సెషన్ సమయానికి గెలిచేందుకు భారత్ ముందున్న పరిస్థితి ఇది. అయితే అనూహ్యంగా బుమ్రా (5), సిరాజ్ (4)ల నుంచి జడేజాకు అద్భుతమైన సహకారం లభించింది. ఓవర్‌లో నాలుగు నుంచి ఐదు బంతులు తానే ఆడడం.. చివరి బంతిని వీరికి వదిలేసే ప్లాన్‌తో జడ్డూ బ్యాటింగ్ సాగించాడు. వోక్స్ ఓవర్‌లో జడేజా ఎల్బీ అయినా రివ్యూ ద్వారా బతికిపోయాడు. బుమ్రాను స్టోక్స్ అవుట్ చేయడంతో తొమ్మిదో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి వికెట్ మిగిలి ఉండడంతో ఈ సెషన్‌ను మరో అర్ధగంట పాటు పొడిగించారు. అయినప్పటికీ ఇంగ్లండ్ పేసర్ల బంతులను కాచుకున్న జడ్డూ-సిరాజ్ జోడీ వికెట్‌ను మాత్రం కోల్పోలేదు. జడ్డు ఎక్కువగా తనే స్ట్రయికింగ్ వచ్చేలా చూసుకున్నాడు. చివరకు 150 బంతుల్లో తన కెరీర్‌లోనే నెమ్మదైన అర్ధసెంచరీని సైతం పూర్తి చేశాడు. ఇక విజయానికి 30 పరుగుల దూరంలో జట్టు టీ బ్రేక్‌కు వెళ్లింది. కానీ ఆ తర్వాత భారత్ పోరాటం మరో ఐదు ఓవర్లకే పరిమితమైంది. స్పిన్నర్ బషీర్ ఓవర్‌లో సిరాజ్ ఐదో బంతిని బ్యాక్‌ఫుట్‌తో డిఫెండ్ చేశాడు. కానీ కింద పడగానే బంతి అతడి ప్యాడ్స్ పక్కనుంచి లెగ్ స్టంప్‌ను తాకింది. సిరాజ్ గమనించేలోపే బెయిల్స్ కూడా కిందపడడంతో తను షాక్‌తో క్రీజులో కుప్పకూలగా.. అటు స్టోక్స్ సేన సంబరాలు మిన్నంటాయి.



సిరాజ్ అవుటయ్యాడిలా..

### స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387; భారత్ తొలి ఇన్నింగ్స్: 387; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 192.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (ఎల్బీ) స్టోక్స్ 39; కరుణ్ (ఎల్బీ) కార్స్ 14; గిల్ (ఎల్బీ) కార్స్ 6; ఆకాశ్ (బి) స్టోక్స్ 1; పంత్ (బి) ఆర్చర్ 9; జడేజా (నాటౌట్) 61; సుందర్ (సి అండ్ బి) ఆర్చర్ 0; నితీశ్ (సి) స్మిత్ (బి) వోక్స్ 13; బుమ్రా (సి-సబ్) సామ్ కుక్ (బి) స్టోక్స్ 5; సిరాజ్ (బి) బషీర్ 4; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 74.5 ఓవర్లలో 170 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58, 5-71, 6-81, 7-82, 8-112, 9-147, 10-170; **బౌలింగ్:** వోక్స్ 12-5-21-1; ఆర్చర్ 16-1-55-3; స్టోక్స్ 24-4-48-3; కార్స్ 16-2-30-2; రూట్ 1-0-1-0; బషీర్ 5.5-1-6-1.

**1** లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో ఎక్కువ సార్లు (4) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన స్టోక్స్

**2** లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్‌లోనూ 50+ స్కోర్లు సాధించిన రెండో భారత బ్యాటర్‌గా జడేజా. 1952లో వినూ మన్కడ్ ఈ ఫీట్ సాధించాడు.

**3** ఇంగ్లండ్‌లో భారత్ తరఫున వరుసగా నాలుగు 50+ స్కోర్లు సాధించిన మూడో బ్యాటర్‌గా జడేజా. పంత్ (5), గంగూలీ (4) ముందున్నారు.

### సిరాజ్‌కు జరిమానా

పేసర్ మహ్మద్ సిరాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. అలాగే అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చారు. నాలుగో రోజు ఆటలో డకెట్ వికెట్ తీసిన ఆనందంలో అతడు దూకుడుగా వ్యవహరించాడు. డకెట్ మొహం దగ్గరికి వెళ్లి అతడి భుజాన్ని ఢీకొట్టడం ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధం కావడంతో రెఫరీ ఈ నిర్ణయం తీసుకున్నారు.



# గోడ దూకిన జమ్మూకశ్మీర్ సీఎం!


## కశ్మీర్ అమరవీరుల కార్యక్రమానికి ఎల్జీ అనుమతి నిరాకరణ.. ఆంక్షల మధ్య శ్మశాన వాటికకు ఒమర్

» ముఖ్యమంత్రిని అడ్డుకున్న పోలీసులు

» గోడెక్కి లోపలికి వెళ్లి.. నివాళులు

శ్రీనగర్, జూలై 14: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 1931 జూలై 13న జరిగిన ఘటనలో చనిపోయిన అమరవీరులకు నివాళులర్పించే విషయంలో వివాదం రేగింది. కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్ వర్సెస్ జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అనేలా పరిస్థితులు తలెత్తాయి. గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు నౌహట్టాలోని 'మజర్ ఏ శుహదా' శ్మశానవాటికలోని సమాధుల వద్దకు నేతలు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. అమరవీరుల దినం నిర్వహించకుండా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నేతలను ఆదివారం హౌస్ అరెస్టు చేశారు. ఒమర్ అబ్దుల్లాను ఇంటి నుంచి బయటకు రాకుండా చేశారు. శ్మశానం గేటుకు కూడా తాళాలు వేశారు. అయితే సోమవారం ఎట్టకేలకు ఆంక్షలను ధిక్కరించి, ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన సీఎం.. శ్మశానవాటిక వద్దకు వెళ్లారు. అక్కడ భద్రతా సిబ్బంది ఆయన్ను అడ్డుకోవడంతో.. క్యాబినెట్ మంత్రులతో సహా గోడ దూకి లోపలికి వెళ్లారు. అమరవీరుల సమాధుల వద్ద నివాళులర్పించారు. ఈ వీడియోను ఒమర్ అబ్దుల్లా 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "1931 జూలై 13 నాటి ఘటన అమరవీరులకు నివాళులు అర్పించాం. 'ఎన్నిక కాని ప్రభుత్వం' నన్ను అడ్డుకొనేందుకు ప్రయత్నించి, నౌహట్టా చౌక్ నుంచి నడిచి వెళ్లేలా చేసింది. గేటును బ్లాక్ చేయడంతో గోడ దూకాల్సి వచ్చింది. నన్ను అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. కానీ నన్ను ఈ రోజు ఆపలేకపోయారు' అని పేర్కొన్నారు. కేంద్రం తీరుపై మండిపడ్డారు. 'నేనేమీ చట్టవిరుద్ధంగానో, అక్రమంగానో వ్యవహరించలేదు. చట్ట పరిరక్షకులమని చెప్పుకుంటున్న వారు నన్ను ఏ చట్టం ప్రకారం అడ్డుకున్నారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కశ్మీర్ చరిత్రలో 1931 జూలై 13న జరిగిన ఘటనను కీలకంగా చెబుతుంటారు. ఆ రోజున మహారాజా హరిసింగ్‌కు వ్యతిరేకంగా శ్రీనగర్ జైలు బయట ఆందోళన చేస్తున్న అబ్దుల్ ఖాదిర్ మద్దతుదారులపై డోగ్రా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 22 మంది చనిపోయారు. నాటి ఘటనను స్మరించుకుంటూ ఏటా జూలై 13న తేదీన అమరవీరుల దినోత్సవం జరుపుతున్నారు.

## లోకం తీరు




## బిహార్‌లో 35.5 లక్షల ఓట్ల తొలగింపు?

పట్నా, జూలై 14: బిహార్‌లో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కారణంగా 35.5 లక్షల మంది పేర్లను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈసీ ఇచ్చిన గణాంకాల ఆధారంగా పార్టీలు ఈ అంచనాకు వస్తున్నాయి. ఇంతవరకు 6.6 కోట్ల మంది ఓటర్లు పేరు నమోదు పత్రాలను సమర్పించారని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇది మొత్తం ఓటర్లలో 88.18 శాతానికి సమానమని తెలిపింది. ఫారాల సమర్పణకు ఈ నెల 25 వరకు సమయం ఉందని, ఆ తరువాత జాబితాలను ప్రచురిస్తామని వివరించింది. 12.5 లక్షల మంది అంటే 1.59 శాతం మంది ఓటర్లు చనిపోయారని, వారి పేర్లను జాబితాల నుంచి తొలగిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. మరో 17.5 లక్షల మంది అంటే 2.2 శాతం మంది బిహార్ నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారి పేర్లను కూడా తీసివేస్తామని పేర్కొంది. ఇంకో 5.5 లక్షల మంది అంటే 0.73 శాతం మంది పేర్లు రెండు చోట్ల ఉన్నాయని, వాటిని కూడా మార్చుతామని వివరించింది. ఈ లెక్కన 35.5 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉంది. ఇది మొత్తం ఓటర్లలో 4.5 శాతానికి సమానమని తేలింది. ఓటర్ల జాబితాల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ జాతీయుల పేర్లు ఉండడంతో వాటిని కూడా తొలగించాలని నిర్ణయించింది. భారీగా ఓటర్లను తొలగించడంపై విపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 1 శాతం ఓట్లు తొలగించినా అది 3,200 ఓట్లను తీసివేసినట్టవుతుందని తెలిపారు. ఓటింగ్ సరళిపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఇప్పుడు దాదాపు 5 శాతం మేర ఓట్లు తొలగించే అవకాశం ఉండడంతో దాని ప్రభావం మరింతగా ఉంటుందని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయి.

## 'డ్రాగన్' అన్‌డాకింగ్ విజయవంతం

» 18 రోజుల తర్వాత నేడు భూమిపైకి శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ, జూలై 14: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా.. 18 రోజుల తర్వాత భూమికి తిరుగు ప్రయాణమయ్యారు. శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు మంగళవారం భూమిపైకి చేరుకోనున్నారు. ఐఎస్ఎస్ నుంచి నలుగురు వ్యోమగాముల బృందాన్ని తీసుకొస్తున్న డ్రాగన్ వ్యోమనౌక.. అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అక్కడి నుంచి దాదాపు 22 గంటల ప్రయాణం అనంతరం ఈ వ్యోమనౌక మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగనుంది. సోమవారం మధ్యాహ్నం 2.37 గంటలకు కమాండర్ పెగ్గీ విట్సన్, మిషన్ పైలట్ శుభాన్షు శుక్లా, మిషన్ స్పెషలిస్టులు స్లావోజ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబోర్ కాపు.. ఐఎస్ఎస్ నుంచి 'డ్రాగన్'లోకి ప్రవేశించారు. కాగా, ఐఎస్ఎస్‌లో ఉన్న నాసా బృందం ఆదివారమే వీరికి వీడ్కోలు వేడుక నిర్వహించింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాన్షు బృందం గత నెల 25న స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్‌లో అంతరిక్షంలోకి బయల్దేరింది. 28 గంటల ప్రయాణం అనంతరం ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. ఈ బృందం అక్కడే 18 రోజులుండి పలు ప్రయోగాలు చేసింది.

## వీసా వచ్చినా అమెరికాలో గ్యారెంటీ ఏమీ లేదు

» రూల్స్ ఉల్లంఘిస్తే వెనక్కి పంపే ముప్పు.. ఎంబసీ స్పష్టం

న్యూఢిల్లీ, జూలై 14: అమెరికా వీసాలు పొందిన వారికి, దరఖాస్తుదారులకు ఇక్కడి ఆ దేశ రాయబార కార్యాలయం కఠిన సూచనలు చేసింది. వీసా వస్తే అంతా ముగిసినట్టు కాదని, అనంతరం కూడా నిరంతర తనిఖీలు ఉంటాయని స్పష్టం చేసింది. వీసాపై అమెరికా వెళ్లిన వారిని అక్కడి అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని తెలిపింది. అమెరికా చట్టాలు, వీసా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా, లేదా అన్నదాన్ని గమనిస్తుంటారని, ఒకవేళ ఉల్లంఘించినట్టు తేలితే వెంటనే తిప్పి పంపించివేస్తారని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. వీసా లభించినంత మాత్రాన అమెరికాలో శాశ్వత ప్రవేశానికి, శాశ్వత నివాసానికి గ్యారెంటీ లభించినట్టు కాదని విద్యార్థులు, ఉద్యోగార్థులకు స్పష్టం చేసింది. దరఖాస్తుల్లో తప్పుడు వివరాలు పేర్కొన్నా, తగిన అనుమతులు లేకుండా ఉద్యోగాలు చేసినా వీసాలు రద్దు చేసి, తిప్పి పంపిస్తారని వివరించింది. డీఎస్-160 వీసా దరఖాస్తులో గత అయిదేళ్లలో ఉపయోగించిన అన్ని సామాజిక మాధ్యమాల యూజర్‌నేమ్‌లను రాయాల్సి ఉంటుందని తెలిపింది. ఎఫ్, ఎం, జె నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసిన వారు తమ సామాజిక మాధ్యమాల అకౌంట్ల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్‌కు మార్చాలని సూచించింది. వాటిని పరిశీలించిన తరువాత వారిని దేశంలోకి రానీయవచ్చా, లేదా అని అమెరికాలోని అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

## ఉచిత వీసా సమకూరిస్తే విదేశీ కొలువులకు సై

న్యూఢిల్లీ, జూలై 14: ఉచితంగా వీసా, నియామకం, అవసరమైన శిక్షణ సమకూరిస్తే విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు దేశంలో ప్రతి పదిమంది యువతలో తొమ్మిది మందికి పైగా (92%) ఆసక్తిగా ఉన్నట్టు ఓ సర్వేలో వెల్లడైంది. సరైన మార్గదర్శకం లేకపోవడం, ఇటీవల కాలంలో వలస ప్రక్రియలో మోసాలు పెరగడం, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, విశ్వసనీయ వనరులు పరిమితంగా ఉండటం.. యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని ఏఐ ఆధారిత రిక్రూట్‌మెంట్ సంస్థ టెర్న్ గ్రూప్ వెల్లడించింది. విదేశాల్లో ఉద్యోగాలకు ఎక్కువగా డిమాండ్ ఉన్న ఇంజనీరింగ్, లాజిస్టిక్స్, హెల్త్‌కేర్ రంగాలకు చెందిన 2,500 మంది అభ్యర్థుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ఈ సర్వే ప్రకారం 57 శాతం మందికి దరఖాస్తు ప్రక్రియ ఎలా ప్రారంభించాలో తెలియదు. నమ్మదగని ఏజెంట్లు, విదేశీ నియామక సంస్థలు పెరిగిపోతుండటంతో విదేశాల్లో పనిచేయడానికి 34.60 శాతం మంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థుల ఆత్మహత్యలపై నివేదికివ్వండి: సుప్రీం


న్యూఢిల్లీ, జూలై 14: ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రస్తుత యథాతథ స్థితిని తమకు నివేదించాలని పశ్చిమబెంగాల్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉన్నత విద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం పట్ల జస్టిస్‌లు జె.బి.పార్దీవాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న న్యాయవాది.. అపర్ణ భట్ సంబంధిత శాఖ సహకారాన్ని కోరారు. 2023 మే 4న ఐఐటీ - ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే, మే 8న కేసు నమోదుకు దారి తీసిన పరిస్థితులతోపాటు దర్యాప్తుపై తాజా పరిస్థితిని తెలియజేయాలని పశ్చిమ బెంగాల్ పోలీసులను కోరింది.

## 50 రోజుల్లోగా యుద్ధం ఆపకపోతే టారిఫ్ శిక్ష

» రష్యాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జూలై 14: ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగిస్తున్నందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 50రోజుల్లోగా యుద్ధం ఆపకపోతే రష్యాపై టారిఫ్‌లు విధించి శిక్షిస్తా న్నారు. "పుతిన్ విషయంలో నేను చాలా నిరాశచెందాను. అతను మాట మీద నిలబడే వ్యక్తి అనుకున్నాను. అందంగా మాట్లాడతాడు కానీ రాత్రి వేళల్లో ప్రజలపై బాంబులు వేస్తాడు. అది మాకు నచ్చడం లేదు" అని చెప్పారు. ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడుల నేపథ్యంలో ట్రంప్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక ఉక్రెయిన్‌కు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థను పంపుతున్నట్లు ట్రంప్ నిర్ధారించారు. అది ఉక్రెయిన్‌కు చాలా అవసరం అయినందువల్ల పంపుతున్నట్లు ఆయన చెప్పారు. అయితే ఎన్ని పంపించాలనేదానిపై నిర్ణయం తీసుకోలేదని, ఉక్రెయిన్ రక్షణకు వాటి అవసరం ఉంది కాబట్టి కొన్ని పంపుతున్నామని వెల్లడించారు. తాము పంపే వాటికి ఉక్రెయిన్ వంద శాతం డబ్బు చెల్లిస్తుందని, అది తమ వ్యాపారమని అన్నారు.

## అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధం: పన్నీర్ సెల్వం



చెన్నై, జూలై 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా అన్నాడీఎంకేపై తిరుగుబాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఓ మెట్టు దిగొచ్చారు. తనకెలాంటి పదవులు వద్దని, ఎలాంటి షరతుల్లేకుండానే అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధమని ప్రకటించారు. పన్నీర్‌సెల్వం, జయ నెచ్చెలి శశికళను పార్టీలో చేర్చుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ససేమిరా అంటున్న విషయం తెలిసిందే. దీనికితోడు బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఆయన.. ఎన్డీఏ నేతృత్వంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అదేసమయంలో సెప్టెంబరు 4న తన అనుయాయులతో మదురైలో మహానాడు జరిపేందుకు పన్నీర్‌సెల్వం సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తన వెంట ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు, కొద్దిమంది సీనియర్లతో చెన్నైలో భేటీ అయిన పన్నీర్‌సెల్వం.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే రెండు వర్గాలుగా చీలిపోవడం వల్ల కార్యకర్తలు అయోమయంలో ఉన్నారని, తామంతా ఒకే నాయకత్వం కింద పని చేస్తే బావుంటుందని కోరుకుంటున్నారని తెలిపారు. వారి కోరికను మన్నించి, తాను అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

# ఇక ఇంధన మీటల తనిఖీలు

## విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశాలు.. ఈ నెల 21లోపు నివేదికలివ్వాలని వెల్లడి



న్యూఢిల్లీ/దుబాయ్, జూలై 14: అహ్మదాబాద్ విమానప్రమాదం నేపథ్యంలో బోయింగ్ విమానాలను వినియోగిస్తున్న ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంజన్లకు ఇంధనాన్ని సరఫరా చేసే మీట(ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్)లను తనిఖీ చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21లోపు తనిఖీలను పూర్తిచేసి నివేదికను సమర్పించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. బోయింగ్ 737, 787(8/9/10) డ్రీమ్ లైనర్లలో తనిఖీలు చేయాలని, ఏవైనా మార్పులు చేసి ఉంటే.. ఆ వివరాలను కూడా నివేదికలో తెలియజేయాలని పేర్కొంది. అహ్మదాబాద్‌లో బోయింగ్-787 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదానికి ఇంధన మీట 'రన్' స్థితి నుంచి 'కటాఫ్'కు మారడమే కారణమని దర్యాప్తులో తేలిన విషయం తెలిసిందే..!

### మానవ తప్పిదమే

ఎయిరిండియా విమాన ప్రమాదం అతిపెద్ద మానవ తప్పిదమే అని విమానయాన నిపుణుడు కెప్టెన్ మోహన్ రంగనాథన్ స్పష్టం చేశారు. పైలట్ల తప్పిదంపై వస్తున్న ఊహాగానాలను పైలట్ల సంఘాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. సోమవారం రంగనాథన్ వెల్లడించిన అభిప్రాయం సంచలనంగా మారుతోంది. "ప్రాథమిక నివేదికలో తొలుత ఒక ఇంధన మీట ఫెయిల్ అయినట్లు తేలింది. ఆ తర్వాత సెకను వ్యవధిలోనే రెండోది కూడా ఫెయిలయ్యింది. విద్యుత్తు సరఫరా వైఫల్యంతో మీటలు వాటంతట అవే కదలవు. పైలట్ తన చేతితో లాక్‌ను పైకి లేపి.. 'రన్' నుంచి 'కటాఫ్' లేదా.. 'కటాఫ్' నుంచి 'రన్' మోడ్‌కి మార్చాలి. ఇది ఆటోమేటిక్‌గా జరిగే వ్యవహారం కానేకాదు" అని ఆయన వివరించారు. సెకన్ వ్యవధిలోనే రెండు ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం.. కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో పైలట్ల సంభాషణ అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. "విమానంలో మెకానికల్ లేదా సాఫ్ట్‌వేర్ లోపం ఉంటే.. వెంటనే ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చేది" అని అభిప్రాయపడ్డారు.

### అనేక ప్రశ్నలు: ఎయిరిండియా సీఈవో

ప్రమాదంపై ప్రాథమిక నివేదిక అనేక ప్రశ్నలను ఉత్పన్నం చేస్తోందని ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ అన్నారు. ఏఏఐబీ నివేదిక కొన్ని విషయాల్లో స్పష్టతనిచ్చినా.. మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోందని తమ సిబ్బందికి పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. "విమానంలో ఎలాంటి మెకానికల్, నిర్వహణ లోపాలు లేవు. ఇంధన నాణ్యత కూడా బాగుంది. టేకాఫ్‌లో ఎలాంటి అసాధారణ పరిస్థితులు కనిపించలేదు. పైలట్లకు ప్రీ-ఫ్లైట్ బ్రీత్-అనలైజర్ పరీక్షలు నిర్వహించాం. అందులో వారు పాసయ్యారు. వారికి అనారోగ్య సమస్యలేమీ లేవు. దర్యాప్తు కొనసాగుతుండగా.. వదంతులు వస్తుంటాయి. వాటిని పట్టించుకోకుండా.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం" అని ఆయన అన్నారు.

### ఎతిహాద్ అప్రమత్తం

దుబాయ్‌కి చెందిన దిగ్గజ విమానయాన సంస్థ ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ వద్ద ఉన్న బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానాల విషయంలో అప్రమత్తమైంది. ఎయిరిండియా విమాన ప్రమాదంపై వచ్చిన నివేదిక నేపథ్యంలో పలు చర్యలకు సిద్ధమైంది. ముఖ్యంగా తన వద్ద ఉన్న బోయింగ్-787 డ్రీమ్ లైనర్ విమానాల్లో ఇంధన మీటలను తనిఖీ చేస్తోంది. తమ పైలట్లకు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.

## గాల్లోకి ఎగిరిన కాసేపటికే కుప్పకూలిన విమానం

» లండన్‌లో ఘటన.. నలుగురి మృతి

లండన్, జూలై 14: లండన్ నుంచి నెదర్లాండ్స్‌లోని లెలిస్టాడ్‌కు బయల్దేరిన చిన్నపాటి విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న నలుగురు మృతిచెందారు. నెదర్లాండ్స్‌లోని జ్యూష్ ఏవియేషన్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ బీ200 సూపర్ కింగ్ విమానం లండన్‌కు తూర్పున 56కి.మీ దూరంలో ఉన్న సౌత్ ఎండ్ విమానాశ్రయం నుంచి ఆదివారం మధ్యాహ్నం గాల్లోకి ఎగిరిన కొన్ని సెకన్లకే కుప్పకూలింది.

## ఇక ప్రతి ఎంపీ పంచ్ కొట్టాల్సిందే

» లేదంటే అలవెన్స్‌లు కట్

న్యూఢిల్లీ, జూలై 14: వచ్చేవారం ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నుంచి లోక్‌సభ సభ్యులకు నూతన హాజరు వ్యవస్థ అమల్లోకి రానుంది. సమావేశాలకు హాజరయ్యే సభ్యులు 'పంచ్' నమోదు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు అన్ని రకాల అలవెన్సులు పొందేందుకు సభ్యులకు ఈ నూతన హాజరు వ్యవస్థను అమల్లోకి తెస్తున్నారని తెలుస్తోంది. సమావేశాలు జరుగుతున్నప్పుడు, ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సభ్యుల హాజరీ పెంచేందుకు ప్రతిపాదించిన నూతన అటెండెన్స్ విధానం అమలు పట్ల స్పీకర్ ఓం బిర్లా ఆసక్తిగా ఉన్నారని సమాచారం. కాగిత రహితంగా పార్లమెంట్‌ను మార్చేందుకు ఓం బిర్లా గతేడాది డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.

## నూనె, చక్కెర బోర్డులు పెట్టండి

» చిరుతిళ్లపై కేంద్ర ఆరోగ్యశాఖ సూచన

న్యూఢిల్లీ, జూలై 14: చిరుతిళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలు వంటి వాటిలో 'చక్కెర, నూనె బోర్డ్'లను ప్రదర్శించాలని సూచించింది. రోజువారీ తీసుకునే ఆహార పదార్థాల్లో ఉండే కొవ్వు, చక్కెర వంటి కీలక సమాచారాన్ని అందులో ప్రదర్శించాలని తెలిపింది. ఈ మేరకు గత నెల 21న ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్యసలీల శ్రీవాస్తవ అన్ని విభాగాలకు లేఖ రాశారు. లెటర్ హెడ్లు, ఎన్వలప్ కవర్లు, నోట్‌ప్యాడ్లు, ఫోల్డర్లు వంటి అధికారిక పత్రాలు, స్టేషనరీపై ఆరోగ్య సందేశాలను ముద్రించాలని లేఖలో తెలిపారు. పని ప్రదేశాల్లో పౌష్టికాహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

# ఆ పోస్టులు కలవరపరచడం లేదా?

## సోషల్‌మీడియాలో కంటెంట్‌పై ప్రభుత్వం కట్టడి ఉండాలి.. కానీ సెన్సార్ పద్ధతి సరికాదు

» భావస్వేచ్ఛను కొన్ని జాగ్రత్తలతో అనుభవించాలి.. స్వీయ నియంత్రణ కీలకం

» సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కేసులో సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 14 : భావ ప్రకటన, వ్యక్తీకరణ స్వేచ్ఛ విలువను పౌరులు తెలుసుకోవాలని, మాట్లాడేటప్పుడు స్వయం నియంత్రణను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అభ్యంతరకర పోస్టులను సోషల్ మీడియాలో నిరోధించేందుకు వీలుగా మార్గదర్శకాలు తెచ్చే యోచన చేస్తున్నామని తెలిపింది. 'ఈ పోస్టులు పౌరులను కలవరపరచడం లేదా?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టడి చేయాల్సిందేనని స్పష్టం చేసింది. హిందూ దేవతకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ట్వీట్‌లు పోస్టు చేసిన వ్యవహారంలో వజాహత్‌ఖాన్ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను గతనెల 9న పశ్చిమబెంగాల్‌లో అరెస్టు చేశారు. అప్పటికే ఆయనపై ఆ రాష్ట్రంతోపాటు ఆరు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీనిపై వజాహత్ ఖాన్ ఆ నెల 23న సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆయనకు జూలై 14(సోమవారం) వరకు చట్టపరచర్యల నుంచి రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఆ గడువు ముగియడంతో సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా శర్మిష్ఠ పనోలీ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌పై వజాహత్ ఖాన్ ఆరోపణలు చేశారు. "శర్మిష్ఠ ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా మతపరమైన వీడియోలు పెట్టడంపై నేను ఫిర్యాదు చేశాను. అయితే, అప్పటికే సోషల్ మీడియాలో నేను ట్వీట్ చేసిన వ్యాఖ్యలకుగాను నన్ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. నాపై పలు రాష్ట్రాలపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయండి. లేదంటే అన్ని కేసులను కలిపి విచారించండి." అని కోరారు. ఇదే సమయంలో జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. సోషల్‌మీడియాలో వ్యాపించిన విభజన ధోరణులను కట్టడి చేయాల్సిందేనన్నారు. అయితే, దీని అర్థం సెన్సార్‌ను అమలు చేయాలనేది కాదని, తాము స్వయం నియంత్రణల గురించి ఆలోచిస్తున్నామని తెలిపారు. "భావస్వేచ్ఛను పౌరులు అనుభవించాలనుకుంటే కొన్ని నియంత్రణలను వారు తమకు తాముగా పాటించాలి. ఇలా ఉల్లంఘనలకు పాల్పడరాదు." అని వ్యాఖ్యానించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (2) విధించిన నియంత్రణలు సరిగ్గానే ఉన్నాయన్నారు. "సోషల్ మీడియాలో పెట్టే కంటెంట్ విషయంలో తప్పనిసరిగా కొంత నియంత్రణ ఉండాలి. అటువంటి పోస్టులకు పౌరులు దూరంగా ఉండాలి. వాటిని షేర్ చేయడం, లైక్ చేయడం చేయరాదు" అని కోర్టు సూచించింది. వజాహత్ ఖాన్‌కు కల్పించిన రక్షణలను వచ్చే విచారణ వరకు పొడిగించింది.

## సీజేఐ గవాయ్‌కు అస్వస్థత.. ఢిల్లీ ఆసుపత్రిలో చేరిక

న్యూఢిల్లీ, జూలై 14: సీజేఐ జస్టిస్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆయన్ను ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఒకటి రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 12న ఆయన హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఆయన హాజరయ్యారు.

## జీవిత భాగస్వామి సంభాషణల రికార్డుల్ని సాక్ష్యంగా తీసుకోవచ్చు!

» వివాహసంబంధ కేసుల్లో దీనికి ఓకే

జీవిత భాగస్వామితో జరిపిన సంభాషణల రహస్య రికార్డులను వివాహసంబంధ కేసుల్లో సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పంజాబ్‌కు చెందిన ఓ భార్యాభర్తల కేసులో సోమవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. తొలుత భటిండాలోని ఫ్యామిలీకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చింది. తన భార్య తన మీద తీవ్రమైన వేధింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ.. అందుకు ఆధారంగా, ఆమెతో గతంలో జరిపిన ఫోన్ సంభాషణల ఆడియో రికార్డులున్న సీడీని కోర్టులో సమర్పించాడు భర్త. ఆ సీడీని సాక్ష్యంగా తీసుకోవటానికి ఫ్యామిలీ కోర్టు అంగీకరించింది. అయితే, ఫోన్ సంభాషణల రికార్డు వ్యక్తిగత గోప్యతకు భంగకరమని హైకోర్టు వాటిని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో, భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆడియో రికార్డుల్ని సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# నర్సు నిమిషను రక్షించడానికి.. 'బ్లడ్ మనీ' ఒక్కటే మార్గం!

» సుప్రీంకు 'సేవ్ నిమిష కౌన్సిల్' నివేదన

» ఎవరి ద్వారా మాట్లాడాలన్నదే ప్రశ్న: కేంద్రం



న్యూఢిల్లీ, జూలై 14: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియ (38)ను కాపాడేందుకు హత్యాపరిహార ధనం (బ్లడ్ మనీ) చెల్లించడం ఒక్కటే ఏకైక పరిష్కారమని 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' అనే సంస్థ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఆమె తల్లి ప్రస్తుతం యెమెన్‌లోనే ఉన్నారని.. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో ఓ సామాజిక కార్యకర్త ద్వారా మాట్లాడుతున్నారని వెల్లడించింది. పరిహార ధనం తీసుకోవడానికి హతుడి కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే నిమిష బయటపడే అవకాశం ఉంటుందని తెలిపింది. అయితే బ్లడ్ మనీ చెల్లింపు ప్రైవేటుగా జరగాల్సిన వ్యవహారమని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అన్నారు. ఆ డబ్బు తాము ఏర్పాటు చేసుకుంటామని నిమిష కుటుంబ సభ్యులు చెబుతున్నారని.. అయితే ఎవరితో మాట్లాడాలన్నదే ఇక్కడ ప్రశ్న అని తెలిపారు. ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వపరంగా చేయగలిగింది చాలా తక్కువని.. అయినా ఆమెను కాపాడేందుకు సాధ్యమైన మేర అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించారు. బుధవారం నిమిషకు మరణ దండన అమలు కానున్న సంగతి తెలిసిందే. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నిమిష.. 2017లో తన యెమెనీ వ్యాపార భాగస్వామిని హత్య చేశారన్న అభియోగాలపై 2020లో అక్కడ ఆమెకు మరణశిక్ష విధించారు. ప్రస్తుతం నిమిష ఆ దేశ రాజధాని సనాలోని జైలులో ఉన్నారు. ఆమెను రక్షించడానికి దౌత్య మార్గాల్లో కృషిచేయాల్సిందిగా భారత ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ హాజరయ్యారు. యెమెన్ ప్రస్తుతం హౌతీల పాలనలో ఉందని.. ఆ ప్రభుత్వాన్ని ఎవరూ దౌత్యపరంగా గుర్తించడం లేదని ఆయన తెలిపారు. మరణ శిక్ష అమలును కొంతకాలం సస్పెండ్ చేయడానికి వీలుందో లేదో కనుక్కునేందుకు ఆ ప్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కేంద్రం ఇటీవల లేఖ రాసిందని తెలిపారు. సాధ్యమైన అన్ని యత్నాలూ చేస్తున్నామని.. అక్కడ పలుకుబడి కలిగిన కొందరు షేక్‌లను కూడా రంగంలోకి దించామని వివరించారు.

## 2008లో యెమెన్‌కు..

నిమిష 2008లో యెమెన్ వెళ్లారు. రాజధాని సనాలో సొంత క్లినిక్ ఏర్పాటుచేసేందుకు 2015లో ఆ దేశస్థుడైన తలాల్ అబ్దో మహదీ సాయం తీసుకున్నారు. ఆ ఏడాది నిమిష నెల రోజుల సెలవుపై కేరళ వచ్చినప్పుడు మహదీ కూడా ఆమెతోపాటు వచ్చారు. ఆ తర్వాత అతడితో ఆమెకు విభేదాలు వచ్చాయి. తన పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోవడానికి 2017లో అతడికి నిమిష మత్తు ఇంజక్షన్ ఇచ్చిందని.. ఓవర్‌డోస్‌తో అతడు మరణించాడని ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమిష మరో నర్సు సాయంతో మృతదేహాన్ని ముక్కలుచేసి భూగర్భ ట్యాంకులో పడేసినట్లు యెమెనీ కోర్టు అధికారిక పత్రాలు చెబుతున్నాయి. దేశం వదిలి పారిపోతుండగా ఆమెను పట్టుకున్నారు. ట్రయల్ కోర్టు మరణ శిక్ష విధించింది. కాగా, నిమిష ప్రియను కాపాడేందుకు కేరళకు చెందిన సున్నీ ముస్లింల మతగురువు షేక్ అబూబకర్ అహ్మద్ ముస్లియార్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. 'ఇండియా గ్రాండ్ ముఫ్తీ' బిరుదు ఉన్న 94 ఏళ్ల అబూబకర్ యెమన్‌లో మతాధికారులతో చర్చించారు.



పోలవరం స్పిల్‌వే వద్ద వరద ఉధృతి

## గోదావరి తగ్గుముఖం

పోలవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఇప్పటి వరకు ఉప్పొంగిన గోదావరి సోమవారం సాయంత్రానికి శాంతించింది. భద్రాచలం వద్ద 23.90 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి చేరుకున్న 4,11,238 క్యూసెక్కుల అదనపు జలాలను జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు.

## జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ అజగేశన్‌కు డిమోషన్

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య సంస్థ (జీఆర్ఎంబీ) కీలక అధికారుల హోదాలను తారుమారు చేస్తూ బదిలీలు జరిగాయి. ప్రస్తుతం సంస్థ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న ఆర్.అజగేశన్‌పై చాలాకాలంగా సిబ్బందిని వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అజగేశన్ హోదాను మెంబర్ స్థాయికి తగ్గించి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం మెంబర్‌గా వ్యవహరిస్తున్న అళ్వే కోడియా స్థాయిని పెంచి మెంబర్ సెక్రటరీగా నియమించారు.

## ఏపీఎండీసీ ప్రాజెక్టులపై టాస్క్‌ఫోర్స్

» లేని పోస్టు... సీనియర్ జేడీకి చైర్మన్ బాధ్యతలు

ఏపీఎండీసీ చేపట్టనున్న నూతన ప్రాజెక్టుల పర్యవేక్షణ, పరిశీలన కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనులశాఖ సీనియర్ జాయింట్ డైరెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటయిన ఈ టాస్క్‌ఫోర్స్‌లో గనుల శాఖ డీడీ, ఏడీ, ఏపీఎండీసీ ఉపాధ్యక్షుడు(హెచ్ఓడీ ఎస్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ఏపీఎండీసీ చేపట్టే కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ప్లాన్ ఆమోదం, లీజుల మంజూరు, ఎల్ఓఐ, వర్క్ ఆర్డర్ జారీ తదితర పనులు వేగంగా అమలయ్యేలా చూడటం వంటి బాధ్యతలను టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. ఇదిలా ఉండితే, గనుల శాఖలో డైరెక్టర్, అదనపు డైరెక్టర్ ఉంటారు. ప్రస్తుతానికి గనుల శాఖకు రెగ్యులర్ డైరెక్టర్ లేరు. ఆ శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమారే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అదనపు డైరెక్టర్ సీనియర్ అధికారి ఉన్నారు. ఆ శాఖలో డైరెక్టర్ తర్వాత సీనియర్ పోస్టు ఇదే. ఇంత కీలకమైన టాస్క్‌ఫోర్స్‌లో అదనపు డైరెక్టర్‌కు బదులు సీనియర్ జేడీకి కీలక బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. గనుల శాఖలో జేడీ పోస్టు ఉంది కానీ సీనియర్ జేడీ పోస్టులేదు. మరి ఈ టాస్క్‌ఫోర్స్‌కు సీనియర్ జేడీని ఎక్కడి నుంచి తీసుకొస్తారనే చర్చ జరుగుతోంది.

## కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలు రెన్యువల్

కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలను రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 693 మంది లెక్చరర్ల సేవలు కొనసాగనున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11 నెలలపాటు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది.

## ర్యాంకర్లను సన్మానించిన మంత్రి లోకేశ్

నీట్ యూజీ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 19వ ర్యాంకు సాధించిన రాజమండ్రికి చెందిన డి.కార్తీక్‌రామ్ కిరీటిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. కార్తీక్‌రామ్‌తోపాటు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్, కంచుమర్తి ప్రణీత్ సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రిని కలిశారు. కాగా, నాగార్జున వర్సిటీ పరిధిలోని పలు కాలేజీల్లో చదివిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు జారీ కానందున ఐసెట్ కౌన్సెలింగ్ గడువును మరో వారం రోజులు పెంచాలని ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సర్టిఫికెట్లు రాకపోవడంతో చాలామంది విద్యార్థులు ఐసెట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయారని తెలిపింది. త్వరలో సర్టిఫికెట్లు జారీచేసే అవకాశం ఉన్నందున కౌన్సెలింగ్ గడువు పొడిగించాలని కోరింది.

## రాజధానికి ఇసుక కోసం కృష్ణానదిలో పూడికతీత

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో పూడిక తీయడం ద్వారా సీఆర్‌డీఏ పనుల కోసం ఇసుక సేకరించేందుకు రూ.286 కోట్లు మంజూరు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు టెండర్లు నిర్వహించేందుకు ఈ నెల 5న జరిగిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ సమావేశం ఆమోదం తెలిపింది. సీఆర్‌డీఏ ద్వారా పనులు నిర్వహించేందుకు అనుమతివ్వాలని మైనింగ్ శాఖను కోరనున్నారు. కొత్త ఇసుక విధానం, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ఈ పూడికతీత పనులు చేపట్టనున్నారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై సోమవారం వ్యవసాయ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపారు. 30 బృందాలతో ఏకకాలంలో దాడులు చేసి, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. సరైన రికార్డులు లేని సరుకును సీజ్ చేశారు.

## 4.09లక్షల టన్నుల తోతాపురి కొనుగోలు

చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో సోమవారం నాటికి 4.09లక్షల టన్నుల తోతాపురి మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రేడర్లు కొనుగోలు చేశారు. ప్రాసెసింగ్ యూనిట్లు కిలో రూ.8-10 చొప్పున, మండీలు, ర్యాంపుల్లో రూ.10 చొప్పున ధర పలికిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

## 362 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలు

రాష్ట్రవ్యాప్తంగా మరో 362 పీఏసీఎస్‌లకు ప్రభుత్వం అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ఈ నెల 30తో గడువు ముగియనున్న 351 పీఏసీఎస్‌లు, అక్టోబరు 10తో గడువు ముగియనున్న 11 పీఏసీఎస్‌లకు అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఏపీజీఈఏ అధ్యక్షుడికి విధుల మినహాయింపు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్‌లకు ప్రభుత్వం 'అథర్ డ్యూటీ' సౌకర్యం కల్పించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ సర్వీసెస్ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అక్రమ మద్యం కేసులో కాకాణికి రిమాండ్

గూడూరు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరులో మద్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. పీటీ వారెంట్ కింద సోమవారం పోలీసులు గోవర్ధన్‌రెడ్డిని తిరుపతి జిల్లా గూడూరు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయనను మళ్లీ నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు.

## 'రామాయపట్నం' అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ ఉక్కు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ భూములు, కొండలను 726 ఎకరాల విస్తీర్ణం మేర జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు మైనింగ్ కోసం అప్పగించేందుకు ఎన్‌వోసీ ఇస్తూ లింగసముద్రం తహసీల్దారు సీతామహాలక్ష్మీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ ఎన్‌వోసీ సమర్పించి ఐదు నెలలు గడవగా తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల సరిహద్దు మండలాల్లో 9.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐరన్ ఓర్ నిక్షేపాలున్నట్లు జియోగ్రాఫికల్ సర్వే అధికారులు గతంలోనే నిర్ధారించారు. ఈ క్రమంలో లింగసముద్రం మండలంలోని నాలుగు గ్రామాల్లో భూకేటాయింపులకు ఎన్‌వోసీ జారీచేశారు. మండల కేంద్రమైన లింగసముద్రంలో 19.78 ఎకరాలు, తిమ్మారెడ్డిపాలెంలో 150.76 ఎకరాలు, ఆర్‌ఆర్ పాలెంలో 21 ఎకరాలు, జంగంరెడ్డికండ్రికలో వివిధ సర్వే నంబర్లలో ఉన్న 423.33 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు, రైతులకు సంబంధించిన 111 ఎకరాల పట్టాభూములను, ఎర్రారెడ్డిపాలెంలో 3.46 ఎకరాలను జేఎస్‌డబ్ల్యూ ఐరన్ ఓర్ మైనింగ్‌కు అప్పగించేందుకు ఎన్‌వోసీ జారీచేశారు.

# 4 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని స్వాధీనం చేసుకొని, యువకులను అదుపులోకి తీసుకున్న సిబ్బంది

» మంగళగిరిలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

మంగళగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఈఎస్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు సోమవారం మంగళగిరిలో చేపట్టిన ఆకస్మిక దాడుల్లో నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని కుప్పురావు కాలనీ 11వ లైను ఎన్‌సీసీ రోడ్డులో నలుగురు యువకుల వద్ద ఈ గంజాయిని పట్టుకున్నారు. నిందితుల్లో పాతమంగళగిరి భద్రావతినగర్‌కు చెందిన మునగాల సురేంద్ర, కుప్పురావు కాలనీకి చెందిన రాచకొండ చిన్నా, ఇద్దరు మైనర్లు వున్నారు. గంజాయిని ఒడిశాలోని రాయగఢ్ నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులుగా ఇద్దరు మైనర్లు తమ స్నేహితుడు బొంగులూరి రవితో కలిసి ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చినట్టు నిర్ధారించారు. రవిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ అరుణకుమారి ఆదేశాలతో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈ.మారయ్యబాబు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

# బోధనాసుపత్రులకు 'జన ఔషధి' శాపం!



» రోగుల ప్రాణాలతో ఆటలు

» అర్హత లేని కంపెనీతో ఎంవోయూ

» టెండర్లు లేకుండానే స్థానిక కొనుగోళ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రోగిని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అనస్థీషియా(మత్తు) ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఆ ఇంజెక్షన్ కనిపించలేదు. ఆపరేషన్ థియేటర్, డ్రగ్ స్టోర్, ఫార్మసీ ఇలా ఎక్కడ వెతికినా అది లభించలేదు. దీంతో రోగిని థియేటర్‌లోనే ఉంచి మందుల సరఫరాదారుకి ఫోన్ చేసి ఇంజెక్షన్ తెప్పించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రుల్లో ఇటీవల జరిగిన ఈ ఘటన విస్మయం కలిగించింది. రాష్ట్రంలో చాలా భోధనాసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో స్థానికంగా ఔషధాలు కొనుగోలు చేయడం(లోకల్ పర్చేజ్) చాలా కీలకం. ప్రభుత్వాసుపత్రులకు అవసరమైన మందులను ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేస్తుంది. కానీ, కొన్ని సందర్భాల్లో మందుల సరఫరా ఆలస్యం అవుతుంది. ఈ ఆలస్యం వల్ల రోగులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశాఖ లోకల్ పర్చేజ్‌కు అవకాశం కల్పించింది. ఆస్పత్రులకు కేటాయించే బడ్జెట్‌లో 80 శాతం మేరకు మందులను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సరఫరా చేస్తారు. మిగిలిన 20 శాతం నిధులతో ఆస్పత్రుల సూపరింటెండెంట్లు స్థానికంగా కొనుగోలు చేసుకుంటారు. దీనికి కూడా టెండర్లు పిలిచి, ఎల్-1 వచ్చిన కంపెనీలకే ఆర్డర్లు ఇస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో శ్రీకాకుళం, కర్నూలు, విజయనగరంలో మాత్రమే టెండర్ ప్రక్రియలు పూర్తయ్యాయి. మిగిలిన చోట ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించిన పీఎంబీజేకే(ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు) నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇదే బోధనాస్పత్రులకు శాపంగా మారింది. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి టెండర్లు లేకుండా పీఎంబీజేకేల నుంచి స్థానికంగా మందులు కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సూపరింటెండెంట్లు కూడా పీఎంబీజేకే లైసెన్సు ఉన్న ఒక కంపెనీతో ఎంవోయు కుదుర్చుకున్నారు. అయితే, సదరు కంపెనీ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమవుతోంది. ఆస్పత్రుల నుంచి ఆర్డర్లు పెట్టిన తర్వాత నెల రోజులకు కూడా మందులు సరఫరా చేయలేకపోతోంది. ఇటు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు విఫలం కావడం... అటు ఎంవోయు కుదుర్చుకున్న కంపెనీ కూడా సరఫరా చేయడంలో చేతులెత్తేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్‌లోకి రోగిని తీసుకువెళ్లాక అనస్థీషియా ఇంజెక్షన్ కోసం వెతుక్కోవడానికి కారణం కూడా సదరు కంపెనీనేనని తెలిసింది. అనస్థీషియా ఇంజెక్షన్లు సరఫరా చేయాలని సదరు కంపెనీకి నెల రోజుల క్రితం ఆస్పత్రి అధికారులు ఆర్డరు పెట్టారు. అయినా.. ఆ కంపెనీ ఇంజెక్షన్లు సరఫరా చేయలేకపోయింది. దీంతో వైద్యుడికి తెలిసిన కంపెనీ నుంచి అనస్థీషియా ఇంజెక్షన్ తెప్పించుకుని, రోగికి ఆపరేషన్ పూర్తి చేశారు. ఇలాంటి పరిస్థితి చాలా ఆస్పత్రులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ డీఎంఈ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అండదండలు ఉండడంతో సదరు కంపెనీపై ఫిర్యాదులు వస్తున్నా డీఎంఈ అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు.

### జన ఔషధి పరిమితం!

జన ఔషధి కేంద్రాల్లో 1,965 రకాల మందులు, 295 సర్జికల్ ఐటమ్స్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మినహా మిగిలిన అన్నిరాష్ట్రాల్లో హబ్‌లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని షాపుల యజమానులు భువనేశ్వర్, చెన్నై లేదా బెంగళూరులో ఉన్న హబ్‌ల నుంచి మందులు తెప్పించుకోవాలి. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ సమాచారం తెలుసుకోకుండా జన ఔషధి కేంద్రాల నుంచి మందులు కొనాలని సూపరింటెండెంట్లకు ఆర్డర్లు ఇచ్చారు. రాష్ట్రంలో 295 పీఎంబీజేకే షాపులున్నాయి. దీంతో ఆయా జిల్లాల్లో ఉన్న రిటైల్ షాపుల్లో ఎక్కువ టర్నోవర్, ఎక్కువ వ్యాపారం చేసే దుకాణాల యజమానులతో ఎంవోయులు చేసుకోవాలని సూపరింటెండెంట్లకు డీఎంఈ నుంచి ఆదేశాలు వెళ్లాయి. అయితే.. సూపరింటెండెంట్లు ఆయా దుకాణాల టర్నోవర్, వ్యాపారం వంటివి చూడకుండా ఆర్డర్ ఇచ్చారు.

### ఒకే ఒక్క కంపెనీతో..

రాష్ట్రంలో పీఎంబీజేకే లైసెన్సులు 295 షాపులకు ఉన్నాయి. అయితే.. కేవలం తిరుపతి కేంద్రంగా నడిచే ఒక కంపెనీతోనే సూపరింటెండెంట్లు ఎంవోయు కుదుర్చుకున్నారు. నామినేషన్ పద్ధతిలో లోకల్ పర్చేజ్ ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ కంపెనీ ప్రతినిధులు రాష్ట్రంలో పీఎంబీజేకే షాపులు ఏర్పాటు చేసి వాటికి లైసెన్సులు పొందారు. సదరు కంపెనీకి రాష్ట్రంలో పీఎంబీజేకే లైసెన్సులు వచ్చిన తర్వాత వాటి నుంచి మందులు కొనుగోలు చేయాలని, వాటితో ఎంవోయులు కుదుర్చుకోవాలని డీఎంఈ నుంచి సూపరింటెండెంట్లకు ఆర్డర్లు వెళ్లాయి. దీంతో డీఎంఈ ఇచ్చిన ఆర్డర్‌ను పట్టుకుని సదరు కంపెనీ ప్రతినిధులు సూపరింటెండెంట్లను సంప్రదించి, తమకు జిల్లాల్లో రిటైల్ షాపులున్నాయని, వాటికి లైసెన్సులున్నాయని చూపించి ఎంవోయులు కుదుర్చుకున్నారు. పీఎంబీజేకే మందుల పేరుతో సదరు కంపెనీకి మేలు చేయడంలో అధికారులు పూర్తిగా విజయం సాధించారు. కానీ, సదరు కంపెనీ ఆస్పత్రులకు అవసరమైన మందులు సరఫరా చేయడంలో విఫలమైంది. కాగా, డీఎంఈ అధికారులు పీఎంబీజేకే షాపులతో ఎంవోయూలు చేసుకోమని సూపరింటెండెంట్లకు స్పష్టమైన ఆర్డర్లు ఇచ్చారు. కానీ, ఒప్పందాలు ఎలా చేసుకోవాలనే దానిపై మార్గదర్శకాలు రూపొందించలేదు.

# నేరగాళ్ల భరతం పట్టే 'క్రైమ్ స్పాట్స్'

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం. దీంతో నేరాలు చేసే వారికి గట్టి హెచ్చరిక, బాధితులకు స్వాంత్వన లభించనుంది. ఇందుకోసం ప్రతి పోలీసు సబ్ డివిజన్‌కూ ప్రత్యేక 'క్రైమ్ స్పాట్స్' వాహనం రాబోతుంది. రాష్ట్రంలో ఏటా లక్ష దాకా కేసులు నమోదవుతుండగా అందులో ఏడేళ్లకు పైగా శిక్షలు పడే అవకాశమున్న నేరాల సంఖ్య తక్కువే. అయితే వాటిలో ఎక్కువగా కోర్టుల్లో వీగిపోతున్నందున నేరాల కట్టడి పోలీసులకు సవాలుగా మారుతోంది. ఈ క్రమంలో ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకూ దర్యాప్తు అధికారి చేస్తున్న పొరపాటు, లోపాలు, అవగాహన రాహిత్యాన్ని సరిచేసేందుకు ఏపీ పోలీసు శాఖ నడుం బిగించింది. పోలీసులకు సవాలు విసురుతోన్న సైబర్ నేరాలతో పాటు హత్యలు, అత్యాచారాలు, ఇతర తీవ్రమైన నేరాల్లో పక్కాగా ఆధారాలు సేకరించి నేరం చేసిన వ్యక్తికి తప్పకుండా శిక్ష పడేలా చేయాలని గట్టి సంకల్పంతో ఉంది. రాష్ట్రంలోని 26 పోలీసు జిల్లాల్లో 109 పోలీసు సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రతి సబ్ డివిజన్‌కూ ఒక వాహనాన్ని 'క్రైమ్ స్పాట్స్' కేటాయించారు.



క్రైమ్ స్పాట్స్ వాహనం లోపలి భాగం

### అధునాతన సాంకేతికత ఆ కారులోనే..!

ఈ వాహనంలో వెనుక సీటు తొలగించి అక్కడ అత్యంత అధునాతన ఫోరెన్సిక్ కిట్ ఏర్పాటు చేశారు. కెమికల్, నార్కో, బయాలజీ, సిరాలజీ, ఎక్స్‌ప్లోజివ్, గన్ రెసిడ్యూ, సైబర్ తదితర కిట్లు అందులో ఉంచారు. మరోవైపు కంప్యూటర్, ప్రింటర్, కెమెరాలు, మైక్రో స్కోప్‌లు, ఆడియో రికార్డ్, టార్చ్‌లైట్‌తోపాటు డ్రోన్ కూడా ఉంటుంది. ఎక్కడ నేరం జరిగినా సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం అందిన వెంటనే క్రైమ్ స్పాట్‌ను అప్రమత్తం చేస్తారు. పోలీసు అధికారి ఘటనా స్థలానికి చేరుకునేలోపు ఎఫ్ఎస్ఎల్ బృందం గూగుల్ మ్యాప్ సాయంతో సమాంతరంగా అక్కడికి చేరుతుంది. ఎక్కడైనా పొదల్లో, అటవీ ప్రాంతంలో దారి లేకపోతే డ్రోన్ గాల్లోకి ఎగిరి మార్గంతో పాటు స్పాట్ కూడా నైట్ విజన్ కెమెరాతో చూపిస్తుంది. అక్కడికి చేరుకున్న వెంటనే జరిగిన నేరాన్ని బట్టి ఎఫ్ఎస్ఎల్ బృందం ఆధారాలు సేకరిస్తుంది. హత్య జరిగితే రక్త నమూనా, సెమన్ నుంచి డీఎన్ఏ వరకూ ప్రతిదీ ఎఫ్ఎస్ఎల్ నిపుణులు సైంటిఫిక్‌గా పాడవ్వకుండా సేకరిస్తారు. పోస్టుమార్టం విస్రా 76 గంటల్లోపు పంపలేకపోతే ఫంగస్ చేరకుండా కెమికల్ నింపుతారు. సేకరించిన ఆధారాలు ఏవి ఎలా భద్రపరిచి పపాలో అలాంటి జాగ్రత్తలు తీసుకుని ల్యాబ్‌కు పంపుతారు.ఆ ప్రక్రియ జరిగినంతసేపూ స్థానిక డీఎస్పీ, జిల్లా ఎస్పీ, డీజీపీ ఆఫీస్, ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ లైవ్‌చూసేలా వీడియో రికార్డు అవుతూ ఉంటుంది.

### సీఎం చంద్రబాబు సూచనతోనే

శాంతి భద్రతల సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కీలక సూచనతో ప్రతి సబ్ డివిజన్‌కూ ఒక ఎఫ్ఎస్ఎల్ బృందాన్ని వాహనం, కిట్‌తో పాటు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. శిక్షల శాతం బాగా తక్కువగా ఉందని, నేరాలకు పాల్పడిన వ్యక్తులు ఆధారాలు ధ్వంసం చేస్తున్నారంటూ మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు ఉదహరించారని అన్నారు. ముఖ్యమంత్రి సమయం అడిగి ఆయన చేతుల మీదుగా త్వరలో సబ్ డివిజన్లకు కార్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతి వాహనంలోనూ ముగ్గురు చొప్పున నిపుణులు ఉంటారని, ఎప్పటికప్పుడు నేరాల తీరుతెన్నులపై సిబ్బందికి శిక్షణ ఇస్తుంటామని డీజీపీ తెలిపారు.

# రాష్ట్రంలో పెరగనున్న ఐపీఎస్‌లు

» అదనపు కేటాయింపులు, కన్ఫర్డ్ కోసం ప్రయత్నాలు

» నేడు కేంద్ర హోంశాఖ, డీవోపీటీకి డీజీపీ వినతి

» 14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల కొరత తీర్చేందుకు పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. కేంద్రం నుంచి అదనపు కేటాయింపులు కోరడంతో పాటు రాష్ట్రంలో గ్రూప్ వన్ ద్వారా ఎంపికైన 14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా తీసుకురానుంది. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మంగళవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ, కేంద్ర సిబ్బంది శిక్షణ విభాగానికి(డీవోపీటీ)కి ఈ విషయంపై విన్నవించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 240 మంది ఐపీఎస్ అధికారులు ఉండగా, రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 140 మందిని కేటాయిస్తూ కేంద్రం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం జాబితాలో 125 మందిని చూపిస్తున్నా కేంద్ర సర్వీసులకు వెళ్లేవారు, దీర్ఘకాలిక సెలవులు తదితర కారణాల వల్ల గత పదేళ్లుగా ఆ సంఖ్య 110కి దాటడం లేదు. ఫలితంగా రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల కొరత ఎక్కువగా ఉంది. జిల్లాల సంఖ్య, రాష్ట్ర జనాభా పెరగడంతో ఇటీవల రాష్ట్రానికి ఐపీఎస్‌ల సంఖ్యను 172కు పెంచుతూ గెజిట్ విడుదలైంది. అందులో యూపీఎస్‌సీ ద్వారా ఎంపికైన రెగ్యులర్ రిక్రూట్ ఐపీఎస్ అధికారులు 66.6 శాతం, రాష్ట్ర సర్వీసు (గ్రూప్ వన్) ద్వారా అధికారులు 33.3 శాతం నిష్పత్తితో ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఐపీఎస్ అధికారుల్లో 60 శాతం లోపు రెగ్యులర్ రిక్రూట్ వాళ్లు, 40 శాతానికి పైగా ఎస్పీఎస్ నుంచి ఉన్నారు. ఒకటి, రెండు రోజుల్లో మరో 14 మందికి ఐపీఎస్ హోదా రానుండటంతో ఈ శాతం సమానం అవుతుంది. దీన్ని యూపీఎస్‌సీ నుంచి ఎంపికైన రెగ్యులర్ ఐపీఎస్‌లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. ఏటా రాష్ట్రానికి నలుగురు, ఐదుగురిని మించి కేంద్రం కేటాయించట్లేదని, ఒకేసారి రెగ్యులర్ రిక్రూట్ అధికారుల సంఖ్యను భారీగా పెంచుకోవడం కష్టమని డీజీపీ చెప్పినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ప్రతి ఏటా 10 నుంచి 15 మంది చొప్పున కేటాయించి ఏపీలో ఐపీఎస్‌ల సంఖ్య 172 మేరకు ఉండేలా చూడాలని కోరనున్నట్లు తెలిసింది. రెగ్యులర్ రిక్రూట్ ఐపీఎస్‌లు 66.6 శాతం ఉండేలా సహకరించాలని డీవోపీటీకి డీజీపీ విన్నవించనున్నట్లు సమాచారం.

# ఇక వరుసగా అల్పపీడనాలు!

» 18 నుంచి 20 వరకూ కోస్తా, సీమల్లో భారీవర్షాలు

విశాఖపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): వర్షాల కోసం ఎదురుచూస్తున్న కోస్తా, రాయలసీమ రైతులకు వాతావరణ శాఖ శుభవార్త తెలిపింది. ఈనెల 17 నుంచి రాష్ట్రంలో వర్షాలు పెరగనున్నాయి. 18వ తేదీ నుంచి మూడు రోజులపాటు విస్తారంగా, అక్కడక్కడ భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గడచిన రెండు వారాలు మధ్య, ఉత్తర భారతాల్లో చురుగ్గా ఉన్న రుతుపవనాలు రానున్న రెండు, మూడు రోజుల్లో దక్షిణాదిలో బలపడనున్నాయి. పశ్చిమ పసిఫిక్‌లో బలపడిన రుతుపవనాల తీవ్రత అటు నుంచి బంగాళాఖాతం వైపు పయనిస్తోంది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో వరుసగా అల్పపీడనాలు ఏర్పడతాయని, దీంతో దేశంలో మరోసారి రుతుపవనాలు బలంగా ప్రభావం చూపుతాయని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం బంగ్లాదేశ్ వైపు వెళ్లే క్రమంలో బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం కోల్‌కతాకు ఈశాన్యంగా 70 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం ఉంది. మంగళవారానికి పశ్చిమ వాయవ్యంగా పశ్చిమ బెంగాల్ మీదుగా పయనించనుంది. మరోవైపు మధ్యప్రదేశ్, దానికి ఆనుకొని రాజస్థాన్‌లో ఏర్పడిన అల్పపీడనం సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఈ రెండింటి ప్రభావంతో రుతుపవనద్రోణి ఉత్తర భారతం వైపు పయనించడంతో మధ్య, తూర్పు, వాయవ్య భారతాల్లో భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడ కుంభవృష్టిగా వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలావుండగా పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనాలు ఆగ్నేయ ఆసియా దేశాల మీదుగా పయనించి బలహీనపడిన తరువాత వాటి అవశేషాలు బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తున్నాయి. వచ్చే వారంలో అటువంటి అవశేషం ఒకటి బలపడి 17వ తేదీ తరువాత నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీనికితోడు తూర్పు, పడమర ద్రోణి ఒకటి విస్తరించనున్నది. వీటి ప్రభావంతో ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాలు పెరుగుతాయని, 18వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఇస్రో వాతావరణ శాఖ విభాగం అంచనా వేసింది. ముఖ్యంగా మధ్య కోస్తా, దానికి ఆనుకుని రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

# ఇంటర్‌పై టెన్త్ ఫలితాల దెబ్బ

» అడ్మిషన్లపై ఉత్తీర్ణత తగ్గుదల ప్రభావం

» ఈ ఏడాది తగ్గిన 24,125 అడ్మిషన్లు

» ప్రైవేటు కాలేజీల్లో భారీగా తగ్గుదల

» ప్రభుత్వ కాలేజీలపై ప్రభావం స్వల్పమే

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గుదల ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ప్రభావం చూపింది. 2024-25 విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది అన్ని రకాల యాజమాన్య కాలేజీల్లో మొత్తంగా 24,125 అడ్మిషన్లు తగ్గాయి. అయితే ఈ నెలాఖరు వరకు అడ్మిషన్లకు గడువు ఉంది. పాలిటెక్నిక్‌లలో, ఆర్జీయూకేటీల్లో సీట్లు లభించని వారు ఇంటర్‌లో చేరే అవకాశం ఉంటుంది. అయితే అది సల్పంగానే ఉంటుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 2024లో టెన్త్‌లో 86.69 శాతం ఉత్తీర్ణతతో 5.34 లక్షల మంది పాస్ అయ్యారు. 2025లో ఉత్తీర్ణత 81.14 శాతానికి (4.98 లక్షల మంది) పడిపోయింది. సుమారు 35 వేల విద్యార్థులు తగ్గడంతో ఆ ప్రభావం ఇంటర్ విద్యపై పడింది. ముఖ్యంగా ప్రైవేటు కాలేజీల్లో భారీగా దాదాపు 24 వేల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ కాలేజీల్లో మాత్రం పెద్దగా ప్రతికూల ప్రభావం కనిపించలేదు. 2024కు, ఈ ఏడాదికి వెయ్యి అడ్మిషన్ల మేర వ్యత్యాసం ఉన్నా.. ఈ నెలాఖరుకు అది కూడా తగ్గే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సీబీఎస్ఈ కాలేజీలు, కేజీబీవీలు, గిరిజన సంక్షేమ కాలేజీలు, ఏపీఆర్‌జేసీలు, మోడల్ స్కూల్స్‌లో గతేడాదితో పోలిస్తే అడ్మిషన్లు పెరిగాయి.


**ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్ల వ్యత్యాసం ఇలా..**

| యాజమాన్యం | 2025 | 2024 |
|---|---|---|
| ప్రైవేటు | 3,92,009 | 4,15,795 |
| ప్రభుత్వ | 70,557 | 71,632 |
| సాంఘిక సంక్షేమ | 8,589 | 10,978 |
| హైస్కూల్ ప్లస్ | 6,297 | 7,034 |
| ఎయిడెడ్ | 8,295 | 8,408 |
| మోడల్ స్కూల్స్ | 12,975 | 12,894 |
| ఎంజేపీఏపీ | 1,764 | 1,956 |
| ఏపీఆర్‌జేసీ | 1,155 | 1,093 |
| గిరిజన సంక్షేమ | 5,419 | 4,774 |
| కేజీబీవీ | 12,377 | 11,060 |
| సీబీఎస్ఈ | 8,474 | 6,412 |

### ఉత్తీర్ణత తగ్గింది... మార్కులు పెరిగాయి

ఈ ఏడాది పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినా, మార్కులు మాత్రం పెరిగాయి. వేల సంఖ్యలో విద్యార్థులకు 550 మార్కులు దాటాయి. 1,680 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 65.36 శాతం మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులకు మార్కులు భారీగా రావడంతో ఎక్కువ మందిని కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించారు. మెరుగైన మార్కులు వచ్చాయని, ఐఐటీల్లో సీట్లు పొందుతారనే ఆలోచన తల్లిదండ్రుల్లో పెరిగింది. ఫలితంగా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో అడ్మిషన్లు తగ్గాయి.

# డిగ్రీపై ఎవరి దారి వారిదే!



ఉన్నత విద్యాశాఖ వర్సెస్ విద్యామండలి.. సింగిల్ మేజర్‌కు ఉన్నతాధికారుల పట్టు

డ్యూయల్ మేజర్‌కు మండలి మొగ్గు.. 2 మేజర్ సబ్జెక్టులు ఉండాలని లేఖ

డ్యూయల్‌కే ఎక్కువ మంది డిమాండ్.. అధ్యాపకులు, విద్యార్థులు, కాలేజీలూ దీనికే మొగ్గు

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖలో విభేదాలు బయటపడుతున్నాయి. స్వయంగా నారా లోకేశ్ మంత్రిగా ఉన్న శాఖలోనే అధికారుల మధ్య సమన్వయం పూర్తిగా లోపించింది. ముఖ్యంగా సాధారణ డిగ్రీ కోర్సుల విషయంలో అభిప్రాయ భేదాలు పెరిగిపోతున్నాయి. డ్యూయల్ మేజర్ సబ్జెక్టులతో(రెండు ప్రధాన సబ్జెక్టులు) డిగ్రీ కోర్సులు ఉండాలని ఉన్నత విద్యామండలి మొదటినుంచీ అభిప్రాయపడుతోంది. ప్రస్తుతం ఉన్న సింగిల్ మేజర్ నుంచి డ్యూయల్ మేజర్ విధానానికి మారేందుకు నోటిఫికేషన్ కూడా జారీచేసింది. కానీ ఉన్నత విద్యాశాఖలోని ఉన్నతాధికారులు సింగిల్ మేజర్ డిగ్రీ ఉండాలని పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల మంత్రి వద్ద జరిగిన సమీక్షలో దీనిపై చర్చ జరిగింది. సింగిల్ మేజర్ డిగ్రీ విధానమే కొనసాగించాలని సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. ఆ వెంటనే డిగ్రీపై మళ్లీ కొత్త క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ రూపొందించి పంపాలని ఉన్నత విద్యాశాఖ... మండలిని కోరింది. తాజాగా మండలి కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను ప్రభుత్వానికి పంపింది. అందులో రెండు మేజర్ సబ్జెక్టుల డిగ్రీనే మళ్లీ ప్రతిపాదించారు. మొదటి మేజర్ సబ్జెక్టుకు 60 క్రెడిట్లు, రెండో మేజర్ సబ్జెక్టుకు 48 క్రెడిట్లు, ఇంటర్న్‌షిప్‌లకు 8 క్రెడిట్లు పెట్టాలని సూచించింది. మిగిలిన భాషా, మల్టీ డిసిప్లినరీ, స్కిల్ కోర్సులకు 10 క్రెడిట్లు మాత్రమే మిగులుతున్నాయి. అయితే సింగిల్ మేజర్‌తోనే డిగ్రీ ఉండాలని ఉన్నతాధికారులు పట్టుబడుతున్నారు. డ్యూయల్ మేజర్ విధానం సక్రమంగా లేదని అభిప్రాయపడుతున్నారు. ఒక మేజర్ సబ్జెక్టును, ఒక ఎలెక్టివ్ సబ్జెక్టు ఉండేలా కొత్త విధానం ఉండాలని భావిస్తున్నారు. భాషా, స్కిల్ సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనేది వారి అభిప్రాయం. దానివల్ల విద్యార్థులకు ఎక్కువ మేలు జరుగుతుందని అంటున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్‌తో విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని మండలి అభిప్రాయపడుతోంది. సింగిల్ మేజర్ విధానంలో ఒకమేజర్, ఒకమైనర్ ఉంటాయి. ఆరెండింటిపైనే పీజీ చేసే అవకాశం ఉంటుంది. అదే డ్యూయల్ మేజర్ అమలుచేస్తే మొత్తం మూడు సబ్జెక్టులపై పీజీ చేయొచ్చు. క్షేత్రస్థాయిలో అధ్యాపకులు, విద్యార్థులు కూడా డ్యూయల్ మేజర్‌డిగ్రీ విధానాన్నే కోరుకుంటున్నారు. కాలేజీల యాజమాన్యాలూ డ్యూయల్ డిగ్రీ ఉండాలని అడుగుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న అభిప్రాయాలకు విరుద్ధంగా ఉన్నత విద్యాశాఖ సింగిల్ మేజర్‌కు మొగ్గు చూపుతుందనే వాదన వినిపిస్తోంది.

ఏడాది బోధనానుభవం ఉంటే..

# ప్రొఫెసర్‌గా పదోన్నతి!

- ఆరోగ్యశాఖ ఫైల్‌కు ముఖ్యమంత్రి ఆమోదం
- కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల పోస్టుల భర్తీకి బ్రేక్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ప్రభుత్వం
- మంత్రికి తెలియకుండానే నోటిఫికేషన్.. సత్యకుమార్ సీరియస్

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల మేరకు కొత్త, పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ నిమిత్తం అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించడానికి టీచింగ్ అర్హతల్లో మినహాయింపు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు మినహాయింపు ఫైల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఆమోద ముద్ర వేశారు. సర్వీసు నియమాల ప్రకారం మూడేళ్ల బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తారు. అయితే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది. 2025-26 సంవత్సరానికి కొత్త కాలేజీల్లో వైద్యవిద్య ప్రవేశాలకు అనుమతి పొందాలంటే వైద్యుల కొరత లేకుండా చూడాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. దీంతో ఆరోగ్యశాఖ ఒక ఏడాది బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపింది. ఈ సడలింపు ఈ ఒక్కసారి మాత్రమే వర్తించేలా అనుమతించారు. నిబంధనల సడలింపు నేపథ్యంలో.. కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రొఫెసర్ల నియామక ప్రతిపాదనను వాయిదా వేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

**మంత్రికి తెలియకుండా నోటిఫికేషన్:** ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ వాయిదా పడింది. "అమ్మకానికి వైద్యుల పోస్టులు" శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఒక్కో పోస్టును రూ.20 నుంచి రూ.25 లక్షలకు అమ్మేస్తున్నారన్న విషయమై స్పందించిన ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీని తాత్కాలికంగా వాయిదా చేసింది. విచిత్రం ఏమిటంటే కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ నిమిత్తం ఆరోగ్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ గురించి మంత్రి సత్యకుమార్‌కు కనీసం సమాచారం లేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే మంత్రి కార్యాలయం ఈ నోటిపికేషన్‌పై ఆరా తీసింది. అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉండగా నోటిఫికేషన్ ఎందుకిచ్చారని ప్రశ్నించారు. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## వైసీపీ నేత తురకా కిశోర్‌పై మరో కేసు

- ఇప్పటికే ఏడు హత్యాయత్నం, మరో ఏడు ఇతర కేసులు

మాచర్లటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌పై మరో హత్యాయత్నం కేసు నమోదైంది. పార్టీ మారడం లేదన్న కారణంతో టీడీపీ నేత దారపనేని శ్రీనివాసరావుపై 2022 అక్టోబరు 7న తురకా కిశోర్, బోదలవీడుకు చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబు మరికొందరు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. నాడు వైసీపీ ప్రభుత్వం ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. తాజాగా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ దారపనేని ఆదివారం మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కిశోర్‌తోపాటు ఇతర నిందితులపై హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితుల్లో మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సమందర్‌వలి తెలిపారు. ఇప్పటికే కిశోర్‌పై ఏడు హత్యాయత్నం కేసులు, మరో ఏడు ఇతర కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అజ్ఞాతంలోకి వెళ్లిన కిశోర్.. బెంగళూరు నుంచి ఈ యేడాది జనవరిలో హైదరాబాద్‌లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసేందుకు వెళ్లినప్పుడు ఏపీ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. మరోవైపు నెల క్రితమే ఆయనను మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



రూ.4.40 కోట్ల విలువైన వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

## వంద రోజుల్లో రోడ్లపై గుంతల్లేని మంగళగిరి

అధికారులు ఈ చాలెంజ్‌ను స్వీకరించాలి: మంత్రి లోకేశ్

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 14(ఆంధ్రజ్యోతి): వంద రోజుల్లో రోడ్లపై గుంతల్లేని నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దాలని, అధికారులు దీన్ని చాలెంజ్‌గా తీసుకుని పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ఆదేశించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ)ను స్వచ్ఛతలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేలా రూ.4.40 కోట్ల విలువైన ఐదు అధునాతన వాహనాలను మంత్రి సోమవారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. చెత్త తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మిషన్ వాహనాలు, రెండు స్వీపింగ్ మిషన్ వాహనాలతోపాటు బీటీ రహదారుల గుంతలు పూడ్చే అధునాతన పాత్‌హోల్ రోడ్ రిపేర్ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. చెత్త తరలించేందుకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో వినియోగిస్తున్న రూ.1.91 కోట్ల విలువైన రెండు కాంపాక్టర్ వాహనాలు రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎంటీఎంసీకి అందాయి. రూ.1.48 కోట్ల విలువైన పాత్‌హోల్ రోడ్ రిపేర్ వాహనంతోపాటు రూ.1.2 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ మిషన్లూ వచ్చాయి. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి పాల్గొన్నారు.

# భారత్‌నెట్-2లో చేరండి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలో దృష్టిసారించారు. వేగవంతమైన ఇంటర్నెట్ సేవల అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత్‌నెట్-2 ప్రోగ్రామ్‌లో చేరాలని మౌలిక సదుపాయాల కల్పన శాఖను ఆదేశించారు. ఈ మేరకు కేంద్రానికి తక్షణమే సమాచారం ఇవ్వాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్‌కు సీఎం సూచించారు. భారత్‌నెట్-2లో చేరాక ఫైబర్‌నెట్ నిర్వహణను ప్రైవేటుకు అప్పగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భారత్‌నెట్-1 ప్రోగ్రాం కూడా కొనసాగాలన్నారు. ఫైబర్‌నెట్‌పై ఆధారపడ్డ 6,000 మంది కేబుల్ టీవీ ఆపరేటర్లకు సెట్‌టాప్ బాక్సులను అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

### దొడ్డిదారిన వైసీపీ కార్యకర్తలకు కొలువులు

తమ హయాంలో కేవలం 130 మంది ఉద్యోగులతో సంస్థను అద్భుతంగా నడిపామని చంద్రబాబు చెప్పారు. 8 లక్షలకు పైగా కనెక్షన్లు ఇచ్చామన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం దొడ్డిదారిన ఆ పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాల కోసం లేని పోస్టులు సృష్టించిందని చెప్పారు. ఏపీ ఫైబర్‌నెట్‌కు 2025 నుంచి 2035 వరకూ రూ. 1,900 కోట్లు కేంద్రం నుంచి నిధులు వస్తాయని అధికారులు వివరించారు. చిత్తూరు, విశాఖ జిల్లాల్లోని 1,692 గ్రామ పంచాయతీల్లో ఫైబర్‌నెట్‌ను లీనియర్ నుంచి రింగ్ నెట్‌వర్క్‌కు మార్చేందుకు రూ. 430 కోట్లు ఇస్తుందని చెప్పారు. ఫైబర్‌నెట్ కనెక్షన్లు పెంచడంపై దృష్టిసారించాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కనెక్షన్ల తగ్గుదలకు కారణాలనూ సీఎం విశ్లేషించారు. 2014-19 మధ్య కాలంలో ట్రిపుల్‌ప్లే(టీవీ, ఇంటర్నెట్, ఫోన్) సదుపాయంతో నెలకు రూ. 149కే సేవలు అందిచేవారమని, దానిని రూ. 350కు పెంచడంతో పాటు నాణ్యతలేకుండా చేశారని సీఎం అసహనం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న వర్చువల్ క్లాస్‌రూమ్‌లను పునరుద్ధరించాలని సూచించారు. రాష్ట్రంలోని 12,946 గ్రామ పంచాయతీలకు ఫైబర్‌నెట్ సేవలు అందిస్తున్నామని అధికారులు వివరించారు. వ్యవసాయరంగంలో డ్రోన్ సేవలను అందించాలని సీఎం చెప్పారు. డ్రోన్ పోర్టల్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు. సమీక్షలో ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### జగన్ పాలనలో ఫైబర్‌నెట్ కుదేలైంది ఇలా..

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ ఫైబర్‌నెట్‌ను ఏ విధంగా నిర్వీర్యం చేశారో సీఎంకు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. 2015లో 13 మంది ఉద్యోగులతో ప్రారంభమైన ఏపీ ఫైబర్‌నెట్ తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయేనాటికి 38,000 కిలోమీటర్ల మేర విస్తరించిందన్నారు. కనెక్షన్ల సంఖ్య 8,70,438కి చేరిందని, కేవలం 130 మంది సిబ్బందితో సేవలు అందించామని చెప్పారు. జగన్ అధికారపగ్గాలు చేపట్టిన తర్వాత ఫైబర్‌నెట్ విస్తరణ వైపు దృష్టి సారించలేదన్నారు. 2021-22లో కనెక్షన్లు 7,51402కు తగ్గాయని తెలిపారు. కానీ ప్రభుత్వ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది మాత్రం 127 నుంచి అమాంతం 918కు పెరిగిపోయారని పేర్కొన్నారు. 2022-23 నాటికి సిబ్బంది 937కు చేరుకున్నారని, కనెక్షన్లు 7,29,654కు తగ్గిపోయాయని వెల్లడించారు. 2023-24 నాటికి ఉద్యోగుల సంఖ్య 1,350 మందికి చేరుకుంటే, కనెక్షన్లు 5,45,235కు తగ్గాయన్నారు. 2024-25 నాటికి కనెక్షన్లు 5,06,422, ప్రస్తుతం 4,53,525కు పడిపోయాయని తెలిపారు. ఇక జగన్ హయాంలో ఫైబర్‌నెట్‌లో వ్యయాలు ఒక్కోఏడాది పెరుగుతూ వచ్చాయని చెప్పారు. జగన్ ప్రభుత్వం దిగిపోయాక ఖర్చులు రూ. 350 కోట్లకు, ఉద్యోగుల సంఖ్య 442కు పడిపోయిందన్నారు. ఇప్పటికే ఫైబర్‌నెట్ అక్రమాలపై మాజీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదనరెడ్డిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకువచ్చారు.

| ఏడాది | ఫైబర్ కి.మీలలో | కనెక్షన్లు | ఉద్యోగులు | ప్రభుత్వ ఉద్యోగులు | అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు | కాంట్రాక్టు ఉద్యోగులు |
|---|---|---|---|---|---|---|
| 2015-16 | 0 | 0 | 13 | 4 | 3 | 6 |
| 2916-17 | 24,000 | 741 | 42 | 4 | 21 | 17 |
| 2017-18 | 24,000 | 37,822 | 50 | 4 | 29 | 17 |
| 2018-19 | 24,000 | 5,28,089 | 111 | 2 | 87 | 22 |
| 2019-20 | 38,000 | 8,70,438 | 130 | 3 | 114 | 13 |
| 2020-21 | 38,000 | 8,92,346 | 127 | 2 | 113 | 12 |
| 2021-22 | 38,000 | 7,51,402 | 918 | 3 | 327 | 588 |
| 2022-23 | 48,000 | 7,29,654 | 937 | 4 | 239 | 694 |
| 2023-24 | 78,355 | 5,45,235 | 1,350 | 4 | 613 | 733 |
| 2024-25 | 78,355 | 5,06,422 | 1,350 | 4 | 863 | 483 |
| 2025-26 | 78,355 | 4,53,525 | 442 | 1 | 61 | 381 |

## ఢిల్లీకి 'బనకచర్ల'!

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను వెనక్కి పంపింది. వరద జలాల అందుబాటుపై కొర్రీవేసింది. ఈ నేపథ్యంలో ఏపీ తన వాదనలను జలశక్తి శాఖ ముందుంచనుంది. గోదావరి, కృష్ణా ట్రైబ్యునళ్ల తీర్పులను సమర్పించనుంది. తెలంగాణ నిర్మిస్తున్న అక్రమ నీటి ప్రాజెక్టుల గురించీ ప్రస్తావించే అవకాశముంది. ఇంకోవైపు.. బనకచర్ల ప్రాజెక్టుపైన, కేంద్రం లేవనెత్తిన సందేహాలపైన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వాప్కోస్ రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. గడచిన 15 ఏళ్ల లెక్కలు చూస్తే.. గోదావరి నుంచి ఏటా 2,842 టీఎంసీల వరద జలాలు సముద్రంలోకి పోతున్నట్లు పేర్కొంది. అందులో కేవలం 200 టీఎంసీలను సద్వినియోగం చేసుకోవడం వల్ల ఎగువన ఉన్న తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని సీఎం చంద్రబాబు ఇప్పటికే స్పష్టంచేశారు. బుధవారం కూడా ఇదే పునరుద్ఘాటించనున్నారు. వాప్కోస్ రిపోర్టును పాటిల్‌తో జరిగే సమావేశంలో సమర్పించనున్నారు.

## ఏపీలోనూ స్వచ్ఛత అవార్డులు

- వ్యర్థరహితంగా 'కుప్పం' మోడల్ ప్రాజెక్టు
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ తరహాలోనే రాష్ట్రంలోనూ స్వచ్ఛత అవార్డులు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు వీలుగా స్థానికసంస్థల మధ్య బలమైన పోటీ ఉండేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. దీని కోసం ఒక స్వతంత్ర సంస్థతో మూల్యాంకనం చేయించాలన్నారు. స్వచ్ఛభారత్‌లో అవార్డులు సాధించిన విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం కార్పొరేషన్లలో ఈ నెల 21న ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి 17 కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పర్యావరణ హిత చర్యల్లో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ లేకుండా కార్యాచరణ అమలు చేస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు కాగా, సర్క్యులర్ ఎకానమీ ద్వారా రాష్ట్రంలో వ్యర్థాలు లేకుండా చూడటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం.. అధికారులను ఆదేశించారు. దీనికోసం ఆయా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్నారు. తిరుపతి, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, గోదావరి జిల్లాల్లో సర్క్యులర్ ఎకానమీ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వ్యర్థరహితంగా కుప్పం మున్సిపాలిటీలో మోడల్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, వ్యర్థాల సేకరణపై ఈ విధానాన్ని పరిశీలించాలని సీఎం తెలిపారు. సమీక్షలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

చర్చిస్తారు. మధ్యాహ్నం 3.30కు మూర్తి మార్గ్-3లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. రాత్రి 7 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం అవుతారు. 16న కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు. రాత్రి ఢిల్లీలోనే బస చేసి 17 ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి అమరావతికి చేరుకుంటారు.

# రాజ్‌భవన్‌లోకి రాజు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎక్కడా మచ్చలేదు. ఎన్నో పదవులు చేపట్టి హుందాగా వ్యవహరించారు. రాజు అయినప్పటికీ సామాన్యుల్లో ఒకరిగా మెలిగారు. ఆయనే పూసపాటి అశోక్ గజపతిరాజు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్న ఆయనకు సముచిత స్థానం లభించింది. గోవా గవర్నర్‌గా కేంద్రం నియమించింది. అశోక్ రాజకీయంగా సీఎం చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సమకాలికుడు. ముగ్గురూ 1978లో మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అశోక్ విజయనగరం నుంచి జనతాపార్టీ తరపున గెలిచారు. ఆ తర్వాత ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీలో చేరారు. అది మొదలు ఇప్పటివరకూ గెలుపోటములతో సంబంధం లేకుండా.. ఎన్నో రకాల ఇబ్బందులు వచ్చినా టీడీపీలోనే కొనసాగుతున్నారు. 1983, 85, 89, 1994, 1999 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున విజయనగరం నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మాత్రం ఓడిపోయారు. తిరిగి 2009లో గెలిచారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో వాణిజ్యపన్నులు, రెవెన్యూ, ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖలు నిర్వహించారు. 2014లో విజయనగరం ఎంపీగా విజయం సాధించి.. మోదీ కేబినెట్‌లో పౌరవిమానయాన మంత్రిగా పనిచేశారు. 1951 జూన్ 26న జన్మించిన అశోక్ టీడీపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. 1982లో ఎన్టీఆర్ పార్టీ ఏర్పాటు ప్రకటన సమయంలో ఆయన వెంటే ఉన్నారు. 4దశాబ్దాలుగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. విజయనగరం జిల్లాలో టీడీపీ అంటే అశోక్.. అశోక్ అంటే టీడీపీ అన్నట్టు ఉంటుంది. ఆ పార్టీకి విజయనగరం జిల్లాలో సొంత కార్యాలయమంటూ లేదు. అశోక్ గజపతిరాజుకు చెందిన అశోక్ బంగళాయే కార్యాలయంగా కొనసాగుతూ వస్తోంది. ఎన్టీఆర్‌తో అశోక్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయనంటే ఎన్టీఆర్‌కు అమిత గౌరవం. రాజుగారూ అని సంబోధించేవారు. అంత సాన్నిహిత్యమే చంద్రబాబుతోనూ ఉంది. చంద్రబాబు సైతంఆయన మాటకు విలువిస్తారు. ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామి కావడంతో కేంద్ర పెద్దలు గవర్నర్ పదవి ఆఫర్ చేశారు. చంద్రబాబు పార్టీలో అందరి అభిప్రాయాన్ని తీసుకుని అశోక్ పేరు సిఫారసు చేశారు.

### విద్యాదానం.. భూదానం


వేల ఎకరాలను విద్యాసంస్థలు, దేవాలయాలకు ఇచ్చిన కుటుంబం పూసపాటి రాజవంశీయులది. ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాల్లో సైతం అశోక్ కుటుంబానికి ఆస్తులున్నాయి. అటువంటి విలువైన ఆస్తులను ప్రజలకు అప్పగించారు. కోల్‌కతా నుంచి చెన్నై వరకూ కోస్తా ప్రాంతంలో బీఎస్సీ డిగ్రీ కాలేజీలు లేకపోవడంతో వందేళ్ల కిందటే ఆయన తండ్రి పీవీజీ రాజు మహారాజా కాలేజీని ఏర్పాటుచేసి అన్నిరకాల సైన్స్ సబ్జెక్టులను అందుబాటులోకి తెచ్చారు.

### వైసీపీ హయాంలో అవమానాలు..

2014-19 మధ్య జగన్ హయాంలో అశోక్‌పై కక్షగట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సింహాచలం సహా అనేక దేవస్థానాలకు అనువంశిక ధర్మకర్తగా ఉన్న ఆయన్ను అడుగడుగునా అవమానించారు. ఆలయాల్లో స్వాగత సత్కారాలు ఆపేశారు. ప్రథమ పూజలు, దర్శనాలను అడ్డుకున్నారు. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్‌గా ఆయన్ను అక్రమంగా తొలగించి.. ఆయన అన్న కుమార్తె సంచయితను తెచ్చి కూర్చోబెట్టారు. సింహాచలం అనువంశిక ధర్మకర్తగానూ నియమించారు. రామతీర్థంలో కోదండరాముడి విగ్రహ ఆవిష్కరణ సమయంలో సైతం అశోక్‌ను పక్కనపెట్టేశారు. అయితే ఆయన చట్టపరంగానే ఎదుర్కొని అన్నిరకాల అనువంశిక బాధ్యతలు, పదవులు దక్కించుకున్నారు. 2024 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్ వెనుక ఆయన కృషి ఎంతో ఉంది.

## ఉత్తరాంధ్ర నుంచి ఇద్దరు గవర్నర్లు

- ఒడిసాలో కంభంపాటి హరిబాబు, గోవా వెళ్లనున్న అశోక్



విశాఖపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గవర్నర్లుగా పనిచేసే అవకాశం చాలా తక్కువ మందికే లభిస్తుంది. అటువంటిది ఉత్తరాంధ్ర నుంచి ఇప్పుడు ఇద్దరు నాయకులు గవర్నర్లు కావడం విశేషం. బీజేపీ సీనియర్ నేత కంభంపాటి హరిబాబు ప్రస్తుతం ఒడిసా గవర్నర్‌గా ఉన్నారు. ఇప్పుడు టీడీపీ నేత అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. హరిబాబు ఆంధ్ర వర్సిటీలో చదువుకోవడానికి విశాఖ వచ్చి అదే సంస్థలో అధ్యాపకుడిగా పనిచేశారు. తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, వెంకయ్య నాయుడుల పరిచయంతో రాజకీయాల్లోకి వచ్చారు. బీజేపీలో కీలకంగా పనిచేశారు. 1999లో విశాఖ-1 నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2014లో విశాఖ ఎంపీగా.. వైఎస్ జగన్ తల్లి విజయలక్ష్మిపై విజయం సాధించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. 2021 జూలై 19న మిజోరం గవర్నర్‌గా నియమితులైన ఆయన గత ఏడాది డిసెంబరు 26న ఒడిసాకు బదిలీ అయ్యారు. విజయనగరం సంస్థానాధీశుడైన అశోక్‌గజపతిరాజు.. సింహాచలం సహా పలు దేవస్థానాలకు వంశపారంపర్య ధర్మకర్త. ఆయన పౌర విమానయాన మంత్రిగా ఉన్నప్పుడు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం రావడానికి కృషిచేశారు.

## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

(మొదటి పేజీ తరువాయి)

పీఎస్ శ్రీధరన్ పిళ్లై ఉన్నారు. కేరళ బీజేపీ మాజీ అధ్యక్షుడైన ఈయన 2019లో మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. 2021లో గోవాకు బదిలీ అయ్యారు. ఇప్పుడీయన స్థానంలో అశోక్ గజపతిరాజు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ బ్రిగేడియర్ బీడీ మిశ్రా రాజీనామా చేయడంతో ఆ స్థానంలో జమ్మూకశ్మీరు మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత కవీందర్ గుప్తాకు అవకాశం కల్పించారు.

### ఘోస్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యం..

అసీం ఘోష్ (81) విద్యావేత్త. గొప్ప వక్త. మృదుస్వభావి. ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. 1999-2002 నడుమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. సంస్థాగతంగా ఆ పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత తెరమరుగయ్యారు. 20 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన్ను ఆకస్మికంగా హరియాణా గవర్నర్‌గా నియమించడాన్ని సొంత పార్టీ వాళ్లే నమ్మలేకపోతున్నారు. కవీందర్ గుప్తా (65) గతంలో జమ్ము మేయర్‌గానే గాక జమ్మూకశ్మీరు అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. బలమైన ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. బీజేపీ ఇటీవలి కాలంలో రాష్ట్ర అధ్యక్షులుగా మొదటి నుంచీ పార్టీని నమ్ముకున్నవారు.. ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉన్నవారినే నియమించిన సంగతి తెలిసిందే.

### తెలుగువారి గౌరవం ఇనుమడింపజేస్తా: గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో తానెప్పుడూ అవకాశాల కోసం పరుగెత్తలేదని.. ఇస్తే మాత్రం న్యాయం చేస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. తనను గోవా గవర్నర్‌గా నియమించడంపై సోమవారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువారి గౌరవాన్ని మరింత ఇనుపడింపజేసేలా గవర్నర్ బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. బంగళా తనకు అలవాటైనదేనని.. కొత్త అసైన్‌మెంట్ వచ్చినప్పుడు అక్కడకు వెళ్లడం.. పూర్తయిన తర్వాత తిరిగి బంగళాకు రావడం జరుగుతున్నదేనని తెలిపారు. తనను గవర్నర్‌గా నియమించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయనకు విజయనగరం పైడిమాంబ దేవస్థానం పురోహితులు ఆశీర్వచనం అందించారు.

### అశోక్ నియామకంపై గోవా సీఎం హర్షం

అశోక్ నియామకంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్ హర్షం వ్యక్తంచేశారు. 'ఆయన అనుభవజ్ఞుడైన రాజనీతిజ్ఞుడు. 'వికసిత్ గోవా-2037' దిశగా ఆయన పార్లమెంటరీ అనుభవం, మార్గదర్శకత్వం ఉపకరిస్తాయని విశ్వసిస్తున్నాను' అని పేర్కొన్నారు. అశోక్ నియామకంపై టీడీపీ నేత కంభంపాటి రామమోహన్‌రావు కూడా హర్షం వ్యక్తం చేశారు.





కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న మంత్రి సవిత, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్

## 'ఓడీవోపీ'లో ఏపీకి గోల్డ్

- జిల్లా స్థాయిలో మరో 9 జాతీయ అవార్డులు
- ఢిల్లీలో అందుకున్న మంత్రి సవిత, కలెక్టర్లు

న్యూఢిల్లీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు గోల్డ్ అవార్డు దక్కింది. సోమవారం, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ప్రతిష్ఠాత్మక ఓడీఓపీ-2024 అవార్డులను ప్రదానం చేశారు. విదేశాల్లోని భారత మిషన్లు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాలు అనే మూడు విభాగాల్లో మొత్తం 34 అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ రాష్ట్రాల కేటగిరిలో మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ గోల్డ్ అవార్డును అందుకుంది. జిల్లాల విభాగంలో వ్యవసాయ కేటగిరిలో గుంటూరు(మిర్చి) గోల్డ్ అవార్డును, శ్రీకాకుళం(జీడిపప్పు) కాంస్య అవార్డును అందుకున్నాయి. వ్యవసాయేతర ఉత్పత్తుల కేటగిరిలో బాపట్ల(చీరాల సిల్క్- చీరలు(కుప్పడం)), విజయనగరం(బొబ్బిలి వీణ), తిరుపతి(వెంకటగిరి కాటన్ చీరలు) గోల్డ్ అవార్డును, శ్రీసత్యసాయి(ధర్మవరం సిల్క్ చీరలు) రజత అవార్డును, అనకాపల్లి(ఏటికొప్పాక బొమ్మలు), కాకినాడ(పెద్దాపురం సిల్క్స్) కాంస్య అవార్డును, పశ్చిమగోదావరి(నరసాపూర్ క్రోచెట్ లేస్‌లు) ప్రత్యేక ప్రశంస అవార్డును అందుకున్నాయి. న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత, ఆయా జిల్లాల కలెక్టర్లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమం అనంతరం ఏపీ భవన్‌లో మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి పథం వైపు దూసుకుపోతున్న రాష్ట్రంవైపు దేశం యావత్తూ చూస్తోందని పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్న స్పందిస్తూ.. 'రైతుల సంకల్పం, అధికారుల కృషి కలిసి ఓ గొప్ప విజయాన్ని సాధించాయి' అని ప్రశంసించారు.

## యోగ నిద్రలో పవన్: రాఘవులు



అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ యోగ నిద్రలో ఉన్నారు. బీజేపీకి లొంగిపోయి ఎలా చెప్పాలో అర్థంగాక భాషలను చిన్నమ్మ, పెద్దమ్మగా వర్ణించారు' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఎద్దేవా చేశారు. దక్షిణాదిపై హిందీని రుద్దితే కబడ్దార్! అంటూ గతంలో హెచ్చరించిన ఆయనే ఇప్పుడు హిందీని రుద్దాలంటున్నారని విమర్శించారు. సోమవారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో విలేకరులతో రాఘవులు మాట్లాడారు. 'రాజ్యాంగంలో అన్ని భాషలూ సమానమే. హిందీని అనుసంధాన భాషగా ప్రోత్సహించాలేగాని బలవతంగా రుద్దకూడదు. సుప్రీం కోర్టులో కేసు ఉండగానే బిహార్ తరహాలో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని ఇతర రాష్ట్రాలకు సీఈసీ లేఖలు పంపించడం బీజేపీ అనుకూల చర్య తప్ప మరొకటి కాదు' అని అన్నారు.

## టూరిజం రెస్టారెంట్లు, హోటళ్లను ప్రైవేటీకరించొద్దు

అమరావతి: ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా లాభదాయకంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎంకు సోమవారం లేఖ రాశారు.

# పిడిగుద్దులకు తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి

- అతనిపై అదే తరగతి విద్యార్థి దాడి
- పాఠశాల ముగిశాక కోటలోకి రా అంటూ సవాల్
- విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఘటన

బొబ్బిలి జూలై 14(ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి విద్యార్థిపై అదే తరగతి విద్యార్థి పిడిగుద్దులు గుద్దడంతో ప్రాణాలు కోల్పోయాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో సోమవారం సాయంత్రం జరిగిందీ ఘటన. బొబ్బిలిలోని రావువారి వీధికి చెందిన కార్తికేయ(14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బొబ్బిలి మండలం గున్నతోటవలసకు చెందిన బాలుడు కూడా అదే క్లాసులో చదువుతున్నాడు. వీరిద్దరూ ముందురోజు ఘర్షణ పడ్డారు. మాటామాటా పెరిగి ఒకరికొకరు సవాల్ విసురుకున్నారు. 'స్కూలు విడిచిపెట్టిన తర్వాత కోటలోనికి వస్తే నీ సంగతి చూస్తా' అంటూ కార్తికేయను ఆ విద్యార్థి హెచ్చరించాడు. చూసుకుందామని కార్తికేయ బదులిచ్చాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిశాక వీరిద్దరితోపాటు మరికొందరు విద్యార్థులు బొబ్బిలి కోటలోకి వచ్చారు. తోటి విద్యార్థుల సమక్షంలో కార్తికేయపై ఆ విద్యార్థి పిడిగుద్దులు కురిపించాడు. కోటలో పనిచేస్తున్నవారు గమనించి గట్టిగా మందలించారు. విద్యార్థులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాడికి గురైన కార్తికేయ పది అడుగుల దూరం నడుచుకుంటూ వెళ్లి నేలపై కుప్పకూలిపోయాడు. కోటలోని ఉద్యోగులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాడి చేసిన విద్యార్థితోపాటు ప్రత్యక్షసాక్షులుగా ఉన్న విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



కార్తికేయ(ఫైల్ ఫొటో)

## 'కన్నతల్లిని కట్టేసి'నట్లు!

- ఆస్తి కోసం తల్లితో కలిసి కొడుకు హైడ్రామా
- ఆపై పోలీసులకు ఫిర్యాదు.. బెడిసికొట్టిన పన్నాగం


డ్రిప్ పైపులతో స్తంభానికి కట్టేసి ఉన్న గంగమ్మ

కుప్పం/శాంతిపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కన్న తల్లిని స్వయంగా కన్నకొడుకే విద్యుత్ స్తంభానికి కట్టేసి.. ఆపై సవతి సోదరుడే ఆ పని చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి కూడా ఈ హైడ్రామాలో పాలుపంచుకున్నట్లు తర్వాత పోలీసుల విచారణలో తేలింది. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. డీఎస్పీ పార్థసారథి, స్థానికుల కథనం మేరకు.. శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ తంబిగానిపల్లెలో మునెప్పకు మునెమ్మ, గంగమ్మ అనే ఇద్దరు భార్యలు. మునెమ్మ గతంలోనే మృతి చెందింది. ఆమెకు మంజునాథ్ అనే కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం జీవించి ఉన్న గంగమ్మకు సురేశ్ అనే కొడుకు ఉన్నాడు. సంతానానికి మునెప్ప ఎప్పుడో ఆస్తిని పంచి తన కోసం ఎకరా పొలం ఉంచుకున్నాడు. గంగమ్మ కొడుకు ఈ భూమిని సాగు చేసుకుంటున్నాడు. మునెప్ప వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయనకున్న ఎకరం భూమిలో తమకూ వాటా కావాలంటూ సురేశ్‌ను మంజునాథ్ డిమాండ్ చేశాడు. మంజునాథ్ భార్య ధనమ్మ, కుమార్తె కాంతమ్మ సోమవారం.. సురేశ్ సాగు చేస్తున్న ఎకరం దగ్గరకు వచ్చి.. తమకు భాగం పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ధనమ్మ, కాంతమ్మ వెళ్లిపోయిన తర్వాత సురేశ్.. గంగమ్మను పొలంలోనే ఉన్న విద్యుత్తు స్తంభానికి డ్రిప్ పైపులతో కట్టేశాడు. ఆపై వీడియో తీసి.. తన తల్లిని మంజునాథ్ కుటుంబం హింసించిందంటూ రాళ్లబూదుగూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు విచారించగా డ్రామా అని తేలింది. తప్పుడు ఫిర్యాదు చేసిన సురేశ్ కుటుంబంపై కేసు నమోదు చేసినట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించడానికి ఇటువంటి సంఘటనలను కొందరు వినియోగించుకుని వైరల్ చేస్తున్నారని డీఎస్పీ పార్థసారథి అన్నారు.

# నాణ్యమైన మద్యమే అమ్మాలి

- అంతర్జాతీయ, జాతీయస్థాయి నాణ్యత ఉండాలి
- రాజీపడొద్దు.. నాటుసారా కనబడవద్దు
- ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు
- గత ప్రభుత్వంలో జే బ్రాండ్లతో అనారోగ్య సమస్యలు
- అమ్మకాల్లో ఆన్‌లైన్ పేమెంట్లు ప్రోత్సహించాలి
- ఎక్సైజ్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష


ఎక్సైజ్ శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారులు

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాణ్యమైన మద్యం మాత్రమే అమ్మాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అనుమానాస్పదంగా ఉన్న మద్యం బ్రాండ్ల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో నకిలీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖపై సోమవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి నాణ్యత కలిగిన మద్యం మాత్రమే అమ్మాలన్నారు. ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని, అందువల్ల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టంచేశారు. ఎట్టిపరిస్థితుల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా విక్రయాలు జరగకూడదన్నారు. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున నకిలీ బ్రాండ్ల మద్యం విక్రయించడంతో ప్రజల ఆరోగ్యం పాడైపోయిందన్నారు. నకిలీ మద్యం వల్ల వ్యాపారం తగ్గి, రాష్ట్ర ఆదాయం తగ్గిందన్నారు. 2014-2019 మధ్య అమలైన మద్యం పాలసీ ఎలా ఉందనే దానిపై అధ్యయనం చేసి నివేదికను ప్రజల ముందుంచాలని ఆదేశించారు. గతంలో ఏపీకి దక్కాల్సిన ఆదాయం పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో జే బ్రాండ్ల వల్ల వినియోగదారులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడ్డారని సీఎం చెప్పారు. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిందన్నారు.

### చరిత్రలో తొలిసారి ధరలు తగ్గాయి

గత ప్రభుత్వంలో విక్రయించిన నకిలీ బ్రాండ్ల అమ్మకాలు ఎంతవరకు వరకు ఆగాయని సీఎం అధికారులను అడిగారు. గతంలో విక్రయించిన అనామక మద్యం బ్రాండ్లు ఈ ప్రభుత్వంలో పూర్తిగా తగ్గిపోయాయన్నారు. చరిత్రలో తొలిసారి మద్యం ధరలు తగ్గాయని అధికారులు తెలిపారు. ఒక్కో సీసాపై రూ. 10 నుంచి రూ. 100 వరకు ధరలు తగ్గాయన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. పేదల జేబులు కొట్టేలా ప్రభుత్వం వ్యవహరించకూడదన్నారు. దోపిడీ ఉండకూడదనే ధరలు తగ్గించామన్నారు. ఈ చర్యల కారణంగా ప్రతినెలా వినియోగదారులపై రూ. 116కోట్ల భారం తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో టాప్- 30 బ్రాండ్ల ధరలు తక్కువగా ఉన్నాయని వివరించారు. పర్మిట్ రూమ్‌లు లేకపోవడం వల్ల బహిరంగంగా మద్యం తాగే పరిస్థితి కనిపిస్తోందని అధికారులు తెలిపారు. కేసులు నమోదు చేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడట్లేదన్నారు. పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎక్సైజ్‌లో కూడా ఏఐని వినియోగించి ట్రాక్ అండ్ ట్రేస్ వ్యవస్థను పటిష్ఠంగా అమలుచేయాలని సీఎం ఆదేశించారు. డిస్టిలరీల నుంచి షాపుల వరకు మద్యం ఎలా వెళ్తుందో ట్రాక్ చేయాలన్నారు. అలాగే మద్యం అమ్మకాల్లో ఆన్‌లైన్ నగదు లావాదేవీలను ప్రోత్సహించాలన్నారు. డేటా అనలటిక్స్ ద్వారా స్టాకుపై అంచనా వేయాలని చెప్పారు. నాటుసారాపై నిఘాకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. సమీక్షలో ఉన్నతాధికారులు ఎంకే మీనా, నిషాంత్‌కుమార్, రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

## హెచ్చరించాకే.. జరిమానాలు

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు
- సిగ్నల్ జంప్ చేస్తే ఫొటోలు పంపండి
- సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన
- డ్రోన్ సిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలి
- రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘనలపై ముందస్తుగా హెచ్చరికలు చేయాలని పోలీసు శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించాకే పెనాల్టీ వసూలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని కూడళ్లలో, ప్రధాన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసే వాహనాల ఫొటోలను యజమానులకు పంపాలని ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి సమీక్షించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సాంకేతికత అర్థమయ్యేలా ప్రజలకు వివరించాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించినవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల కాలంలో ఫేక్ కాల్స్‌తో మోసాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని ఆదేశించారు. నిఘాతో నేరాలను కట్టడి చేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు అన్నింటికీ రియల్ టైమ్ గవర్నెన్స్ డేటానే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. నేరగాళ్ల భరతం పట్టేందుకు టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. నేరస్థులను పట్టుకుని, శిక్షలు పడేలా చేయాలన్నారు. ముందుగానే అనుమానితులను గుర్తించి, నేరాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. నేరాలను బట్టి డేటాలో కలర్ కోడింగ్ ఇవ్వాలన్నారు.

### 'రియల్‌టైమ్'లో మరిన్ని సేవలు

వాట్సప్ గవర్నెన్స్, డేటాలేక్, డేటా అనుసంధానం వంటి అంశాలపై సమీక్షలో చంద్రబాబు చర్చించారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో మరికొన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. టెక్నాలజీని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే సేవలను చిన్న చిన్న వీడియోల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వాట్సప్ గవర్నెన్స్ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. రాష్ట్రంలో డ్రోన్ సిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రోన్ సిటీకి విదేశీ సంస్థలు వచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెరిగేలా కంపెనీలతో చర్చలు జరపాలని సూచించారు.

## జస్టిస్ బట్టు దేవానంద్ మళ్లీ ఏపీ హైకోర్టుకు

- మద్రాస్ హైకోర్టు నుంచి బదిలీ
- రాష్ట్రపతి ఆమోదం.. కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్



అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. మద్రాస్ హైకోర్టు నుంచి తిరిగి ఏపీ హైకోర్టుకు వచ్చేందుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉంది. అదనపు న్యాయమూర్తులతో సహా ప్రస్తుతం హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 28గా ఉంది. జస్టిస్ దేవానంద్ రాకతో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరనుంది. ఆయన పదవీకాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దేవానంద్ బాధ్యతలు చేపట్టారు. 2023 మార్చిలో మద్రాసు హైకోర్టుకు బదిలీ అయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్ నేతృత్వంలో ఈ ఏడాది మే 26న సమావేశమైన సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుండి మాతృ హైకోర్టు అయిన ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే.

## పోలీసులపైనా కేసులు పెడతాం

- మా ప్రభుత్వం వచ్చాక తప్పించుకోలేరు: సజ్జల

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమ బలాన్ని చూపితే పరిస్థితి ఎలా ఉంటుందో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తమ వారిపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై తాము అధికారంలోకి వచ్చాక కేసులు పెడతామని హెచ్చరించారు. సోమవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. పోలీసుల పహారాలో వైసీపీ నేతలపై టీడీపీ నాయకులు దాడులకు దిగుతున్నారని విమర్శించారు. తమ ఓపికను చేతకాని తనంగా తీసుకోవద్దని, తమ ప్రభుత్వం వచ్చాక కేసులన్నీ తిరగతోడుతామని అన్నారు. పోలీసులు కూడా తప్పించుకోలేరని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, ఎమర్జెన్సీ పాలన సాగుతోందని ఆరోపించారు.

## పేర్ని, ప్రసన్న మాటలన్నీ జగన్ స్క్రిప్టే

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో అన్ని వ్యవస్థలు గాడినపడుతున్నాయి. కానీ వైసీపీ, జగన్ దుర్మార్గపు చర్యల వలన రాజకీయాలు రోడ్డును పడుతున్నాయి' అని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి పాలనలో కక్ష సాధింపులు ఉండవు. తప్పు చేస్తే మాత్రం ఫలితం అనుభవిస్తారు. పేర్ని నాని, ప్రసన్నకుమార్ రెడ్డి నోటి వెంట వచ్చే ప్రతి మాట జగన్ స్క్రిప్టే. 40 ఏళ్లకే నా పని అయిపోయిందని కొడుక్కి పగ్గాలు అప్పజెప్పిన వ్యక్తి పేర్ని. అలాంటి వ్యక్తి చంద్రబాబుకి వయసు అయిపోయిందని విమర్శించడం హాస్యాస్పదం. చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఆయన తక్షణం క్షమాపణలు చెప్పాలి' అని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. కాగా, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ 'వైసీపీ నాయకులు చేసిన తప్పులు, అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టారు. పామర్రు ప్రశాంతమైన నియోజకవర్గం. అలాంటి చోట పేర్ని అశాంతిని రగల్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని కుమార్ రాజా దుయ్యబట్టారు.

## నాపై పెట్టిన కేసు కొట్టివేయండి

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత పేర్ని నాని

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల భేటీల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (పేర్ని నాని) రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మచిలీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కృష్ణా జిల్లా పామర్రు పోలీసులు తన నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ పేర్ని వెంకటరామయ్య సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లో... 'నా వ్యాఖ్యల్లో కొంత భాగాన్ని మాత్రమే ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలిస్తే తప్పుడు సమాచారం, పుకార్లు వ్యాప్తి చేసినట్లు ఎలాంటి ఆరోపణలు లేవు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాకు వర్తించవు. ఆధారాలు లేని ఆరోపణలతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసును కొనసాగించడం న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయండి. అరెస్టుతో పాటు కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి' అని కోరారు.

## సజ్జల శ్రీధర్‌రెడ్డికి బెయిల్ తిరస్కరణ

- బాలాజీ గోవిందప్ప పిటిషన్ కూడా కొట్టివేత

విజయవాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. సోమవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పును వెలువరించారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టేయడం ఇది రెండోసారి. ఇంతకుముందు కూడా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీంతో ఆయన రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు.

## హిస్సార్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ బోగీ బుగ్గి



- రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోగీకీ వ్యాప్తి
- తిరుపతిలో ఘటన.. రూ.కోటి ఆస్తి నష్టం

తిరుపతి(సెంట్రల్), జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే యార్డులో అగ్ని ప్రమాదం సంభవించి రూ.కోటి ఆస్తి నష్టం జరిగింది. హిస్సార్-తిరుపతి మధ్య నడిచే వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(04717) సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతికి చేరుకుంది. ప్రయాణికులు స్టేషన్లో దిగాక సుమారు 1.40 గంటల ప్రాంతంలో రైలును యార్డుకు తరలించారు. చింతలచేను సమీపంలో రైలును పార్కింగ్ చేస్తుండగా చివరి నుంచి రెండో బోగీలో మంటలు చెలరేగాయి. గుర్తించిన రైల్వే ఉద్యోగులు వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి, మంటలు చెలరేగిన బోగీ నుంచి మిగతా పెట్టెలను వేరు చేశారు. ఆ పక్కనే నిలిపిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీకి కూడా మంటలు వ్యాపించి, దాని పెయింట్ కాలిపోయింది. దీంతో ఆ రైలు పెట్టెలనూ అక్కడ్నుంచి తొలగించారు. అగ్నిమాపక యంత్రం వచ్చే వరకు రైల్వే సిబ్బంది ఫైర్ బాల్స్ ద్వారా మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే, అప్పటికే బోగీ పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదం పార్కింగ్ ట్రాక్‌లపై జరగడంతో మిగతా రైళ్ల రాకపోకలకు ఆటంకం కలగలేదని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు కె.చినరెడ్డెప్ప తెలిపారు. అగ్ని ప్రమాదాన్ని సిబ్బంది సకాలంలో గుర్తించడంతో మిగతా బోగీలకు మంటలు వ్యాపించకుండా, పెను ప్రమాదాన్ని నివారించినట్లైందని చెప్పారు. ఘటనపై విచారణకు జోనల్ స్థాయి అధికారుల కమిటీ వచ్చే అవకాశం ఉంది.

# కొల్లిపరపై కంటితుడుపే!

- ఆ రీచ్‌లో అసలేం జరిగింది?
- తీసుకున్న చర్యలు ఏమిటి?
- గనులు, పోలీసు శాఖల మౌనం
- అక్రమార్కులపై కేసులు లేవు
- మధ్యాహ్నం ఉత్తుత్తి సీజ్‌లు..
- మంత్రి ఉన్నంతసేపు హడావుడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొల్లిపర, గుండిమెడ... ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అత్యంత కీలకమైన రీచ్‌లు. కొల్లిపర పరిధిలో లభించే ఇసుక చాలా నాణ్యమైనది. సాధారణంగానే అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. గనులు, రెవెన్యూ, ఇతర అధికారులను ఏమార్చి, మరి కొందరిని ప్రలోభపెట్టి రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక మైనింగ్ చేస్తున్నారు. వర్షాకాలంలో రీచ్‌లోకి వెళ్లి ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న కేంద్ర పర్యావరణ, అటవీశాఖ నిషేధాజ్ఞలు ఉన్నా అక్రమార్కులు ఇసుక మైనింగ్ చేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు. అక్రమాలపై ఫిర్యాదులు అందుకున్న జిల్లా మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం కొల్లిపర రీచ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అక్కడ నదిలో నాలుగు, ఒడ్డున మరో రెండు భారీ యంత్రాలు ఇసుకను తోడేస్తున్నాయి. 30కిపైగా లారీలు లోడింగ్ కోసం ఎదురుచూస్తున్నాయి. మంత్రిని చూసి అక్కడున్న కొందరు పరుగో పరుగు. ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయని తెలిసి కొందరు అక్కడే ఇసుక తిన్నెల మాటున భారీగా నగదు (రూ.8.5 లక్షలు) దాచారు. మంత్రి వెంట రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు వెళ్లి తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎలాంటి రహదారి బిల్లులూ లేకుండా లోడింగ్‌తో వెళ్లేందుకు సన్నద్ధమైన లారీలను, ఇసుక తవ్వకాలు చేస్తున్న భారీ యంత్రాలను సీజ్ చేశారు. అక్రమార్కులపై కఠినచర్యలు తీసకుంటామని మంత్రి మనోహర్ హెచ్చరించారు. అక్కడే ఉన్న ఇసుక గుట్టను, దాని నిర్వహణ రికార్డులను పరిశీలించారు. నిజానికి వర్షాకాలానికి ముందే నదిలోనుంచి ఇసుక తీసి గుట్టగా పోశారు. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదు. అయితే, కొల్లిపర రీచ్‌లో నిల్వఉన్న ఇసుక స్వయం సహాయక సంఘాల నియంత్రణలో ఉంది. అక్కడ సిద్ధంగా ఉన్న నిల్వ ఇసుకను మాత్రమే లారీల్లో లోడింగ్ చేయాలి. కానీ మంత్రి తనిఖీకి ముందే కొల్లిపరలో రాత్రిపగలు తేడాలేకుండా ఇసుక మైనింగ్ జరుగుతోంది. ఇది గనులు, రెవెన్యూ, పోలీసు శాఖకు తెలియనిదేమీ కాదు. అయితే, తెర వెనక పెద్దల ప్రమేయం ఉండటంతో పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

### మంత్రి వచ్చివెళ్లగానే షరామామూలే..

కొల్లిపర రీచ్‌ను అనధికారికంగా వేమూరుకు చెందిన ఓ వ్యక్తి నిర్వహిస్తున్నారు. ఇక్కడి తెనాలి నియోజకవర్గ నేతలతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఫలితంగా ఆయన కనుసన్నల్లో జరిగే అక్రమ ఇసుక మైనింగ్‌ను ఎవరూ టచ్‌చేయలేని పరిస్థితి. ఇక్కడ జరుగుతున్న ఇసుక దోపిడీని పట్టుకోవాలని ఈ ప్రాంతానికే చెందిన ఓ టీడీపీ నేత ప్లాన్ చేశారు. పాపం.. అది లీక్ అయింది. కొద్ది గంటల వ్యవధిలోనే మంత్రి మనోహర్ అక్కడ ప్రత్యక్షమయ్యారు. మంత్రి తనిఖీ తర్వాత అక్కడున్న లారీలు, భారీ యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. మంత్రి వెళ్లిపోగానే, రాత్రికంతా దృశ్యం మారిపోయింది. కేసులు లేవు. వాహనాల సీజ్‌లు లేవు. అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాపై చట్టపరమైన చర్యలే లేవు. అసలు ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని నిర్ధారించేశారు. దీనివెనుక ఏం జరిగి ఉంటుంది? ఎవరి ఒత్తిళ్లు పనిచేసి ఉంటాయి? వాటికి సమాధానం లేదు. నిజానికి వీటికి బదులు ఇవ్వాల్సింది గనులశాఖ. ఇదే విషయమై జిల్లా గనుల శాఖ అధికారిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించింది. మంత్రి ఆకస్మిక తనిఖీల సమయంలో తాను కొల్లిపర రీచ్‌కు వెళ్లలేదని ఆయన తెలిపారు. అది తహసీల్దార్ పరిధిలో అంశమని తెలిపారు. వాహనాలపై పెనాల్టీ వేశారన్నారు. మంత్రి తనిఖీల తర్వాత, నింపాదిగా సోమవారం ఆయన కొల్లిపరకు వెళ్లి పరిశీలించారు. అక్రమ తవ్వకాలే లేవని సర్టిఫికెట్ ఇచ్చారు.

జగన్ ప్రభుత్వంలోనూ కొల్లిపర రీచ్‌లో భారీ అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇదే విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) విచారణ చేయగా, అక్రమాలే లేవని అప్పటి గుంటూరు కలెక్టర్ 2024లో నివేదిక ఇచ్చారు. నివేదికపై ఎన్జీటీకి అనుమానం వచ్చి కేంద్ర పర్యావరణ బృందాన్ని కొల్లిపరకు పంపించి వాస్తవిక పరిశీలన చేయించింది. పర్యావరణాన్ని పణంగాపెట్టి నదీగర్భాన్ని తోడేశారని పర్యావరణ నిపుణులు తేల్చి ఎన్జీటీకి నివేదిక ఇచ్చారు. దీంతో గుంటూరు కలెక్టర్‌పై ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అదే దృశ్యం ఇప్పుడు పునరావృతం అవుతున్నట్లుగా ఉంది. గత శుక్రవారం రాత్రి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వితీస్తున్న జీపీఎస్ ఆధారిత ఫొటోలు, ఫిర్యాదులు ఉన్నాయి. అయినా, అక్కడ అక్రమ తవ్వకాలే జరగడం లేదని గనుల అధికారి చెప్పడం విశేషం.

### కొల్లిపరలో లోడింగ్ నిలిపివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కొల్లిపర ఇసుక రీచ్ విషయంలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గుండిమెడ, కొల్లిపర ఇసుక రీచ్‌లలో యథేచ్ఛగా తవ్వకాలు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతోపాటు మంత్రి నాదెండ్ల మనోహర్ జరిపిన తనిఖీల నేపథ్యంలో చర్యలకు సిద్ధమయ్యారు. సోమవారం కొల్లిపర సమీపంలోని ఇసుక స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేశారు. అక్కడున్న ఇసుక నిల్వలను పరిశీలించి లోడింగ్‌ను నిలిపివేయించారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా ప్రొక్లెయిన్‌తో నదిలో గాడికొట్టించారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ.. కొల్లిపర స్టాక్‌పాయింట్‌లో 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిర్వాహకులకు అప్పగించామన్నారు. ప్రస్తుతం స్టాక్‌పాయింట్‌లో 1,620 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ ఉందన్నారు. నిర్వాహకుల నుంచి బిల్లులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక స్టాక్‌పాయింట్ నుంచి ఎంత లోడింగ్ జరిగిందనే విషయం లెక్కతేల్చేవరకు లోడింగ్‌ను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు!

- సంతకానికి చేయి వణికే వారూ బాబు వయస్సుపై మాట్లాడతారా?
- పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత ఫైర్



అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తేవటానికి 76ఏళ్ల వయస్సులో రోజుకు 18 గంటలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబు గురించి వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సోమవారం అమరావతి సచివాలయంలో గంజాయి అంశంపై ఈగల్ డీజీ రవికృష్ణతో కలిసి హోంమంత్రి విలేకరులతో మాట్లాడారు. 'నాయకులంటే ఇతరులకు ఆదర్శంగా ఉండాలి.. గతంలో 14ఏళ్లు, ఇప్పుడు మళ్లీ సీఎంగా ఉన్న చంద్రబాబు వయస్సుపై కామెంట్లు చేయడం ఏంటి? పొద్దున్నే షుగర్, బీపీ టాబ్లెట్స్ వేసుకుంటేనే కానీ రోజు గడవని వారు, పది సంతకాలు చేసి.. 11వ సంతకం చేయాలంటే చేయి వణికే వారు కూడా చంద్రబాబు వయస్సు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. వైఎస్సార్ అలా చనిపోతారని ఎవరైనా అనుకున్నారా? ఏం మాట్లాడుతున్నారు? మాట్లాడ్డం మాకు చేతగాదనుకుంటున్నారా? మాకంటూ ఒక బాధ్యత ఉంది. మీరనే మాటలకు మేం ప్రతీకారాలు చేసుకుంటూ పోతే.. మిమ్మల్ని ఎలా చూశారో మమ్మల్నీ అలానే చూస్తారు ప్రజలు. కాబట్టి మా పని మేం చేసుకుంటున్నాం. అలాగని నోటికొచ్చినట్లు తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి తయారీ, అమ్మకం, రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై 'ఈగల్' కన్ను ఉంటుందని అనిత అన్నారు. నేరస్థుడి విషయంలో ఎవరైనా ఒక్కటేనని, చివరికి పోలీసుల పాత్ర ఉన్నా వారిపైనా చర్యలుంటాయని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే తప్పేందని అంటున్న వారిని ప్రజలు నిలదీయాలని సూచించారు. శ్రీకాళహస్తి జనసేన నాయకురాలి డ్రైవర్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈగల్ డీజీ రవికృష్ణ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడే వారు, అమ్మే వారి వివరాలతో త్వరలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈగల్‌లో 459 మంది సిబ్బందే ఉన్నా.. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజలూ సభ్యులేనని స్పష్టం చేశారు. ఆపరేషన్ గరుడ 2 త్వరలో మొదలవుతుందన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు తల్లిదండ్రులు, అధ్యాపకులు అవగాహన కల్పించాలని, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వాడినా, అమ్మినా 1972కు సమాచారం ఇస్తే.. 24గంటలు ఈగల్ సిబ్బంది అందుబాటులో ఉండి, చర్యలు తీసుకుంటారని చెప్పారు.

## జగన్ భ్రష్టు పట్టించారు.. లోకేశ్ గాడిన పెట్టారు: భూమిరెడ్డి

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): జగన్ భ్రష్టు పట్టించిన విద్యావ్యవస్థను లోకేశ్ గాడిన పెట్టారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను జగన్ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లోకేశ్...దేశంలో పేరెన్నికగన్న అనేక మంది ఆచార్యులను, ఉన్నత విద్యావంతులను ఉపకులపతులుగా నియమించారు. ఏడాదిలోనే విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్ని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు' అని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.